బాలల హక్కుల పోరాట యోధుడు

# కైలాస్ సత్యార్థి

నోబెల్ బహుమతి గ్రహీత



బయోగ్రఫీ సిరీస్

# కైలాస్ సత్యార్థి

(బాలల హక్కుల పోరాట యోధుడు)

సి.వి.యస్. రాజు

విక్టరీ పబ్లిషర్స్

డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,

విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

# కైలాస్ సత్యార్థి

(బాలల హక్కుల పోరాట యోధుడు)

©Ln. **I. Ramakumar,** PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ - 2015

**వెల. రూ. 50/-**

***Also available at:***
**www.victorypublishers.in**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : ఆంధ్రప్రదేశ్**

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
ఫోన్ : **(0866) 2570192, 2570309**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
30-17-3A, వారణాశివారి వీధి,
సీతారాంపురం, విజయవాడ - 2.
ఫోన్ : **0866 - 2444156**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : తెలంగాణా**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,
సాయిలక్ష్మీ నికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, హైదరాబాదు - 500027.
ఫోన్ : **(040) 65528228, 24653879**
సెల్ : **9346771314**

**బుక్ సెలక్షన్ సెంటర్**
కె.డి. హౌస్, 3-5-121/ఇ/1/2,
షాలిమార్ ఫంక్షన్ హాల్ దగ్గర,
రామకోటి, హైదరాబాద్.
ఫోన్ : **(040) 23446841, 23446843**
(ఇ-మెయిల్) **bschydin@gmail.com.**

**బుక్ సెలక్షన్ సెంటర్**
తిరుమల కమర్షియల్ కాంప్లెక్స్,
కామత్ హోటల్ ఎదురు, ఎస్.డి.రోడ్,
సికింద్రాబాద్. ఫోన్ : **(040) 23446849**

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపులలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచిలలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరి ముద్రణలో సరిచేయగలం. ఏ విషయమైన **ramakumarimmadisetty @yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 31712393082సాయి వేంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :* విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

# పరిచయం

కైలాస్ సత్యార్థి విశ్వవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన వ్యక్తి. అతడు బాల కార్మికుల విముక్తి కోసం పోరాటం చేసిన యోధుడు. బాలల హక్కుల కోసం పోరాడిన ధీరుడు. అనేక వేల మంది బాలకార్మికుల్ని దాస్యం నుండి విముక్తి చేసి, వారికి పునరావాసం కల్పించిన ధీశాలి. జాతీయంగాను, అంతర్జాతీయంగాను కూడా బాల కార్మికులకు విముక్తి కల్పించాడు. వారి హక్కుల కోసం పోరాడాడు. బాల కార్మికుల గురించే కాక, ప్రజల సమస్యల కోసం పోరాటం చేశాడు. ప్రజలలో బాలకార్మికుల విముక్తి గురించి అవగాహన కల్పించాడు. బాల కార్మికుల విముక్తి గురించి మాత్రమే కాదు, వారి విద్య గురించి కూడా శ్రద్ధ తీసుకున్నాడు.

కైలాస్ సత్యార్థి తన పోరాటాలలో చాలా ఆటంకాల్ని ఎదురుకున్నాడు. చివరకు భౌతికంగా కూడా బాధలు అనుభవించాడు. సత్యార్థి పేరులోనే సత్యాన్ని అర్థించేవాడని అర్థం. నిజానికి కృత్రిమంగా ఉన్న ప్రతిదానికి వాస్తవ రూపాన్ని తీసుకుని రాగలిగాడు.

కైలాస్ ఎలక్ట్రికల్ ఇంజనీరుగా వృత్తి ప్రారంభించాడు. కాని దానిని విడిచిపెట్టి బాలల పరిస్థితి వైపు తన దృష్టిని మరల్చాడు. వారి సమస్యల్ని తీర్చడానికి నడుం కట్టాడు.

భారతదేశంలో బాలబాలికల చేత పనులు చేయించడం అనాదిగా వస్తూ ఉంది. విదేశాలు కూడా దీనికి మినహాయింపు కాదు. ఇళ్లల్లో, కార్ఖానాల్లో వారిని పని చేయిస్తూ ఉండేవారు. వారికి యిచ్చే కూలి తక్కువ కాని పని ఎక్కువ. చిన్న పిల్లలు పని చేయడానికి కారణం

వారి పేదరికమే. తల్లిదండ్రులు సంపాదించేది చాలకపోవడం వల్ల వారు తమ పిల్లల్ని పనిలో పెట్టేవారు. ఆ విధంగా వారికి చదువుకునే అవకాశం లేకపోయింది. మట్టిలో చాలా మాణిక్యాలున్నాయి. వాటిని గుర్తించి, పైకి తీసి, సానబెట్టాలి. అప్పుడే వారికి మెరుగువస్తుంది. బాల బాలికల్ని ఎత్తుకుని పోయిగాని,కొనిగాని ధనికులు వారిని పనులకు ఉపయోగించు కుంటున్నారు. పిల్లలే కాక, స్త్రీ పురుషులు కూడా బానిసత్వంలో మగ్గుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల వారికి బాలబాలికల పరిస్థితిని వివరించి, ఆయా ప్రభుత్వాలు చట్టాలు చేసే స్థితికి తీసుకుని రాగలిగాడు కైలాస్. ఈనాటికి కూడా సుమారు మూడు మిలియన్ల ప్రజలు బానిసత్వం లోనే ఉన్నారు. ఈ పరిస్థితికి చలించిపోయి కైలాస్ తన వృత్తిని కూడా త్యాగం చేసి, నిస్వార్థంగా వారి విముక్తి కోసం పోరాటం సాగించాడు. అతడు 1954వ సంవత్సరంలో విదిశలో జన్మించాడు. 1980 నుండి తన పోరాటాన్ని ప్రారంభించాడు.

కైలాస్ యొక్క స్వార్థరహిత సేవల్ని గుర్తించి, అతనికి 2014వ సంవత్సరం నోబెల్ బహుమతిని యిచ్చారు.

కైలాస్ కృషి యొక్క స్ఫూర్తితో అందరూ మానవసేవకు పూను కుంటారని ఆశిస్తూ...

- రచయిత



Ln.I.Rama Kumar

# ముందుమాట

ఆధ్యాత్మిక పుస్తకాలను, నిఘంటువులు వంటి అత్యున్నత పుస్తకాలను తెలుగు ప్రజలకు అందించుచున్నాం. ఈ కార్యం నిరంతరంగా కొనసాగింపుగా అనేక గ్రంథాలు అత్యంత త్వరలో రాబోవుచున్నాయి. విద్యార్థులకు బాలసాహిత్యం అందించే కార్యక్రమంలో భాగముగా 'బయోగ్రఫీ సీరీస్' లో అనేకమంది జీవిత చరిత్రలును ముద్రించినాము. దానిలో భాగంగా నోబెల్ విజేత మలాల, సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే, బడుగు జీవుల ఆశాకిరణం జ్యోతిరావు పూలేని ముద్రించగా, మంచి ఆదరణ లభిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది. బాలల హక్కుల రక్షకుడు శ్రీ కైలాస్ సత్యార్థి జీవితంపై పుస్తకం విడుదల చేస్తున్నందుకు సంతోషంగా ఉన్నాం.

35 సంవత్సరాలు నిర్విరామంగా బాలకార్మికుల కోసం కృషి చేస్తున్న సత్యార్థి సేవలు పాశ్చాత్య దేశాలు గుర్తించి, గౌరవించినంత వరకు భారతదేశంలో ఆయనకు తగిన గుర్తింపు రాకపోవటం విచారకరం. నోబెల్ శాంతి బహుమతి ప్రకటించే వరకు ఆయన భారత దేశంలో చాలా మందికి తెలియక పోవటం విచారకరం.

నిస్వార్ధంగా తన జీవితాన్ని త్యాగం చేసి బాలల కోసం తన్నులు తిన్న పోరాట యోధుని జీవితాన్ని తెలుసుకోవటం అందరి కర్తవ్యం. మనం ఎవరికి వారం మన దైనందిన జీవితములో బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించక పోవటం శ్రీ సత్యార్థికి వచ్చిన నోబెల్ శాంతి బహుమతికి సరియైన గౌరవం మనం ఇచ్చినట్లు అవుతుందని నా భావన. ఆ దిశగా అందరం కలిసి కృషి చేద్దాం...

భవదీయుడు

I. Rama Kumar

**(ఇమ్మడిశెట్టి రామకుమార్)**

విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ

# విషయసూచిక


1. పునర్జన్మ వృత్తాంతము ........................................ 7
2. గుర్తింపదగిన పునర్జన్మ ...................................... 10
3. బాల విప్లవకారుడు ........................................ 12
4. ప్రేమ, వివాహం, ఇబ్బందులు.............................. 15
5. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ............................ 17
6. నోబెల్ బహుమతి ప్రదానం ................................ 22
7. సమస్యలకు పరిష్కారాలు .................................... 28
8. విజయానికి మెట్లు............................................ 34
9. పారదర్శకత.................................................. 42
10. కైలాస్ యొక్క ఆదర్శం, స్ఫూర్తి............................ 47
11. పోరాటం కొనసాగుతూనే ఉంటుంది ........................ 72

# 1. పునర్జన్మ వృత్తాంతం

కైలాస్ సత్యార్థి యొక్క జన్మ గురించి చాలా విచిత్రమైన సన్నివేశాలున్నాయి. చాలా కాలం క్రితం ఓర్చాలో తహశీల్దారు కైలాస్ నారాయణ తివారి అనే వ్యక్తి ఉండేవాడు. అతడు చాలా దైవభక్తి గలవాడు. ఓర్చాని రామరాజ్యం అంటారు.



ప్రపంచం నమ్మవచ్చు, నమ్మకపోవచ్చు. నారాయణ తివారి పేరున దేవుడైన రాముడు ఓర్చాలో ఉన్న పురాతన దేవాలయంలో ముగ్గురు మహాత్ములకు భోజనం పెట్టాడట. కైలాస్‌కు రాముని దీవనలున్నాయి.

కైలాస్ నారాయతివారీయే కైలాస్ సత్యార్థి అనడానికి ఒక కథ ప్రచారంలో ఉంది. కైలాస్ సత్యార్థి యొక్క తండ్రి రాంప్రసాద్ శర్మ. అతడొక పోలీసు కానిస్టేబుల్. సురేంద్రుడు అతని కుమారుడు. కుమారుడు 1952లో చనిపోయాడు. అప్పటి నుండి రాంప్రసాద్ శర్మ జీవితం దుర్భరంగా సాగింది. అప్పుడప్పుడు కొన్ని రోజులపాటు భోజనం చేసేవాడు కాదు. ఎప్పుడూ విచారంగా ఉండేవాడు. అతడు కూడా మిక్కిలి దైవభక్తి గలవాడు, నిజాయితీపరుడే కాక సంస్కారం గల వ్యక్తి. అతడు గొప్ప రామభక్తుడు. అతని యింట్లో రాముని దర్బారు ఉండేది. తన కుమారుడు సురేంద్రుడు అకస్మాత్తుగా ఎందుకు చనిపోయాడు అతనికి అర్థం కాలేదు. తనకు అటువంటి ఆపద రావడానికి కారణం ఏమిటని అందర్నీ అడిగేవాడు తాను ఏ పాపం చేశానని కారణం ఏమిటని అందర్నీ అడిగేవాడు. తాను ఏ పాపం చేశానని కుమిలిపోయేవాడు. గత జన్మలో పాపం చేసి ఉంటే అది యీ జన్మకి ఎలా వర్తిస్తుందనేవాడు.

మిత్రుల సలహాతో అతడు ఓర్చాలో ఉన్న రాముని దేవాలయానికి వెళ్లాడు. మధ్యప్రదేశ్‌లో ఓర్చా చాలా పవిత్ర క్షేత్రం. పర్యాటకులు చాలామంది అక్కడకు వచ్చేవారు. అక్కడ రాముడు రాజుగా కొలువడతాడు. అదీ ఒక రాజభవనంలో, సంతానం లేని వారికి సంతానం యిస్తాడని ఆ రామునికి ప్రతీతి.

రామరాజు గుడి గురించి స్థానికులు యీ విధంగా చెబుతారు.

మధుకర్‌షా ఓర్చాకి రాజుగా ఉండేవాడు. అతడు శ్రీకృష్ణుని భక్తుడు. అతని భార్య గణేశ్‌కున్వారి (కమలాదేవి అని కూడా అంటారు) రామభక్తురాలు. ఒకనాడు దంపతులు కృష్ణుని ఆలయానికి వెళ్లారు. కాని గుడి తలుపులు మూసి ఉన్నాయి. తిరిగి వెళ్లిపోదామని భార్య అంది కాని అతడు అక్కడే ఉందామన్నాడు. ఇద్దరూ అక్కడే ఉండి, బయట ఒక భజన బృందంతో కలిసి భజనలు, నృత్యాలు చేశారు. రాధాకృష్ణులు నిజస్వరూపాలతో వచ్చి వారితో కలసి నాట్యం చేశారు. స్వర్గం నుండి బంగారు పూల వాన కురిసింది.

తరువాత రాజు వ్రజమధురకు వెళ్దామన్నాడు. కాని రాణి అయోధ్యకు వెళ్దామని అంది. బాలునిగా ఉన్న రాముని ప్రార్థించవద్దని రాజు కోప్పడ్డాడు. కాని రాణి వినలేదు. అప్పుడు రాజు, "నువ్వు ఎంత ప్రార్థించినా నీ రాముడు ప్రత్యక్షం కాడు. నా కృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు చూశావా? నువ్వు అయోధ్యకి వెళ్లాలనుకుంటే, నీ భక్తి సత్యమైనదయితే, బాలరామునితో తిరిగి రా. అప్పుడే నువ్వు నిజమయిన రామభక్తురాలివని నమ్ముతాను" అన్నాడు. అప్పుడు రాణి తాను బాలరామునితో తిరిగి రాకపోతే తాను సరయూ నదిలో దూకి మరణిస్తానంది. ఆమె కాలినడకన అయోధ్యకు బయలుదేరింది. అంతకుముందే తన సేవకులకు ఒక ఆలయాన్ని నిర్మించమని చెప్పింది.

సరయూ నదీ తీరంలో ఉన్న లక్ష్మణ కోట వద్ద రాముని ప్రార్థించింది. మొదట పండ్లు, తరువాత ఆకులు తింటూ, ఆ తరువాత నిరాహారంగా నెలరోజు రాముని ప్రార్థించింది. కాని రాముడు ప్రత్యక్షం కాలేదు. నిరాశతో ఆమె ఒక రాత్రి సరయూ నదిలో దూకింది. ఆ సమయంలో బాలరాముడు ఆమె ఒడిలో ప్రత్యక్షమయ్యాడు. ఆమెను వరం కోరుకోమన్నాడు. బాలరామునిగా ఓర్చాకు రమ్మని కోరింది. రాముడు అంగీకరించాడు కాని మూడు షరతుల విధించాడు. అవి 1) తాను పుష్యమి నక్షత్రంలోనే బయలుదేరుతాననీ, ఆ నక్షత్రకాలం పూర్తి అయితే ఆగిపోయి, మళ్లీ పుష్యమి నక్షత్రం మొదలయిన తరువాతే బయలుదేరుతాననీ, 2) ఓర్చా చేరిన తరువాత ఓర్చాకి తానే రాజు కావాలనీ, 3) రాణి ఏ ప్రదేశంలో తనను ఆమె తొడమీద నుండి క్రిందికి దింపుతుందో అక్కడే స్థిరపడిపోతాననీ, అక్కడే రామరాజ్యం ఏర్పడుతుందనీ బాలరాముడు చెప్పాడు.

రాణి ఆ షరతులకి అంగీకరించింది. అయోధ్య నుండి వారు ఓర్చా చేరడానికి 8 నెలలు 27 రోజులు పట్టింది.

మధుకర్‌షా రాజుకి ఒక కల వచ్చింది. ఆ కలలో బంకిమ్ విహారి రామునికి, కృష్ణునికి భేదం ఉందని రాజు నమ్మినందుకు రాజుని నిందించాడు. వారిద్దరూ ఒకరేనని అతడు రాజుకి చెప్పాడు. నిద్ర లేచిన తరువాత అయోధ్య నుండి రాణి తిరిగి వస్తోందని తెలిసింది. రాజు గుర్రాలు, ఏనుగులు, ఆహారపదార్థాలతో ఆమెకు ఎదురు వెళ్ళి, ఆమెను క్షమాపణ కోరాడు. కాని ఆమె అంగీకరించలేదు. రాజు తెచ్చిన వాటిని తిరస్కరించి, తనకు అన్నీ ఉన్నాయని చెప్పింది. తరువాత రాజభవనంలో ఉన్న తన గదికి బాలరామునితో వెళ్లింది. మరునాడు ఆలయానికి బాలరాముని తీసుకుని వెళ్దామనుకుంది. రాణి తన గదిలోనే మొదట రాముని కూర్చోబెట్టింది కాబట్టి మూడవ షరతు ప్రకారం బాలరాముడు ఆ గదిలోనే శిలారూపంలోకి మారిపోయాడు. అప్పటి నుండి రామరాజ్య ఆలయం రాణివాసంలోనే ఉండిపోయింది. మొదట్లో నిలబడి శిలా రూపంలోకి మారాడు. రాణి కూడా నిలబడి రామునికి సేవ చేసేది. ఆమె అలసిపోయేది. "నువ్వు కూర్చుని సేవించు" అన్నాడు రాముడు. "నువ్వు నిలబడి ఉండగా నేనెలా కూర్చుంటాను" అంది రాణి. అప్పుడు రాముడు కూర్చున్నాడు. షరతు ప్రకారం రాముడు ఓర్చాకి రాజయ్యాడు. కాబట్టి అదే రామరాజ్యం. ఇదీ కథ.

కైలాస్ తండ్రి రామభక్తుడు. రాముని విగ్రహం వద్ద కూర్చుని తన కుమారుడు సురేంద్రుని తిరిగి యిమ్మని పోట్లాడడం ప్రారంభించాడు. అలా రామునితో పోట్లాడుతున్నప్పుడు అక్కడ తహశీల్దారు కైలాస్ నారాయణ తివారీ కనిపించాడు. అతడు కూడా రాముని సేవించడానికి వచ్చాడు. అతడు రాంప్రసాద్ శర్మతో, "నీ ప్రార్థనను రాముడు విన్నాడు. రెండేళ్ళలోగా నీకు కుమారుడు కలుగుతాడు. అతడు విశ్వవిఖ్యాతుడవుతాడు" అన్నాడు. ఈ సంఘటన 1952-53లో జరిగింది. అతడు గుడి నుండి బయటికి వస్తూ ఉండగా ముగ్గురు సాధువులు అక్కడకు వచ్చారు. "రామరాజ్యంలో ఎవరూ నిరాహారంగా ఉండరు. మాకు ఆకలివేస్తోంది. ఎవరు మాకు భోజనం పెడతారు?" అన్నారు. అక్కడ ఉన్న చౌకీదారు వారిని మాతియా అనే స్త్రీ నడుపుతున్న భోజనాలయానికి తీసుకుని వెళ్లాడు. ఆమెకు ఒక చీటీ యిచ్చాడు. దానిలో తహశీల్దారు తివారీ వారికి ఆహారం పెట్టమనీ, అతని సంతకంతో ఉంది. వారికి ఆమె భోజనం పెట్టింది. మరునాడు ఆమె తహశీల్దారు వద్దకు పోయి డబ్బు అడిగింది. తన సంతకంతో ఉన్న చీటీని చూసి అతడు ఆశ్చర్యపోయాడు. తాను ఏ చీటీ యివ్వలేదనీ, తన చౌకీదారు తన వద్దనే ఉన్నాడనీ

అతడు మాతియాకి చెప్పాడు. తహశీల్దారు ఆమెకు వారు తిన్నదానికంటె ఎక్కువ డబ్బు ఆమెకు యిచ్చాడు. అప్పటి నుండి అతడు రామరాజ్య ఆలయానికి వచ్చేవారందరికీ భోజనాలు పెట్టించేవాడు.

1954వ సంవత్సరం అక్టోబరు 14వ తేదీన రాంప్రసాద్ భార్యకి పురిటి నొప్పులు వచ్చాయి. రెండు గంటలలో ఆమెకు మగపిల్లవాడు పుట్టాడు.

అతడు తులాలగ్నంలో పుట్టాడు. శని-బుధులు కలిసిన మేషరాశిలో జన్మించాడు. గురుడు ఉచ్ఛస్థితిలో ఉన్నాడు. రాంప్రసాద్ తన కుమారుడు సురేంద్రుడే పుట్టాడని అతనికి సురేంద్రుడు అని పేరు పెట్టాడు. ఆ బాలుడు కొంచెం పెద్దవాడైన తరువాత (21/2 సంవత్సరాల వయస్సు) అతనిని సురేంద్రుడని పిలిస్తే అంది తన పేరు కాదనేవాడు. తాను కైలాస్ నారాయణ తివారీనని చెప్పేవాడు. అలా పిలవడం అందరికీ ఆటగా ఉండేది. "సురేంద్రుడెవరు? నేను ఓర్చాకి తహశీల్దారుని. రాముని ఆజ్ఞ చేత నేను జన్మించాను" అనేవాడు.

తరువాత రాంప్రసాద్ కైలాస్ తివారీని కలవాలని ఓర్చాకి వెళ్తే అతడు కొన్ని నెలల క్రితమే చనిపోయాడని చెప్పారు.

# 2. గుర్తింపదగిన పునర్జన్మ

కైలాస్ సత్యార్థి అందరి పిల్లలలాంటివాడు కాడు. మిగిలిన పిల్లలందరూ యిష్టారాజ్యంగా ఉంటే, అతడు చాలా సున్నితమనస్కుడిగా ఉండేవాడు. ఎప్పుడూ దిగంబరంగా ఉండేవాడు కాడు. బహిఃప్రదేశాలలో మల విసర్జన చేసేవాడు కాడు. వీధిబాలురు కుక్కల్నిగాని, పిల్లుల్నిగాని తాటితో కట్టివేస్తే అతనికి కోపం వచ్చేది. అతడు అందర్నీ ప్రశ్నలు అడుగుతూ ఉండేవాడు. తండ్రి యెడల చాలా భయభక్తులు కలవాడు. తల్లి అతనిని ఎంతగానో ప్రేమించేది. పెద్దల్ని గౌరవించేవాడు. దేవాలయాల ముందుగా వెళ్లినప్పుడు నమస్కారం చేసేవాడు.

మూడేళ్ల వయస్సు వచ్చేవరకూ తాను తహశీల్దారు చెప్పేవాడు. సురేంద్ర అంటే కోపగించుకునేవాడు. ఈ విషయంపై కైలాస్ తల్లి చాలా బాధపడేది. కైలాస్ తన గత జన్మ గురించి చెప్పినప్పుడల్లా ఆమె ఆ విషయాన్ని మార్చేది. గత జన్మ గురించి తాను చెప్పడం తల్లికి యిష్టం లేదని కైలాస్ గుర్తించాడు. ఆ విషయం ఎత్తడం మానివేశాడు.

కైలాస్ అన్నయ్య జగ్‌మోహన్‌శర్మ. అతడు తన తండ్రి దైవభక్తుడని చెప్పేవాడు. తల్లి గృహిణి. అందరికంటె పెద్దకొడుకు చంద్రభానుశర్మ. అతనికి చదువు, ఆటలు అంటే యిష్టం. అతనికి విద్యాశాఖలో ఉద్యోగం వచ్చింది. అంతకు ముందు కూడా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నాడు. కైలాస్ కూడా ఇంటిపనుల్లో సాయపడేవాడు. చదువన్నా, ఉద్యోగం అన్నా యిష్టం ఉండేది కాదు. కైలాస్ తరువాత నరేంద్రశర్మ. అతడు ఉపాధ్యాయుడు. కైలాస్ తండ్రి సంతానంలో నాలుగవవాడు. తరువాత లీలాశర్మ అనే సోదరి. ఆమె చాలా గారాబంగా పెరిగింది.

కైలాస్ చిన్నతనంతో అతని అన్న చంద్రభానుశర్మ అతనికి దీపావళి సంబరాలు చూపించడానికి ఢిల్లీ తీసుకుని వెళ్లాడు. బెట్వానదీ తీరంలో పేరు పొందిన గణేశుని ఆలయం ఉంది. ఒకసారి విదిశలో వరదలు విపరీతంగా వచ్చినా, ఆ ఆలయం చెక్కు చెదరలేదు. ఢిల్లీ నుండి తిరిగి వస్తూ ఉండగా చంద్రభాను యొక్క స్నేహితుని తల్లిదండ్రులు కలిశారు. వారు అతనిని సురేంద్ర అని పిలవబోయి ఆగిపోయారు. పెద్దల్ని గౌరవించే కైలాస్ ఆ రోజు వారిని గౌరవించలేదు. అతడు తన పేరును కైలాస్ అని పదే పదే చెప్పసాగాడు. ఆ సంఘటన గురించి కైలాస్ తన తల్లిదండ్రులతో చెప్పాడు. అప్పటి నుండి వారు తమ కుమారుని కైలాస్ అని పిలవడం మొదలుపెట్టారు. కైలాస్‌కి నాలుగేళ్లు రాగానే దుర్గ్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

విదిశలో కైలాస్ యింటికి దగ్గర్లో మొఘల్ తోలామసీదు ఉంది. దానికి వెనుక ఉన్న రోడ్డుని చోర్‌గల్లీ అంటారు. ఆ రోడ్డులో వెళ్లడానికి అందరూ భయపడేవారు. కైలాస్ 1959లో ఆ స్కూలులో ఒకటవ తరగతిలో చేరాడు. మొదటి రోజే అతడు సంచలనం సృష్టించాడు. కైలాస్ తండ్రి తన విధులకు వెళ్లిన తరువాత చంద్ర భాను అతనిని స్కూలుకి దిగబెట్టవలసి వచ్చింది. స్కూలులో అంతా పకడ్బందీగా ఉండేది. బూట్లు పాలిష్ చేసుకోవాలి, గోళ్లు కత్తిరించుకోవాలి. తలదువ్వుకోవాలి. స్కూల్ యూనిఫారం వేసుకోవాలి. స్కూలు బ్యాగు ఉండాలి. అందువల్ల స్కూలులోకి వెళ్లేముందు విద్యార్థులు తమ బూట్లను శుభ్రం చేసుకోవాలి. దానికోసం ఒక చెప్పులు కుట్టేవాడు స్కూలు బయట కూర్చుని ఒక పైసా యిస్తే బూట్లు పాలిష్ చేసేవాడు. ఒకనాడు కైలాస్ స్కూలులోకి వెళ్తూ ఉండగా బయట ఒక బాలుడు బూట్లు పాలిష్ చేయడానికి కూర్చున్నాడు. ఆ బాలుడు స్కూలులోకి వెళ్లే బాలుర దుస్తులు, బూట్లూ చూస్తు ఉండిపోయేవాడు. కైలాస్ అతనిని తనతోపాటు స్కూలులోకి రమ్మన్నాడు. ఆ స్కూలులో స్కూలు ఫీజు చాలా తక్కువ.

స్కూలు ప్రార్థనతో ప్రారంభమయ్యింది. మొదటి పీరియడులో నీతి కథలు చెబుతారు. కైలాస్‌కి పాటలు పాడుతూ ఆ బాలుని గురించే ఆలోచిస్తున్నాడు. ప్రార్థన పూర్తి అయిన తరువాత ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల్ని వరుసగా తరగతి గదులలోకి పంపుతున్నాడు. కైలాస్ ఆ ఉపాధ్యాయుని, "బూట్లు పాలిష్ చేస్తున్న యీ బాలుని తరగతిలోనికి ఎందుకు రానివ్వలేదు?"అని అడిగాడు. ప్రిన్సిపాల్‌కి పిల్లల మనస్తత్వం తెలుసు. "అతని తల్లిదండ్రులు స్కూలుకి ఆ బాలుని పంపితే అనుమతిస్తాను" అన్నాడు. సాయంకాలం కైలాస్‌ని తీసుకుని వెళ్లడానికి తల్లి వచ్చింది. వెంటనే తల్లితో యింటికి వెళ్లాడు. ఆ బాలుని పట్టించుకోలేదు.

రెండవరోజు శుక్రవారం.స్కూలు సగం రోజు మాత్రమే పని చేస్తుంది. ముస్లింలకు నమాజ్ చేసుకోవడానికి వీలుగా అలా నాలుగు పీరియడ్లు మాత్రమే పెడతారు. ఆ సమయంలో కైలాస్ బాలుని తండ్రి వద్దకు వెళ్లి ఆ బాలుని స్కూలుకి పంపమని చెప్పాడు. అప్పుడతడు, "నేను స్కూలుకి వెళ్లలేదు, నా తల్లిదండ్రులు వెళ్లలేదు, నా తాత వెళ్లలేదు. అందువల్ల మా అబ్బాయి కూడా వెళ్ళడు. మేము కూలీలం. ఇతరులకు సేవ చేయడమే మా పని" అన్నాడు. ఆ మాటలు కైలాస్ మనస్సులో ఎటువంటి భావాల్ని కలిగించాయో ఎవరూ ఊహించలేదు.

ఆ స్కూలులో కైలాస్ అయిదవ తరగతి వరకు చదివాడు. అతడు చాలా తెలివైనవాడు.

# 3. బాల విప్లవకారుడు

కైలాస్ గురించి రాజ్యసభ సభ్యుడు చౌదరి మునవర్ సలీమ్ యిలా అన్నాడు.

"కైలాస్ నాకంటె కొంచెం పెద్దవాడు. నాకు 6వ సంవత్సరం వచ్చిన నాటి నుండి అతనిని తెలుసు. ఆ సమయంలోను, మేము ఇంజనీరింగు పూర్తి చేసిన సమయంలోను నాకు పరిచయం. కాని అంతకు ముందు జరిగిన సంఘటనలు నాకు తెలియవు. అతడు తన తల్లిదండ్రుల సంతానంలో చిన్నవాడు. బాల్యం నుండి మంచి ప్రతిభ కలిగినవాడు. ఆటవస్తువులన్నా, ఖరీదైన దుస్తులన్నా అతనికి ఆసక్తి లేదు. తల్లిదండ్రుల్ని ఏమీ అడిగేవాడు కాదు. అతడు స్కూలుకి వెళ్లేటప్పుడు తన ఆహారాన్ని బిచ్చమెత్తుకునే బాలునికి యిచ్చేశేవాడు. తను పస్తుండేవాడు. ప్రతి బాలునికీ చిలిపితనం ఉంటుంది. ఉయ్యాల ఊగాలని ఉంటుంది. దాగుడుమూతలాట ఆడుకోవాలని ఉంటుంది. కైలాస్‌కి కూడా అవి యిష్టమే. అతనికి రాముని యొక్క గుణాలు నచ్చాయి.తండ్రి గురించి అతడు చేసిన త్యాగం నచ్చింది.

మొహరంపండుగ సందర్భంగా అతడు 11ఏళ్ళ ప్రాయంలోనే షర్బత్ అమ్మేవాడు. కృతార్థులైన విద్యార్థుల నుండి పుస్తకాలు సంగ్రహించి, పేద బాలబాలికలకు యిచ్చేవాడు. ఏ బాలుడైనా బిచ్చమెత్తుకున్నట్లు కనబడితే ఆ భిక్షాపాత్ర లాక్కుని అతనికి ఆహారం, పుస్తకాలు యిచ్చేవాడు. వాళ్లని బాగా చదువుకోమని చెప్పేవాడు. గాయాలతో బాధపడేవారి గాయాల్ని శుభ్రం చేసేవాడు. ఇతరులతో, కులవివక్ష లేకుండా కలిసి భోజనం చేసేవాడు. అలా చేసినప్పుడు శిక్షగా అతనిని ఎండలో నిలబెట్టేవారు. రతీదేవి శర్మ అనే సోదరి అలా శిక్షని యివ్వనిచ్చేది కాదు. సత్యార్థికి కులవివక్ష లేదని ఆమె చెప్పేది. సంఘం కోసం ప్రతి నిత్యం పాటుపడేవాడనేది. గాంధీగారిలా అతడు ఖాకీపాంటు, తెల్లచొక్కా ధరించేవాడు.

అతడు నిరాడంబరుడు. అతనికి కావలసినవి చాలా స్వల్పం. చిన్నప్పుడే కైలాస్ అంటే మాకు చాలా యిష్టం ఉండేది. బాగా చదువుకునేవాడు, తెలివైనవాడు.

అతడు సుమారు 15 ఏళ్ల వయస్సున్నప్పుడు జైన్ స్కూలులో చదివాడు. అప్పుడు సుమారు 7 సంవత్సరాలు వయస్సు గలవారు హోటళ్లలో పాత్రలు కడుగుతూ ఉండేవారు. అతడు అదే వయస్సు గల పిల్లల్ని చేరదీసి, ఆ హోటళ్ల ముందు నినాదాలు చేయించేవాడు. ఆ హోటళ్ల యజమానులు భయపడి ఆ బాలుర తల్లిదండ్రుల్ని కూడా పనిలో పెట్టుకునేవారు.



అప్పుడప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు మార్కెట్టుకి వచ్చి అక్కడ విందు భోజనాలు ఏర్పాటు చేసుకునే వారు. వారి కారు డ్రైవర్లు ఆకలి వేసినా కార్లలోనే కూర్చుండిపోయే వారు. కైలాస్ ఒక ఉద్యమాన్ని లేవదీశాడు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ వాహనాల్ని అటువంటి సమయాల్లో వాడకూడదని ఆ ఉద్యమం యొక్క ఉద్దేశం. తరువాత ఆ ఉద్యోగులు ప్రభుత్వ వాహనాల్ని వాడడం మానివేశారు. అయినా రహస్యంగా యింకా వాడుతూనే ఉండేవారు.

కైలాస్‌కి సైకిలు ఉండేది. దానిని నేను కూడా తొక్కేవాడిని. ఒకసారి వారి పట్టణానికి బయట ఉన్న ఒక గ్రామంలో మంటలు చెలరేగాయి. ఇళ్లన్నీ అడ్డదిడ్డంగా ఉండి, ప్రణాళికా బద్ధంగా కట్టకపోవడం వల్ల మంటలు బాగా వ్యాపించాయి. మంటలు ఆర్పే యంత్రాలు

రాలేదు. ఆ విషయం తెలిసిన కైలాస్ అక్కడకు వెళ్ళి మంటల్ని ఆర్పడం మొదలుపెట్టాడు. కొంతమంది అతనికి సహాయం చేశారు. ఆర్పడంలో అతని చేతులు కాలాయి.

ఇటువంటి సంఘటనలు చూసి, అతని భావాలు అర్థం చేసుకోలేక అతని తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. విద్యార్థులకు చదువులో కూడా అతడు సాయం చేసేవాడు. రాను రాను అతడు పేదలకు, సాయం అవసరమైన వారికి కూడా సహాయ పడేవాడు. అతడు కూడా పేదరికంలో ఉండడం వల్ల గ్రంథాలయాల సహాయంతో చదువుకునేవాడు.

ఇంజనీరింగు ప్రవేశపరీక్షలో మంచి ర్యాంకు వచ్చినందువల్ల అతనికి సామ్రాట్ అశోక్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం దొరికింది. అక్కడ కూడా విద్యార్థులకు సహాయం చేసేవాడు. అతని స్నేహితుడు ప్రకాష్ సోనీ యిలా అంటాడు. “కైలాస్ ఎవరికయినా అన్యాయం జరిగితే సహించేవాడు కాడు. ఎదిరించి న్యాయం లభించేవరకు పోరాడాడు. అందువల్ల హాజరు తక్కువైంది. పరీక్షకు కూర్చోలేదు. తరువాత యింకొక సెమిస్టరులో కూర్చున్నాడు”. ఇలా జరిగినందువల్ల అతని అన్న, వదినలకు కోపం వచ్చింది.

అతని స్నేహితుడు అశోక్‌వర్మ యిలా అంటాడు.“స్కూలు స్థాయి నుండి ఇంజనీరింగు స్థాయివరకు మేము సమ్మెలు చేశాం, ర్యాలీలు నిర్వహించాం. అన్యాయాన్నీ విచక్షణనీ ఎదిరించాం, సమానత్వం కోసం పోరాడాం. జై ప్రకాష్‌గారి ఉద్యమంలో పాల్గొన్నాం. 144వ సెక్షన్ కింద మమ్మల్ని అధికధరల కోసం చేసిన ధర్నాలో జైలులో పెట్టారు. ఆ ఇన్‌స్టిట్యూట్‌కి అనుమతి లేనందున డిగ్రీవరకు మాత్రమే ఉంది. తరువాత 1970లో పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీవరకు తరగతులు నడిపారు.”

ఇంకొక స్నేహితుడు యిలా అన్నాడు. “పేదరికం అతని కృషిని ఆపలేకపోయింది. ఇంజనీరింగ్ చదువుతూన్నప్పుడు పాత్రలు లేకపోవడం వల్ల పాయసం నేలమీదే తయారు చేశాడు. తరువాత గాంధీ విగ్రహం వద్ద స్వీపర్ల చేత వంట చేయించాడు. అది వార్తల్లోకి ఎక్కింది”.

“విదిశలో ఆర్య సమాజం యొక్క కార్యకలాపాల్ని కైలాస్ నిర్వర్తించాడు. వివాహం అయిన తరువాత అతడు ఇంజనీరింగ్ కాలేజీలో బోధించాడు” అంటాడు అతని బాల్య స్నేహితుడు.

అతని భార్య సుమేధ యిలా అంటుంది. “మా వివాహం 1978లో జరిగింది. మేము విదిశలోనే ఉన్నాం. రెండేళ్ళు కైలాస్ ఇంజనీరింగు కాలేజిలో బోధించాడు. తరువాత బాలలహక్కుల కోసం, బాల కార్మిక వ్యవస్థకి వ్యతిరేకంగాను పోరాడడానికి నిశ్చయించాడు. మాకు భువన్‌రిభు 1979లో పుట్టాడు. ప్రసవం మా అమ్మగారింట్లో ఢిల్లీలో జరిగింది.”

ఆమె తన కుమారునికి ఒక యేడాది వయస్సున్నప్పటికీ కైలాస్‌కి అండగా నిలిచింది. అతడు కాలేజీలో ఉద్యోగం మానివేశాడు. అది 1980వ సంవత్సరం. అతడు సంఘర్ష్ జరీ రహేగా" అనే పత్రిక ద్వారా అణగద్రొక్కబడిన వారి గురించి అవగాహన కల్పించాడు. అప్పుడు వారు మింటోరోడ్డులో నివసించేవారు. అక్కడ నుండి బాల కార్మికుల విముక్తి కోసం, వారి హక్కుల కోసం పోరాటం సాగించాడు. "మేము వార్తాపత్రికల్ని నేల మీద పరిచి, వాటిలో భోజనం చేసేవారం. మా కల నెరవేరడానికి యిటువంటివి అడ్డు కాలేదు. నేను విదిశలో ఉన్నప్పుడే కైలాస్ భావాలు తెలిశాయి. అతని చిన్ననాటి ఫొటో నా వద్ద లేదు. రాంప్రసాద్ శర్మ యొక్క ఫొటో ఉండేది. దానిని సరి చేస్తానని ఒక ఫొటోగ్రాఫరు తీసుకుని వెళ్లాడు. తరువాత ఆ ఫొటో పోయిందని చెప్పాడు. ఇది వరకు కెమేరాలు ఉండేవి కావు" అంటుంది సుమేధ".

కైలాస్‌కి రామ్ మనోహర్‌లోహియా దృక్పథం బాగా నచ్చింది. వాటి వల్ల స్ఫూర్తి పొంది, "యువశాఖ సమాజ్ వాదీ యువజన్"ని 1971లో ప్రారంభించాడు. అతడు సమాజ్‌వాది పార్టీలో జిల్లా మహామంత్రిగా పనిచేశాడు. రాజ్యసభ సభ్యుడైన మునవర్ సలీమ్ కైలాస్‌ని తన రాజకీయ గురువుగా భావిస్తాడు. "1975–80 వరకు చాలా కష్టపడ్డాం. తరువాత ఢిల్లీకి మారాం" అంటుంది సుమేధ.

# 4. ప్రేమ, వివాహం, ఇబ్బందులు

అక్టోబర్ 2వ తేదీ, 1976 సంవత్సరంలో కైలాస్ 'జన్‌జ్ఞాన్' అనే పత్రికా కార్యాలయంలోకి వచ్చాడు. ఆ కార్యాలయం కరోల్‌బాగ్ రోడ్డు జంక్షన్‌లో ఉంది. ఆర్య సమాజం యొక్క సిద్ధాంతాల్ని ప్రచారం చేయడానికే ఉద్దేశించబడింది. గాంధీజయంతి కారణంగా ఆ రోజు ఆఫీసుకు సెలవు. కైలాస్ లోపలికి వెళ్లేసరికి యిద్దరు ముగ్గురు వ్యక్తులు ఫైళ్లని సర్దుతున్నారు. కైలాస్ వారిలో ఒకరితో, "దశ, దిశ" అనే పేరుతో నేను రాసిన వ్యాసం మీ మ్యాగజైన్‌లో పడింది" అన్నాడు. సీనియర్ సబ్–ఎడిటర్ అయిన సుమేధ తల పైకెత్తి, కైలాస్‌ని చూసి ఆశ్చర్యంతో" అది సాధ్యం కాదే?" అంది. "ఎందువల్ల? నా పేరు నా ముఖం మీద రాసి ఉంటుందా?"అని చిరునవ్వుతో అన్నాడు. అంటూ అనుమతి తీసుకోకుండానే ఒక కుర్చీలో కూర్చున్నాడు. సుమేధ ప్రక్క గదిలో ఉన్న సీనియర్ ఎడిటర్‌తో ఫోన్‌లో మాట్లాడింది. వెంటనే దయానంద సంస్థాన్‌కి చైర్‌మన్ అయిన పండిట్ భర్తేంద్ర నాథ్ కైలాస్‌ని తన గదిలోకి రమ్మని పిలిచాడు. భర్తేంద్ర నాథ్ ఆర్య సమాజానికి మూల స్తంభం. అతడు మహాపండితుడు, బహుభాషాకోవిదుడు. అతడు నాలుగు వేదాల్ని హిందీలో రాశాడు.



సుమేధ కైలాస్‌తో చాలాసేపు సంభాషణ సాగించింది. ఆమె సూర్యనగర్‌లో ఉంటున్నాననీ, పండిట్ భర్తేంద్రకి తాను రెండవ కుమార్తెననీ, తన అక్క పేరు జ్యోత్స్న అనీ, చెప్పింది. తాను మ్యాగజైన్‌ను ప్రచురించడంలో తన తండ్రికి సహాయం చేస్తూ ఉంటానని చెప్పింది. తనకు ఆభా, త్రిచ, దివ్య అనే చెల్లెళ్ళు ఉన్నారంది. దివ్య చాలా గారాబంగా పెరిగిందని చెప్పింది. తన తల్లి రాకేష్ రాణి కూడా ప్రచురణలో సహాయపడేదని చెప్పింది. భర్త చనిపోయినా ఆమె ఆర్య సమాజం యొక్క కార్యక్రమాలలో పాల్గొనేది. దివ్య, ఆమె భర్త కృష్ణకాంత్ కొట్టాల్ తన తల్లికి సహాయం చేసేవారని చెప్పింది.

భర్తేంద్రనాథ్ కైలాస్‌ని, యింకొక వ్యక్తిని రాత్రి యింటికి తీసుకుని వచ్చి కైలాస్‌ని పరిచయం చేశాడు. అతనితో వచ్చిన వ్యక్తి ఓమ్‌ప్రకాష్ శ్రీవాత్సవ్ అని చెప్పాడు. ఆ రోజు వారిద్దరూ తమ యింట్లోనే భోజనం చేస్తారన్నాడు. కైలాస్ మాటలకి అందరూ ముగ్ధులయ్యారు. రాత్రి 12 గంటల వరకూ మాట్లాడుతూనే ఉన్నారు. వారు రాత్రి అక్కడే పడుకున్నారు. మరునాడు ఉదయం టీ తాగి కైలాస్ వెళ్ళిపోయాడు. సుమేధతో ఒక్కమాట అయినా మాట్లాడలేదు. ఆమెకి బాధ కలిగింది. అతనిని పెళ్ళి చేసుకుంటానని ఆమె అప్పుడు ఊహించలేదు. ఏడాది వరకు కైలాస్ వారిని కలవలేదు. 50 సంవత్సరాల వివాహ జీవితం గడిపిన తరువాత అప్పటి సంఘటన గుర్తు చేసుకుంటే సుమేధ తాను కైలాస్‌ను ప్రేమించినట్లనిపించింది. ఆ సంఘటన ఏడాది గడిచింది. కైలాస్ నన్ను పలకరించకుండా తండ్రి గదిలోకి వెళ్ళాడు. అతని స్నేహితుడు ఓమ్‌ప్రకాష్ కైలాస్ యొక్క కృషి, వాటి ఫలితాల్ని చెప్పాడు.

# 5. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన

మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జై ప్రకాష్ నారాయణ్‌ల భావాల వల్ల కైలాస్ ప్రభావితం చేయబడ్డాడు. ఎన్నికలలో నిలబడమని జై ప్రకాష్ చెప్పినా తన స్నేహితులకి, సంఘానికి సేవ చేయడమే తన లక్ష్యం అని చెప్పాడు. 1977లో జై ప్రకాష్ చేసిన ఉద్యమంలో పాల్గొన్నాడు. 1980లో స్వామి అగ్నివేశ్‌తో కలిసి బానిసల విముక్తి కోసం ఉద్యమంలో పాల్గొన్నాడు. అతడు "సంఘర్ష్ జారీ రహేగా" అనే మ్యాగజైనును ప్రచురించాడు. దళితుల జీవితాల్ని ఆ మ్యాగజైన్ ప్రతిబింబించేది. బాలకార్మికుల అవస్థలు కైలాస్‌ని ఎంతగానో కదిలించాయి. వారిని గురించి ఒక చట్టాన్ని చేసినా అది కంటితుడుపుగా మాత్రమే ఉంది.

ఘురాన్ మహతో అనే సంఘ సేవకుడు నాగరుత్తరి అనే గ్రామంలో బాల కార్మికులు, బానిసలు పడే కష్టాల్ని కైలాస్‌కి చెప్పాడు. కైలాస్ తన బృందంతో అక్కడికి వెళ్లాడు. అక్కడ ఉన్నవారు యీ బృందం మీద దాడి చేశారు. కైలాస్ నాగరుత్తరి గ్రామం నుండి కాలినడకను ఢిల్లీ చేరుకున్నాడు. మార్గమధ్యంలో ఆ గ్రామంలో జరిగిన అరాచకాన్ని ప్రజలకి వివరించాడు. ఈ సంఘటనే "బచ్‌పన్ బచావో ఆందోళన్"కి దారితీసింది.

1980లో తన జీవితం గురించి ఏమీ ఆలోచించకుండా బాలకార్మికులు ఎక్కువగా ఉండే మీర్జాపూర్, భడోయి, సహర్ష, సుపాల్, మధేపుర అనే ప్రదేశాలలో పర్యటించాడు. బీహారులోని యితర గ్రామాలలో కూడా పర్యటించాడు. రాజగిర్‌లో 11మంది బాలికల్ని విముక్తి చేసి వారికి పునరావాసం కల్పించాడు. హిషువా అనే గ్రామంలో బాలకార్మికులు లేకుండా చేశాడు.

సుమేధ ఆ సంఘటనల గురించి యిలా చెబుతుంది. "మూడు దశాబ్దాల కాలంలో సంఘర్ష్ జారీ రహేగాకి దేశవ్యాప్తంగా సమాచారాలు, సమస్యలు వచ్చేవి. వాటిని మేము ప్రచురించేవారం. చండీఘర్ నుండి పెద్ద సమస్య ఒకటి వచ్చింది. వాసల్‌ఖాన్ అనే వ్యక్తి ఒక ఇటుకలు తయారు చేసే కర్మాగారంలో యజమాని పిల్లల్తో పని చేయిస్తున్నాడనీ, ఒక 15 సంవత్సరాల బాలిక కూడా వారిలో ఉందనీ సమాచారం యిచ్చాడు. ఆ పిల్లల్ని అమ్మడానికి కూడా ప్రయత్నిస్తున్నాడనీ తెలిసింది. కైలాస్ తన బృందంతో ఒక ఫొటోగ్రాఫర్‌ని కూడా వెంటబెట్టుకుని ఆ కర్మాగారానికి వెళ్లాడు. ఆ 15 ఏళ్ల బాలికని, బాలురను కూడా విమక్తుల్ని చేశాడు. యజమాని పోలీసుల్ని పిలిపించాడు. అక్కడ జరిగిన

తోపులాటలో ఫొటోగ్రాఫరు యొక్క కెమేరా పగిలింది. కాని ఫొటో తీసిన టేపు మాత్రం మిగిలింది. కైలాస్ ఫొటోల్ని వార్తాపత్రికలకు యిచ్చాడు. అతడు కోర్టు ద్వారా బాలకార్మికుల్ని విముక్తి కల్పించాడు.

ఈ సంఘటన తరువాత "బచ్‌పన్‌బచావో" ఆందోళన ప్రారంభమయింది. కైలాస్ అగ్నివేశ్‌తో కలిసి "బంధ్వముక్తిమోర్చా"ని స్థాపించాడు. ఇది ముఖ్యంగా బాలకార్మిక వ్యవస్థని నిర్మూలించడానికి ప్రారంభించారు. ఇది అందరిలోను ఒక అవగాహన కలిగించింది. దీని ద్వారా "బాలమిత్ర గ్రామం" ప్రారంభమయింది. విముక్తి పొందిన బాలబాలికలకు పునరావాసం యిక్కడ ఏర్పాటు చేశారు. ఇక్కడ విముక్తి చెందినవారు స్వతంత్రంగా జీవించేటట్లు శిక్షణ యివ్వబడతారు. వారికి విద్య నేర్చుకునే అవకాశం కల్పించారు. బాల పంచాయితిని ఏర్పాటు చేశారు. దీనిలో స్థానికులు కూడా పాల్గొన్నారు. ఈ పంచాయితీలో నిర్ణయాలు తీసుకుంటారు. 1998లో కైలాస్ ప్రపంచవ్యాప్తంగా బాలకార్మిక వ్యవస్థకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించాడు. ఆ ర్యాలీలో 108 దేశాలవారు, 14,000 సంస్థలు, 7 మిలియన్ల ప్రజలు పాల్గొన్నారు. భోపాల్ గ్యాస్ విషాదంలో కైలాస్ బాధితుల్ని ఆదుకున్నాడు.



సుమేధ యిలా అంటుంది. "మొదట్లో కైలాస్ దృష్టి" బంధ్వముక్తి అభియాన్" మీదే ఉండేది. కాని చండీఘర్ సంఘటన తరువాత బాలకార్మికుల్ని విముక్తి చేయాలని కొన్ని సంవత్సరాలు పోరాడాడు. తరువాత 1986లో "బచ్‌పన్ బచావో" ఆందోళన చేపట్టాడు. ఆ పిల్లల్ని విముక్తి చేసి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చాలనేదే అతని ఆశయం. అతని మీద చాలా సార్లు దాడి కూడా జరిగింది. తన పేరును కూడా మార్చుకుని పోరాడాడు. ఇంటికి తిరిగి వస్తాడో లేడో అని కూడా భయపడ్డాను. అయిదేళ్ళలో అతని మీద ఏడు పర్యాయాలు దాడి జరిగింది. ఆ మాఫియా వారు రక్తపిపాసులు. ప్రజలు, సంఘం అతనికి చేదోడువాదోడుగా ఉండడం వల్ల ముందుకు సాగాడు.

B.B.A.(బచ్‌పన్ బచావో ఆందోళన్) పోలీసుల సహాయంతో ఇటుక ఫ్యాక్టరీల నుండి, తివాచీల పరిశ్రమ నుండి బాలకార్మికుల్ని విముక్తి చేయగలిగాడు. తల్లిదండ్రులు డబ్బు తీసుకున్నందువల్ల ఆ పిల్లలు కార్మికులు కావలసి వచ్చింది. ఈ పోరాటాల సత్యార్థి, అతని బృందం చాలా పర్యాయాలు గాయాల పాలయ్యారు కూడా. కొంతమంది హత్య చేయబడ్డారు. 1990 కల్లా కొన్ని వేల మంది బాల కార్మికులు విముక్తులయ్యారు. చాలా ఆశ్రమాలు ఏర్పాటయ్యాయి. వారికి విద్య నేర్చుకునే అవకాశం కలిగింది. "బాలమిత్ర గ్రామం"ఏర్పాటు చేసిన తరువాత అక్కడ పిల్లల్ని పని చేయనిచ్చేవారుకారు. వారిని స్కూళ్లల్లో చదివించారు. ఇది 2011లో జరిగింది. దాదాపు 350 గ్రామాలు దీనిని అనుసరించాయి.

జాతీయంగానే కాక, అంతర్జాతీయంగా కూడా కార్యక్రమాన్ని అమలు జరిపి వారి సహకారం కూడా కావాలనుకున్నాడు. అతని కృషి వల్ల 1989లో దక్షిణ ఆసియా సంస్థ ఏర్పడింది. దీనిలో ఉద్యోగులు, సంస్థలు చాలా పాల్గొన్నాయి. తమ మద్దతు తెలిపాయి. బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక కూడా దీనిలో పాల్గొన్నాయి. 1994లో సత్యార్థి "రగ్‌మార్క్" ను స్థాపించాడు. అంటే పిల్లలు తివాచీలను తయారు చేయకూడదనే సంకల్పంతో దీనిని ప్రారంభించారు.

1990లో కైలాస్ దీని కోసం ఒక ఉద్యమాన్నే లేవదీశాడు. ఈ ఉద్యమం వల్ల బాలకార్మికుల విముక్తే కాక, మానవహక్కుల పరిరక్షణ కూడా జరిగింది. ఇటువంటి ఉద్యమాల వల్ల కైలాస్‌కి అమిత గౌరవం లభించింది. అతడు సవాళ్లని అవకాశాలుగా మార్చగలిగాడు.

1989లో అతడు మీర్జాపూర్‌లోని తివాచీ పరిశ్రమ నుండి పదిమంది పిల్లల్ని విముక్తి చేసి, వారి స్వగ్రామానికి రైలులో తీసుకుని వెళ్దామని అనుకుంటూ ఉండగా, 50 మంది పిల్లల్ని యిద్దరు దళారులు తీసుకుని వెళ్లడం గమనించాడు. రైలు ఎక్కడం

మాని, వారిని ఆపడానికి ప్రయత్నించాడు. అంతలో పోలీసులు అక్కడికి వచ్చారు. కానివారు దళారుల పక్షాన నిలిచారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాడనే నెపంతో కైలాస్‌ను ప్లాట్‌ఫాం మీద ఉన్న పోలీసు కంట్రోల్ గదిలో బంధించారు. విముక్తి కలిగించే ఉద్యమాలే కాక, ఒత్తిడి కూడా అవసరమని కైలాస్ అనుకున్నాడు.

మీర్జాపూర్-భడోయీ తివాచీ పరిశ్రమని లక్ష్యంగా తీసుకున్నాడు కైలాస్. బాలకార్మికులను తివాచీ పరిశ్రమలో ఉపయోగించకుండా ఉండడానికి రగ్‌మార్క్‌ను ప్రారంభించాడు. 1980లో సత్యార్థి 'బానిసల విముక్తి ఉద్యమం"తో కలిసి న్యూఢిల్లీలో తివాచీ పరిశ్రమలో బాలకార్మికుల్ని ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం నడిపాడు. వారణాసి నుండి భడోయి వరకు తివాచీ పరిశ్రమ ఎక్కువగా ఉంది. మూడు లక్షలమంది బాల కార్మికులు వాటిలో పని చేస్తున్నారు. ప్రభుత్వము, పరిశ్రమ అంగీకరించకపోయినా, సుప్రీంకోర్టు సహాయంతో కొన్ని వేలమందికి విముక్తి కలిగించాడు.

కైలాస్ ఉద్యమంలో పాల్గొన్న డా॥ లెనిన్ రఘువంశీ యిలా అంటాడు.

“నేను, కైలాస్ భడోయి వెళ్లాం. తివాచీ పరిశ్రమ వద్దకు చేరాం. అక్కడ బాల కార్మికులు చాలామంది పని చేస్తున్నారు. పరిశ్రమ యజమానితో కైలాస్ 14 ఏళ్లలోపు పిల్లల్ని పనిలో పెట్టడం నేరమని చెప్పాడు. అతడు మాపై దాడి చేశాడు. తరువాత మేము అఖిల భారత తివాచీ పరిశ్రమల సంఘం యొక్క సమావేశానికి వెళ్లాం. వారు కూడా మా మీద దాడి చేశారు. అయినా సత్యార్థి ఆందోళన విరమించలేదు. అంతలో కైలాస్ స్నేహితులు, జిల్లా పరిపాలనా శాఖ కలిసి అక్కడికి వచ్చారు. వారి సహాయంతో పిల్లల్ని విడిపించాం. 1993లో జగదీశ్‌పూర్‌లో బాల కార్మికుల్ని వినియోగిస్తున్నారని తెలిసి కైలాస్ అక్కడ తహశీల్దారుని కలిశాడు. ఆయనతో కలిసి పరిశ్రమ మీద దాడి చేసి 62మంది బాలకార్మికులకు విముక్తి కలిగించాడు. ఉంజ్‌లో 25మందిని, 1997లో విశ్వనాథ్ గ్రామంలో 7మందిని విముక్తుల్ని చేశాడు.”

“బచ్‌పన్ బచావో ఆందోళన” ద్వారా ఫిరోజాబాదు గాజు పరిశ్రమ నుండీ, శివకాశీలోని దీపావళి సామాన్ల తయారీ కేంద్రం నుండీ కూడా చాలామందికి విముక్తి కలిగించాడు. 1994 నుండి 1999 మధ్య కాలంలో దాదాపు 10,000మంది బాలకార్మికులు విడుదల చేయబడ్డారు. కైలాస్ యొక్క కృషి అమెరికాకు వ్యాపించింది. వార్తాపత్రికలలో యీ అంశం గురించే ప్రచురించబడింది. ఇది ఎంత దూరం పోయిందంటే వినియోగదారులు తివాచీలను కొనడం మానేశారు. అమ్మకాలు చాలావరకు తగ్గిపోయాయి. ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది.

ఐరోపాలో సత్యార్థి ప్రారంభించిన ఉద్యమం వల్ల అందరూ తివాచీలు కొనడాన్ని బహిష్కరించారు. కాని సత్యార్థి ఉద్దేశం అది కాదు. పిల్లలు తయారు చేసినవాటిని కొనవద్దని అతని అభిప్రాయం. అందువల్ల అతడు తివాచీల మీద "పిల్లల చేత తయారు చేయబడలేదు" అనే చీటీని అంటించమని కోరాడు. చివరకు అతడు తాను అనుకున్నది సాధించగలిగాడు. అందుకే "రగ్‌మార్క్" వచ్చింది. ఆ గుర్తు ఉన్న వాటిని కొనమని అతడు పిలుపు యిచ్చాడు. ఇది 1994లో భారతదేశంలో మొదలయింది. నేపాల్, పాకిస్తాన్‌లు యీ విధానాన్ని అనుసరించాయి.

"రగ్‌మార్కు" ఒకటే పాతుకుని పోయిన యీ సమస్యకి పరిష్కారం కాదు. ఇది ఒక మార్గం మాత్రమే. దీనివల్ల పిల్లల్ని పనిలో ఉపయోగించడం కొంతవరకు తగ్గిందని చెప్పవచ్చు. అంతేకాక, పెద్దవాళ్లని ఉపయోగించడం వల్ల ఉద్యోగ అవకాశాలు కూడా పెరిగాయి. 1998 మే నెలలో "అంతర్జాతీయ రగ్‌మార్కు" ప్రారంభమయింది. 2009వ సంవత్సరంలో దీనిపేరు మారి "గుడ్‌వీవ్ అంతర్జాతీయ" గుర్తుగా అయింది. ఈ రోజు దీని నెట్‌వర్క్ భారతదేశం, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్, అమెరికా, లండన్, జర్మనీలలో ఉంది. ఐరోపా, ఉత్తర అమెరికాలలో యిది లైసెన్సులు కూడా జారీ చేస్తుంది. అందరూ తివాచీల మీద "గుడ్‌వీవ్" గుర్తుంటేనే కొంటున్నారు. అయినా కొంతమంది బాలకార్మికుల్ని ఉపయోగిస్తూనే ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థని నిర్మూలించడానికీ, దాని గురించి అవగాహన కల్పించడానికీ కఠినమైన చట్టాన్ని ప్రవేశపెట్టాలి. కైలాస్ ఆధ్వర్యంలో చాలా ఉద్యమాలు జరిగాయి. 1993లో బచ్‌పన్ బచావో ఆందోళన జరిగింది. ర్యాలీలు జరిగాయి. 2000 కి.మీ. నడకతో ఢిల్లీ – బీహార్ ర్యాలీ వల్ల ప్రజలలో అవగాహన కలిగింది. 1994లో కన్యాకుమారి నుండి ఢిల్లీ వరకు ర్యాలీ జరిగింది. 1995లో కోల్‌కత్తా నుండి ఖాట్మండు వరకు ర్యాలీ జరిగింది. 1998లో ప్రపంచవ్యాప్తంగా ర్యాలీ జరిగింది. ఇది చాలా గొప్ప ఆకర్షణ. ప్రపంచంలోని ప్రముఖుల మద్దతు దీనికి లభించింది. దీనిలో బిల్‌క్లింటన్, టోనీబ్లెయిర్, ష్రేక్, కె.ఆర్. నారాయణ్, రాష్ట్రపతులు, రాజులు, రాణులు పాల్గొన్నారు. 7 మిలియన్లకు పైగా ప్రజలు పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ILOC) 182 అనే దానిని ప్రవేశపెట్టి బాల కార్మిక వ్యవస్థని నిర్మూలించదలచుకుంది. ఇక్కడ గమనించ వలసిందే మంటే 1999 వరకు దీనిని గురించి చట్టం ఏమీ లేదు. అలాంటి చట్టం కావాలన్న వ్యక్తి కైలాసే. బాలమిత్ర గ్రామాన్ని 2001లో ప్రారంభించాడు. దీనిలో పిల్లల అసెంబ్లీ స్థాపన జరిగింది. ఇది గ్రామ కౌన్సిల్‌తో అనుసంధానించబడింది. స్కూలులో పిల్లల్ని చేర్పించడం

జరిగింది. ఇంకొక ఉద్యమం “ముక్తి కారవాన్”! “చక్రాల మీద (వాహనం) ఉద్యమం” ఇది 2006 లో ప్రారంభమయింది. దీని మీద ఇదివరకే విడిపించబడిన పిల్లలు కళలలో శిక్షణ పొంది ప్రదర్శనలు యిస్తారు. ఇలా చేయడం వల్ల పిల్లలకు విద్య అవసరమనీ, వారిని బానిస వృత్తి నుండి విడిపించడమనీ అవగాహన అవుతుంది.

మార్చి 2007లో సత్యార్థి దక్షిణాసియా ర్యాలీ నిర్వహించాడు. కైలాస్ సత్యార్థి చేసిన కృషి కారణంగా అంతర్జాతీయంగానే కాక, భారతదేశం కూడా చట్టంలో మార్పులు, చేర్పులు చేసింది. మన దేశంలో బాల కార్మికుల్ని, వారి బాగోగులను గురించీ ఎవరూ పట్టించుకునేవారు కాదు. ఆ ఘనత కైలాస్ సత్యార్థికే దక్కుతుంది. బాలకార్మిక వ్యవస్థ అంటే సత్యార్థి. సత్యార్థి అంటే బాల కార్మిక వ్యవస్థ. రెంటికీ అవినాభావ సంబంధం . సత్యార్థి భవిష్యత్తులో విద్యావిధానానికి ప్రపంచవ్యాప్త ఉద్యమానికి సృష్టికర్త. బచ్‌పన్ బచావో ఉద్యమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా అతనికి గుర్తింపు వచ్చింది. మొదట్లో చిన్న బృందంగా ఏర్పడినది. యిప్పుడు ప్రపంచమే ఒక బృందంగా మారింది. ఈ ఉద్యమం అతి క్లిష్టమైనదే కాక, అతి ప్రమాదకరమైనది కూడా. దీనిని గురించి చట్టాలు తీసుకుని రావడంలోను, ప్రజలలో అవగాహన కలిగించడంలోను సత్యార్థిది కీలకమైన పాత్ర. అతని మీద జరిగిన దాడులలో అతి ప్రమాదకరమైనది దుస్తుల దుకాణాల నుండి, మిఠాయి దుకాణాల నుండి బాలకార్మికుల్ని విడిపించడంలోను జరిగిన దాడి. 2004లో గ్రేట్ రోమన్ సర్కస్ నుండి వారిని విముక్తి చేయడంలోను జరిగిన దాడి కూడా చాలా ప్రమాదకరమైనది. అతని దీక్ష, పట్టుదల అతనిని ప్రపంచస్థాయికి తీసుకుని వచ్చింది.

# 6. నోబెల్ బహుమతి ప్రదానం

ఇంతకు ముందు నోబెల్ బహుమతికి ఎంపికచేయడంలోను,ప్రదానం చేయడం లోను చాలా విమర్శలు ఉండేవి. కాని కైలాస్ సత్యార్థి, మలాలా విషయంలో ప్రతికూలత లేనే లేదు. నార్వే కమిటీని యీ విషయంలో అందరూ అభినందించారు. పాకిస్తాన్‌లో బాలబాలికల విద్య కోసం మలాలా ఉద్యమం చేస్తే, బాల కార్మికుల్ని విడుదల చేయాలని సత్యార్థి ఆందోళన చేశాడు. బాలల హక్కుల కోసం పోరాడిన వీరిద్దర్నీ నోబెల్ బహుమతికి ఎంపిక చేసినందుకు ప్రపంచమంతా సంతోషించింది. ముఖ్యంగా యువత సంతోషించింది. ఎందుకంటే ప్రస్తుత యువతకు ఏది మంచో, ఏది చెడ్డో తెలుసుకునే విచక్షణా జ్ఞానం ఉంది. కైలాస్, మలాలాలు యిద్దరూ రక్తపాతానికి గురి అవుతూ ఉండే దేశాలకి చెందిన వారే. ఎంతటి ఆటంకాలు వచ్చినా బెదరకుండా యిద్దరూ తమ కృషిని కొనసాగించినవారే.

నోబెల్ బహుమతి ఆల్‌ఫ్రెడ్ నోబెల్ చనిపోయిన తేదీ 10, డిసెంబర్‌న యివ్వబడుతుంది. అతడు 1895లో చనిపోయాడు. 1901 నుండి యీ బహుమతులు యివ్వబడుతున్నాయి. నోబెల్ శాంతి బహుమతి ఆస్లోసిటీ హాలులో రాచకుటుంబం, ప్రభుత్వం, 1000 మంది ప్రముఖ అతిథుల సమక్షంలో యివ్వబడుతుంది. ఇతర నోబెల్ బహమతులు అదే రోజున స్టాక్‌హోం కాన్సర్ట్ హాలులో యివ్వబడతాయి. ఆ సాయంకాలం బహుమతి గృహీతలకు విందు యిస్తారు. ఆస్లోవిందు గ్రాండ్ హోటల్‌లోను, స్వీడన్ విందు స్టాక్ హోం సిటీ హాలులోను జరుగుతాయి.

నోబెల్ బహుమతి యిచ్చేటప్పుడు నాలుగు రోజుల పాటు కార్యక్రమాలు జరుగుతాయి. డిశంబరు 9వ తేదీన బహుమతి గృహీత ప్రెస్ కాన్ఫరెన్సులో మాట్లాడతాడు. సాయంకాలం అతడు నోబెల్ కమిటీకి అతిథి, విందు గ్రాండ్ హోటల్‌లో జరుగుతుంది. డిశంబరు 11వ తేదీ సాయంకాలం నోబెల్ కాన్సర్ట్‌కి వెళ్లి ఆస్లో స్పెక్ట్రమ్ ధరించి అన్ని దేశాలకు టెలివిజన్ ద్వారా కనపడతాడు. నోబెల్ బహుమతికి ఎంపిక చేయడం ఫిబ్రవరి 1వ తేదీలోగా జరుగుతుంది. ప్రత్యేక నియమాల్ని పాటిస్తూ నామినేషన్ దాఖలు చేయబడుతుంది. అభ్యర్థి పేరును ప్రకటించడానికి ప్రత్యేకమైన తేదీ లేదు. అక్టోబర్‌లో రెండవ శుక్రవారం నాడు పదకొండు గంటలకు ప్రకటన సాధారణంగా జరుగుతుంది. నవంబర్ 15న కూడా ప్రకటించవచ్చు.



మలాలా, కైలాస్‌లు తమ ప్రధానమంత్రులు కూడా ఆ వేడుకలో ఉండాలని కోరారు. 2014వ సంవత్సరపు నోబెల్ శాంతి బహుమానం వీరిద్దరికీ ప్రకటించారు. ఆ సమయంలో ప్రపంచ దేశాలు యుద్ధానికి సన్నద్ధమవుతున్నాయి. ఉక్రెయిన్, ఇజ్రాయెల్, హమాస్‌లలో యుద్ధం మొదలయింది. సిరియాలో జరిగిన సంఘటన వల్ల అది ఇరాక్ వరకు ప్రాకింది. దక్షిణాసియా దేశాలకు, సూపర్ పవర్లకు మధ్య ఉత్కంఠ పెరిగింది. ఆఫ్ఘనిస్తాన్, యెమెన్, పాకిస్తాన్, సోమాలియా, మెక్సికో, నైజీరియా, లిబియా, యితర దేశాలు రక్తపాతాన్ని చూశాయి. ఆ సమయంలో దేశాలలో శాంతి కరవైనా మలాలాకి, సత్యార్థికి నోబెల్ శాంతి బహుమతిని ప్రదానం చేశారు. శాంతి అంటే రెండు దేశాల మధ్య మాత్రమే కాదు మానవజాతి అంతటికీ ఉండాలి.

అంతర్జాతీయ వాతావరణం సమతౌల్యంలో లేదు. శాంతిని నెలకొల్పడానికి సాధువులు, భక్తులు పూనుకోవలసిన పని లేదు. రాజకీయ నాయకులు చిత్తశుద్ధితో ఆ పనికి పూనుకోవాలి. యుద్ధం చేస్తూన్న వారిలో యుద్ధం ఆపాలనే తీవ్రమైన కోరిక ఉండాలి. యుద్ధం చేసేవారి యొక్క కోరికలు తీరితేనే శాంతి సాధ్యం అవుతుంది.

నోబెల్ బహుమతిని ప్రదానం చేయడంలో విమర్శలు వస్తూ ఉండేవి. ఇజ్రాయేల్ ప్రెసిడెంట్‌కి 1978లో నోబెల్ బహుమానం యిచ్చారు. ఇంకొకరితో కలిపి సంయుక్తంగా



యివ్వబడింది. ఆ ప్రధానమంత్రి బిగిన్‌కి టెర్రరిస్టులతో సంబంధం ఉండేది. ఒక బాంబు కేసులో ఉన్నాడు. అదేవిధంగా అప్పటి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు జాతీయ సెక్యూరిటీ సలహాదారుగా ఉన్న హెన్రీ కిసింజర్‌కి, ఉత్తర వియతనామ్‌లో యుద్ధం ఆపడానికి మధ్యవర్తిత్వం వహించిన వెడ్యూదోకి సంయుక్తంగా యిచ్చిన నోబెల్ శాంతి బహుమతి విషయంలో కూడా విమర్శలు వచ్చాయి. 1994వ సంవత్సరంలో యాసర్ ఆరాఫత్, షిమన్ పేరిస్, ఇట్జాక్ రేబిన్‌లకు నోబెల్ శాంతి బహుమతి యిచ్చినప్పుడు కూడా విమర్శలు ఎదురుకున్నారు.

కాబట్టి కొన్ని సమయాలలో యీ శాంతి బహుమానం అర్హులకు అందలేదు. అందువల్ల అసంతృప్తి ఉంది. 114 సంవత్సరాల నోబెల్ బహుమతి ప్రదానం చరిత్రలో 95సార్లు మాత్రమే బహుమతి యివ్వబడింది. కాని 1964వ సంవత్సరంలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌కి సెలక్షన్ కమిటీ సరియైన నిర్ణయం తీసుకుని శాంతి బహుమానం యిచ్చింది. మహాత్మాగాంధీకి, రూజ్‌వెల్ట్‌కి, వాలేసాకి బహుమానం దక్కలేదు. అయితే నెల్సన్ మండేలాకి, డిక్లర్క్‌కి 1993లో సంయుక్తంగా యివ్వబడింది.

సత్యార్థికి శాంతి బహుమతి వస్తుందని ఎవరూ ఊహించలేదు. ప్రపంచానికే కాదు, అతని స్వదేశంలో కూడా ఎవరికీ తెలియదు. వచ్చిన తరువాత లోపాలు వెదికారు కొందరు. విచిత్రం ఏమంటే అతడు తన స్వదేశంలో ఉన్నప్పుడే ఆ బహుమానం వచ్చింది. ఇప్పుడు ప్రజలు అతనిని కలవాలనుకుంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అతనిని స్వయంగా కలిశాడు. ఇది గర్వించదగిన విషయం.

కైలాస్ ప్రారంభించిన ప్రపంచవ్యాప్త ఉద్యమానికి పాశ్చాత్యదేశాలు మద్దతు యిచ్చాయి. స్వామి అగ్నివేశ్, సత్యార్థి కలిసి బంధ్వముక్తి మోర్చా గురించి పని చేశారు. జర్మనీ, అమెరికాలలోని సంఘాలు సత్యార్థికి ఆర్థిక సహాయం చేశాయి. అతడు అంతర్జాతీయ సౌభ్రాతృత్వం కోసం ఉద్యమాలు చేస్తున్నాడనడానికి యిదే నిదర్శనం. తన జీవితం అంతా మానవసేవకే అంకితం చేసిన మదర్ థెరిస్సాకే విమర్శలు తప్పలేదు. విమర్శకులు కైలాస్‌ను కూడా వదలిపెట్టలేదు. కాని అతడు తన లక్ష్యాన్ని వీడలేదు.

జాతి, మత, వర్గ, సంస్కృతీ భేదాల వల్లే మానవులు విడిపోతున్నారని కైలాస్ గ్రహించాడు. దానిని వ్యతిరేకించాడు. ప్రాంతీయ సంఘం ద్వారా అంతర్జాతీయంగా ప్రపంచాన్ని ఒకే తాటి మీదకు తేవాలని అనుకున్నాడు. అందుకే ఏషియన్ కల్చరల్ ఫోరమ్‌ని ఏర్పాటు చేశాడు. "ఏషియన్ సాలిడారిటీ లింక్"కి అతడు కన్వీనరుగా ఎన్నికయ్యాడు. దీని ద్వారా బాల బానిసల పరిస్థితిని అందరికీ అవగాహన కల్పించేటందుకు

యిది వేదిక అయింది. ఈ సమస్యని జెనీవాలో యునైటెడ్ నేషన్స్ గ్రూపు ముందు ఉంచగలిగాడు. ఇది సాధారణమైన విషయం కాదు. ఎందుకంటే భారతప్రభుత్వానికి, యితర దక్షిణాసియా ప్రభుత్వాలకి మధ్య పరస్పర అవగాహన లేదు. ఆ ప్రభుత్వాలు బాల కార్మిక వ్యవస్థ లేనే లేదంటున్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా సత్యార్థి ముందుకు సాగిపోయాడు. అందర్నీ ఉత్సాహపరుస్తూ పౌరసంఘాల్ని అన్ని ఖండాలలోను ప్రారంభిం చాడు. సత్యార్థి మంచి వక్త. దళితులు, అణగద్రొక్కబడినవారి అవస్థలను గురించి అనేక ప్రసంగాలు చేశాడు. పిల్లల చేత తయారు చేయబడిన ఉత్పత్తుల్ని కొనవద్దని చెప్పాడు. దాని కోసం ఉద్యమాల్ని నడిపాడు. ప్రపంచదేశాలు తిరగడం వల్ల అతనికి అనేకమంది స్నేహితులు, మద్దతుదార్లు లభించారు. వీరిలో సామాన్యుల నుండి అన్ని రంగాలలోని వారు ఉన్నారు. ప్రభుత్వాధికారులున్నారు. ఎక్కడికి వెళ్లినా అతనికి పిల్లలతో ఆత్మీయ బంధం ఏర్పడింది. మనసా, వాచా, కర్మణా ప్రపంచంలో అందరు పిల్లలకి స్వేచ్ఛ కల్పించాలనేది అతని తపన. యునైటెడ్ నేషన్స్ వర్కింగ్ గ్రూపు ముందు యీ సమస్యని ఉంచిన ఘనత కైలాస్ సత్యార్థిదే. ప్రపంచవ్యాప్తంగా ర్యాలీ జరగడానికి అనుమతి రావడమే అసలు సమస్య. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ని పాల్గొనేటట్లు చేయడానికి సత్యార్థి ఒక్కడే ఒంటరిగా కృషి చేశాడు.

2002వ సంవత్సరపు 93వ రాజ్యాంగ సవరణ బిల్లులో బాలురకు విద్య ప్రాధమిక హక్కుగా చేర్చాలని దానికి మద్దతుగా జాతీయ ఉద్యమాన్ని ప్రారంభించాడు. 160మంది పార్లమెంట్ సభ్యుల మద్దతు కూడగట్టుకున్నాడు. ఈ సందర్భంగా ఆరునెలల పాటు “శిక్షాయాత్ర” చేశాడు. 2002లలోనే దానిని సాధించగలిగాడు. జర్మనీ ప్రభుత్వాన్ని బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం చట్టం చేయమని కోరాడు. ఆ ప్రభుత్వం యీ సమస్యని పరిష్కరించడానికి నిధులు కేటాయించింది. ఈ నిధి తాత్కాలిక నిధిగా కాక, శాశ్వత నిధిగా ఏర్పాటు చేయించగలిగాడు. ఆ నిధిని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ద్వారా ఖర్చు చేయాలి. బాలకార్మిక వ్యవస్థని నిర్మూలించడానికి యిది ఆధారమయింది. ఇప్పుడది ప్రాధాన్యతని సంతరించుకుంది.

సాధారణంగా విదేశాల నుండి సహాయం కావాలంటే దేశం యొక్క సాంఘిక సమస్యల్ని కొంత అతిశయోక్తిగా చెబుతారు. దేశం హీన స్థితిలో ఉందని చెబితే సానుభూతి లభిస్తుంది. సత్యార్థికి వాస్తవం తెలుసు కాబట్టి కథ యింకోలా ఉంది. చాలా సంస్థలు కైలాస్ చేపట్టిన బచ్పన్ బచావో ఆందోళనని మెచ్చుకున్నాయి. నిజంగా దేశంలో సాంఘిక సమస్యలున్నాయి కాబట్టి యధాతథంగా చెప్పవచ్చును. అతిశయోక్తిగా చెప్పడం నేరం.

అలా చేస్తే చాలామంది కటకటాల వెనక ఉండవలసి వచ్చేది. సత్యార్థిని విమర్శించేవారు కూడా బాల కార్మిక వ్యవస్థకి ఒక తీవ్రమైన సమస్యగా పరిగణించారు.

నోబెల్ బహుమతి కమిటీకి ఎవరైతే సన్నిహితంగా ఉంటారో, ఆ ప్రభావం వల్ల వారు బహుమతికి ఎంపిక కావచ్చు. కాని సత్యార్థికి తన తీవ్రకృషి వల్లనే ఆ బహుమతి లభించింది. “ఒక భారతీయుడు, ఒక పాకిస్తానీ బహుమతికి అర్హుడు” అని నోబెల్ కమిటీ అన్నప్పుడు అది విమర్శల్ని ఎదురుకుంది. సత్యార్థి ఒక్క బాల కార్మిక వ్యవస్థపైనే కాక, నిరక్షరాస్యత, స్త్రీల హక్కులు, వ్యభిచారం మొదలైన వాటిని గురించి కూడా పోరాడాడు. 23 సంవత్సరాల యువతి మీద సామూహిక అత్యాచారం జరిగితే దానిని తీవ్రంగా ఖండించాడు. అంతేకాక, స్త్రీలను బానిసలుగా చేయడం, బాల్య వివాహాలు, స్త్రీలను వ్యభిచారంలోకి దింపడం మొదలైన సాంఘిక సమస్యల గురించి కూడా పోరాటాన్ని సాగించాడు. వరకట్న దురాచారాన్ని ఖండించాడు.

యువతుల్ని ఎత్తుకుని పోయి గాని, డబ్బు ఎర చూపిగాని యితర దేశాలకి చేరవేయడం, వారిని అక్కడ బానిసలుగా చేయడం, లేదా వ్యభిచారంలోకి దింపడం మొదలైన వాటిని తీవ్రంగా ఖండించాడు. దాదాపు ప్రతి సంవత్సరం 4,000మంది పిల్లలు అదృశ్యమవుతున్నారు. ఎంతమంది అదృశ్యమవుతున్నారో, తిరిగి ఎంతమంది యింటికి చేరుతున్నారో లెక్కలు లేవు. పేదరికం, నిరుద్యోగం, లింగ విచక్షణ, సరియైన చట్టాలు లేకపోవడం, మొదలైన వాటి వల్ల యిటువంటివి జరుగుతున్నాయి. పేదవారు తాము సంపాదించే డబ్బు చాలకపోవడం వల్ల తమ పిల్లల్ని పనులకు పంపుతున్నారు. కాబట్టి తల్లిదండ్రుల్ని ఆకర్షించి, ఎక్కువ డబ్బు వస్తుందని చెప్పి, పిల్లల్ని తీసుకుని వెళ్తున్నారు. ఈ పిల్లలకి చదువు లేదు. స్వేచ్ఛ లేదు. ధనికుల యిళ్లలో పని చేస్తున్నారు. ఈ విధంగా చేసే ముఠాలు చాలా ఉన్నాయి. ఈ పిల్లల్ని అన్ని రకాలుగా దోచుకుంటున్నారు. కుటుంబానికి సన్నిహితంగా ఉండి, మిత్రులుగా నటించేవారే యిలాంటి చర్యలకి పాల్పడుతున్నారు. అలా తీసుకుని వెళ్లినవారు ఎక్కువ పని భారంతో కుంగిపోతున్నారు. వారికి సక్రమంగా జీతాలు కూడా యివ్వరు. అంతేకాక, వారు అత్యాచారానికి కూడా గురి అవుతున్నారు. పోలీసులు కూడా వారిని వేధిస్తారు. అనేక రోగాలకు కూడా వారు బలి అవుతారు.

అస్సాం, మేఘాలయ, నాగాల్యాండ్, మణిపూర్, మిజోరమ్, త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిమ్ మొదలైన రాష్ట్రాలు యిటువంటి కార్యకలాపాలకి నిలయాలు. కోలకతా, ఢిల్లీ, బెంగుళూరు, ముంబయి, డార్జిలింగ్ మొదలైన ప్రదేశాలకు వారిని తీసుకుని వెళ్తారు.

చాలా సందర్భాలలో స్త్రీలను, బాలికలను స్థానిక రవాణా మార్గాల ద్వారా తీసుకుని వచ్చి, సిల్‌గురికి తెస్తారు. అక్కడ నుండి వారిని వారు తీసుకుని వెళ్లవలసిన ప్రదేశాలకు చేర్చుతారు. తప్పిపోయిన వారి కోసం తల్లిదండ్రుల రిపోర్టులు చూస్తే చాలామందిని మెట్రో నగరాలకి తరలిస్తున్నారని తెలుస్తూంది. వలస వచ్చిన వారిని ఉద్యోగాల పేరుతో యితర దేశాలకు తీసుకుని వెళ్తారు. నిజానికి వారు చెప్పినట్లుగా అక్కడ ఉండదు. విశ్రాంతి లేకుండా వారు 18 గంటలు పని చేయవలసి వస్తుంది. వారిని గృహ నిర్బంధం చేస్తారు. వారు ఎవరితోనూ సంప్రదింపులు జరపకూడదు. తమ కుటుంబాలతో కూడా.

40 శాతం పోలీసుల్ని ఇంటర్‌వ్యూ చేస్తే వారికి యీ విషయం తెలియదని చెప్పారు. అలా తీసుకుని వెళ్లే వారి దృష్టి దళితుల మీద, మైనర్ల మీద కేంద్రీకరింపబడుతుంది. ఇది సర్వత్రా జరుగుతూనే ఉంది. బంగ్లాదేశ్ నుండి తరలించుకుని వచ్చిన వారిని మయన్మార్‌కి చేరుస్తారు. రికార్డుల ప్రకారం 2000లకు పైగా తరలింపబడ్డారు. వారిలో విముక్తి పొందిన వారు సుమారు 1300ల మంది. బాలికలు సుమారు 900ల మంది విడిపించబడిన వారిలో ఉన్నారు. వారంతా 15 నుండి 30 సంవత్సరాల మధ్య వారే. వారిలో చాలా మంది వ్యభిచార కూపంలో మగ్గుతున్న వారే. వారిని విడిపించడం చాలా కష్టం. సత్యార్థి వీటి కోసం ఉద్యమాలు చేశాడు. కాని పట్టుబడిన ముఠాలకి కఠిన శిక్షలు లేకపోవడం వల్ల ఆ వ్యాపారం నిరాటంకంగా సాగుతూనే ఉంది. మలాలాకి, సత్యార్థికి నోబెల్ బహుమానం యివ్వడం వల్ల సరిహద్దుల్లో యిటువంటి వ్యాపారాలు జరుగుతున్నాయని ప్రపంచానికి తెలిసింది. వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వాలు పూనుకోవడానికి ప్రయత్నిస్తాయి.

# 7. సమస్యలకు పరిష్కారాలు

అమెరికా సంయుక్త రాష్ట్రాల విదేశాంగ శాఖ కార్యదర్శి అయిన కాండోలీజరైస్ మనుష్యుల్ని అమ్మడాన్ని గురించి యీ విధంగా అంటారు. “ఏ దేశమైనా యీ సమస్య గురించి పోరాడదలచినా, అమెరికా యొక్క మద్దతు ఉంటుంది. ఈ విధంగా మానవుల్ని తరలించడం సహించం. పోరాటాన్ని మేమూ కొనసాగిస్తాం. ప్రజలందరికీ పూర్తి స్వేచ్ఛ వచ్చే వరకు పోరాడతాం” అతడు రాసిన పుస్తకంలో వంద దేశాలకు పైగా ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తుల కార్యక్రమాలన్నింటిలోను కైలాస్ సత్యార్థి ప్రవేశపెట్టిన బచ్‌పన్ బచావో ఆందోళనకే ప్రథమ ప్రాధాన్యత లభించింది.

భారత ఉపఖండంలో కైలాస్‌లో కొత్త గాంధీని ప్రజలు చూశారు. మిలిటరీ ప్రసక్తి లేకుండా శాంతియుతంగా ఉండే సంఘాన్ని నిర్మించడానికి కృషి చేయమని ప్రపంచ దేశాలు కైలాస్‌ని కోరాయి.

కైలాస్ బాలాకార్మిక ఉద్యమాన్ని చేపట్టక ముందు దానిని గురించి ఏం జరుగుతుందో కూడా ఎవరికీ పట్టలేదు. అతని కృషితోనే అన్ని దేశాలకు దానిని గురించి అవగాహన కలిగింది. అతడు చాలా దేశాలు తిరిగి అందరికీ బాల కార్మికులు పడే అవస్థలను గురించి అందరికీ తెలియజేశాడు. తరువాత అతని ఉద్యమంలో ఒక్కొక్కరుగా చేరారు. అతని కృషి చాలా శ్లాఘనీయము, అమోఘము అయింది. అధిక జీతం వచ్చే ఉద్యోగాన్ని కూడా వదలుకుని, అనేక కష్టనష్టాలకు ఓర్చి బాలకార్మికుల హక్కుల గురించి, వారి విముక్తి గురించి, వారి చదువు గురించి ఎనలేని కృషి చేశాడు. అంతేకాక కొంత మంది బాలురను రహస్య కార్యకలాపాలైన స్మగ్లింగ్ మొదలైన నేరపూరిత చర్యలకు కూడా పాల్పడేటట్లు చేస్తున్నారు.

కైలాస్ స్కూలులో చదువుతున్న కాలంలోనే అతని ప్రతిభని గుర్తించారు. రెండుసార్లు 1981లోను, 1993లోను ఫెలోషిప్ అందుకున్నాడు. వసుధైక కుటుంబంగా ప్రపంచ మంతా మారడానికి అప్పుడప్పుడు కృషి జరుగుతూనే ఉంది. ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించడానికి సంస్కర్తలు ప్రయత్నిస్తూనే ఉన్నారు. వారు అవలంబించే పద్ధతులు కూడా కాలంతోపాటు మారుతూనే ఉన్నాయి. ఈ మార్పులు మూలంగా సంస్కర్తలలో అంకితభావం, సృజనాత్మకత, ఐకమత్యం మొదలైనవి చోటు చేసుకున్నాయి. వారందరూ ఆచరణశీలురయ్యారు. అంతకు ముందు వారు చేపట్టిన పద్ధతులకు మెరుగు దిద్దడం లేదా కొత్త పద్ధతుల్ని సృష్టించడం మొదలైన వాటిని పాటించారు. ఒక సమస్యని లోతుగా ఆలోచించి, విశ్లేషించి, దానికి పరిష్కారం కనుగొన్నారు. ఆ మార్పుల్ని, పరిష్కారాల్ని ప్రజలందరూ అర్థం చేసుకునేటట్లు చేశారు. అయితే యిటువంటి మార్పులు జరగడానికి, ప్రపంచ దేశాలు చైతన్యవంతము అవడానికి చాలా కాలం పట్టింది. అయినా సంఘజీవనం సుఖవంతంగా జరగడానికి ఆ కృషి దోహదపడింది.

ఆ కృషిని గమనించిన సత్యార్థి కూడా ఆ దిశలో తన ప్రయాణాన్ని సాగించాడు. అతనికి ఆర్థిక సహాయం కూడా లభించింది. 1995లో అమెరికా దేశం మీద కూడా కైలాస్ యొక్క ప్రభావం పడింది. ప్రపంచ దేశాలలో చాలా వాటిలో బాల కార్మికుల్ని అన్ని విధాలుగా ఉపయోగించుకోవడం, వారిని చిత్రహింసలకు గురి చేయడం జరుగుతూ ఉండేది. కైలాస్ యిటువంటి కార్యకలాపాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయని

ఏనాడో తెలియజేశాడు. ఈ రోజున అమెరికా పత్రికలలో యీ అంశం గురించి చర్చలు జరిగినా. 1995వ సంవత్సరం వరకు అమెరికా కూడా కైలాస్ సత్యార్థియొక్క కృషిని గుర్తించలేదు. కైలాస్ తన శక్తినంతటినీ అంకిత భావంతో ఉపయోగించి బాలుర అంశం మీద అవిరామంగా కృషి చేశాడు. కైలాస్ కుమారుడు భువన్‌రైభు కూడా తండ్రికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. సుమేధ గురించి చెప్పనక్కర్లేదు. కుమార్తె అస్మిత కూడా తండ్రికి మద్దతు యివ్వడంలో వారికి తీసిపోలేదు. గత 30 సంవత్సరాలుగా వారి యిల్లు విముక్తి పొందిన బాలకార్మికులకు పునరావాస కేంద్రంగాను, శిక్షణా కేంద్రంగాను మారిపోయింది. శిక్షణ యిచ్చి వారిని సమర్థులుగా తీర్చిదిద్దాడు.

సత్యార్థి ఎవరూ చేయలేని పనిని చేయగలిగాడు. బాలకార్మికులు అతిహీనంగా బ్రతుకుతూ, రోజుకి 10-12 గంటలపాటు పని చేసే కర్మాగారాల మీద చాలాసార్లు అనూహ్యరీతిలో దాడి చేశాడు. ఈ సమస్యని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేశాడు. వినియోగదారుల అవగాహనా ఉద్యమాన్ని ప్రారంభించాడు. పిల్లలు తయారు చేసిన తివాచీలను కాకుండా, వారి చేత తయారు చేయబడని వాటిని మాత్రమే కొనేటట్లు చేయగలిగాడు. కర్మాగారాలు అవి తయారు చేసిన తివాచీల మీద "పిల్లల చేత తయారు చేయబడలేదు" అనే ముద్ర వేసేటట్లు చేశాడు. అంతేకాక వినియోగదారులైన ఉద్యోగులతోను, తివాచీలను ఎగుమతి, దిగుమతి చేసే వ్యాపార సంస్థలతోను



సంప్రదింపులు జరిపాడు. ఆ సంప్రదింపుల ఫలితంగానే "రగ్‌మార్క్" 1994లో ఏర్పడింది. "రగ్‌మార్క్" అంటే "పిల్లల చేత తయారు చేయబడలేదు" అనే గుర్తు. పిల్లల చేత తయారు చేయబడిన వాటిని కొనవద్దు అనే ఉద్యమం వల్ల వ్యాపారుల నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అందువల్ల వ్యాపారులు తివాచీలు తయారు చేసి "రగ్‌మార్క్"ని పెడితే వాటిని వినియోగదారులు కొంటారు. వారి వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. అప్పుడు విముక్తి చెందిన వారికి శిక్షణ యిచ్చి, విద్యను యిస్తే వారికి కూడా ఉద్యోగావకాశాలు వస్తాయి.

1980 నుండి 1983 కైలాస్ చేపట్టిన ఉద్యమాలలో అతనికి అనేక రకాల అవమానాలు జరిగాయి. కాని అకుంఠిత దీక్షతో, త్యాగనిరతితో అతడు చెక్కు చెదరకుండా ముందుకు సాగాడు. ఆ కృషిని ప్రపంచమంతా గుర్తించింది. అతనికి అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. ప్రజలు అతని మాటను మన్నించడం వల్ల "రగ్‌మార్క్ సర్టిఫికెటు" తివాచీల మీద వేయడం తప్పనిసరి అయింది. ఫలితంగా చాలామంది బాల కార్మికులు విముక్తులయ్యారు.

"రగ్‌మార్క్" ఉన్న వాటినే కొనడం వల్ల ఉద్యోగ అవకాశాలు పెద్దలకు కూడా లభించాయి. అంతేకాక, తివాచీలకు అంతర్జాతీయ మార్కెట్టు కూడా లభించింది. ఈ పరిశ్రమతో పాటు, ఇటుక, ఇత్తడి, నేత పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాయి.

80 కోట్ల బాలకార్మికులలో 30 శాతం దక్షిణాసియా దేశాలలోనే ఉన్నారు. రెండు కోట్లమంది తరతరాలుగా బాల కార్మికులుగానే ఉండిపోయారు. వారి తాత తండ్రులు కూడా బానిసలుగా ఉండేవారు. 14 కోట్ల బాలకార్మికులలో 6 కోట్లమంది బందీకృతులు గానే ఉన్నారు. తమ తండ్రులు చేసిన అప్పులు తీర్చడానికి వారు తమ పిల్లల్ని తాకట్టు పెట్టేవారు. దానికి కారణం తల్లిదండ్రులు నిరుపేదలు కావడం లేదా, వారికి తల్లిదండ్రులు లేకపోవడం. ఈ విధంగా పిల్లలు బాలకార్మిక బోనులో చిక్కుకుని పోతున్నారు. విముక్తి చెందినవారి సంఖ్య కంటే బాల కార్మికులుగా చేరేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. వారి జీవనవిధానం అతి హీనంగా, హేయంగా ఉంటుంది.

బాలకార్మిక వ్యవస్థకు, బాలుర హక్కులకు కైలాస్ చేసిన కృషి అతనికి ప్రపంచవ్యాప్తంగా చాలా అవార్డులను తెచ్చిపెట్టింది. మూడు దశాబ్దాల కాలం అతడు చేసిన పోరాట ఫలితంగా అతనికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

అతనికి వచ్చిన అవార్డులు

1. డిఫెండర్స్ ఆఫ్ డెమోక్రసీ అవార్డు – (2009 US)

2. ఆల్ఫోన్సోకోమిన్ అంతర్జాతీయ అవార్డు ( 2008 - $స్పెయిన్)

3. ఇటాలియన్ సెనేటు మెడల్ ( 2007 - ఇటలీ)

4. రాబర్ట్ కెనడీ అంతర్జాతీయ మానవ
   హక్కుల అవార్డు (1995-U.S.A.)

5. ఆచ్నర్ అంతర్జాతీయ శాంతి బహుమతి (1994-జర్మనీ)

ఇవి కాక యింకా ఎన్నో అవార్డులు వచ్చాయి. విద్యకు సంబంధించిన యునెస్కో ఉన్నతస్థాయి సంస్థలో కైలాస్‌కి సభ్యత్వం వచ్చింది. గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ ఎడ్యుకేషన్ బోర్డులో అతడు సభ్యుడు. ఉన్నత స్థాయిలో ఉన్న నాయకులతో పాటు కైలాస్ కూడా విద్యావ్యవస్థకు సహస్థాపకుడు. ఇటీవల అతడు యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ, అంతర్జాతీయ కార్మిక సమావేశం, U.N. మానవ హక్కుల కమీషన్, యునెస్కో, యితర పార్లమెంటరీ కమిటీలు మొదలైన వాటిలో ప్రసంగాలు చేశాడు. అవార్డులు రావడం వల్ల సత్యార్థిలో ఉత్సాహం పెరిగింది. తన లక్ష్యం కోసం అహర్నిశలు శ్రమించాడు. ఆ కృషి ఫలితంగానే అతడు బాలకార్మికుల విముక్తి కోసం 1998వ సంవత్సరం, జనవరి 17న ప్రపంచవ్యాప్తంగా ర్యాలీని ప్రారంభించాడు. ప్రపంచంలోని ప్రజలందరికీ దీనిని గురించి అవగాహన కలిగింది. అందరూ కలిసికట్టుగా ర్యాలీని నిర్వహించారు. జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సదస్సు వద్ద యీ ర్యాలీ పూర్తి అయింది. ఈ సమస్య గురించి అక్కడ తీర్మానం చేశారు.

పిల్లలకు నాణ్యత గల విద్య తప్పనిసరిగా చేయాలనేది ప్రపంచర్యాలీ యొక్క ముఖ్య లక్ష్యం. ప్రభుత్వాలు యీ మేరకు కృషి చేయాలనేదే దాని ధ్యేయం. అంతేకాక బాల కార్మికుల్ని విముక్తులను చేయడం కూడా ఆ ర్యాలీ యొక్క లక్ష్యం. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ద్వారా, ఉద్యమాల ద్వారా ప్రభుత్వం చేత చట్టం చేయించడం ప్రధాన లక్ష్యం. కాబట్టి విధానపరంగా మార్పు రావాలి. కైలాస్ యొక్క కృషి వల్ల, ప్రపంచ ర్యాలీ వల్ల అవగాహన కలిగిన హైకోర్టు, సుప్రీంకోర్టులు యీ సమస్య మీద దృష్టి సారించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చట్టాలు చేయవలసిన అవసరం గుర్తించాయి.

యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీలో ప్రధాన మంత్రిగాని, రాష్ట్రపతిగాని ప్రసంగించాలి. కాని ఆ అరుదైన గౌరవం 2009లో కైలాస్‌కి దక్కింది. అతడు ఆ అసెంబ్లీలో బాలకార్మిక వ్యవస్థ గురించి ప్రసంగించాడు. అంతేకాక, యీ విషయం గురించి, అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఇటలీ దేశాల సెనేట్లలో కూడా ప్రసంగించాడు. బాలకార్మిక వ్యవస్థకు చెందిన చాలా యునైటెడ్ నేషన్స్ కమిటీలలో కైలాస్ సభ్యుడయ్యాడు.

కైలాస్ యొక్క పేరు నోబెల్ శాంతి బహుమానానికి ప్రతిపాదించబడింది. ఎందుకంటే, యిటువంటి ఉద్యమాలు చేయడమే కాక, చాలా పుస్తకాలు రాశాడు, "సంఘర్ష్ జారీ రహేగా" అనే హిందీ మ్యాగజైనుకి సంపాదకుడు కూడా. కైలాస్ కుల మత భేదాలు పాటించడు. ఒక గాంధీ జయంతినాడు అతడు దళితుల చేత వంట చేయించి, విదిశలోని నిమ్‌తాల్ చౌరాహా వద్ద వారితో కలిసి భోజనం చేశాడు. స్వామి అగ్నివేశ్, కైలాస్‌తో కలిసి పనిచేశాడు. అతని కృషిని గుర్తించి 2014లో అతనికి నోబెల్ శాంతి బహుమతి ప్రదానం చేశారు. ప్రపంచబాలురకు దానిని అంకితం చేశాడు. "మనం చాలా తీవ్రమైన సమస్యల్ని ఎదురుకుంటున్నాం. అన్నింటికంటె తీవ్రమైన సమస్య పిల్లల బాల్యాన్ని హరించడం. అంతకంటె ఘోరమైన నేరం మరొకటి లేదు. కాబట్టి పిల్లలకు స్వేచ్ఛనిచ్చి వారికి విద్య యివ్వడం చాలా అవసరం. ఆ పని తప్పకుండా జరుగుతుందని నా ప్రగాఢ విశ్వాసం. మొదటగా మనం గుర్తుంచుకోవలసింది మన బాల్యం. రెండవది బాలురను పనులకు వినియోగించడం. మూడవది బాలురు బానిసత్వం నుండి స్వేచ్ఛ నివ్వడం. చివరిగా బాలురుగా వారు చేయవలసిన కర్తవ్యాన్ని గురించి వారికి అవగాహన కలిగించడం. మనందరికీ కూడా పిల్లలు, మనుమలు ఉన్నారనే విషయాన్ని మనం మరచిపోకూడదు" అంటాడు కైలాస్. ఇంకా నరేంద్ర మోడీ గురించి, "టీ అమ్ముకునే ఒక బాలుడు విమర్శకుల దాడులకు లొంగక ప్రధానమంత్రి అయ్యాడు. ఇప్పుడు ఆయన బాల కార్మికుల వ్యవస్థని నిర్మూలించడం అతని వంతు" అంటాడు.



# 8. విజయానికి మెట్లు

దశాబ్ద కాలంలో ఘన విజయాన్ని సాధించిన కైలాస్ యొక్క విధానాన్ని యువతరం ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలి. అతడు విదిశలో ఒక చిన్న గ్రామం నుండి వచ్చాడు. ఇంజనీరింగ్‌లో పట్టా పొందాడు. కాని అతని పని తీరులో ఏదో విశేషం ఉంది. అందువల్లనే తన చుట్టూ ఉన్నవారిని ప్రభావితం చేయగలిగాడు. భారతీయులంటే యిష్టం లేని విదేశీయులు సైతం అతని ప్రసంగాల్ని ఆసక్తిగా వింటారు. అతడు చెప్పిన విషయాల్ని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు.



కైలాస్ నుండి మనం నేర్చుకోవలసిన మొదటి విషయం ఏమంటే, నువ్వు ఏమి చేయాలనుకున్నావో దానిని చెయ్యి అనేది. నీకు దేనిలో ఆసక్తి ఉందో దానిని చేపట్టు. అప్పుడు నిన్ను ఎవ్వరూ ఆపలేరు. స్కూలుకు వెళ్లలేని పిల్లల్ని గురించి, వారి హక్కుల్ని గురించి అతడు బాల్యం నుండి దృష్టి సారించాడు, దాని కోసం అహర్నిశలు కృషి చేశాడు. ఆహారం కోసం విలవిలలాడే పిల్లల కోసం పరితపించాడు. తనకి ఆసక్తి ఉన్న విషయం యిదే. దానివల్ల యితరులకు సహాయం చేసే సామర్థ్యం కలిగింది. వారి కలల్ని సాకారం చేయడానికి నడుం బిగించాడు. మనస్ఫూర్తిగా నువ్వు ఏది చేయాలనుకుంటావో దానిని సాధించగలుగుతావంటాడు కైలాస్.

అమెరికా పార్లమెంటు సత్యార్థిని ప్రజాస్వామ్య రక్షకుడు అంది. అతనికి నాలుగు అవార్డులు ప్రదానం చేసింది. జర్మనీ మూడు అవార్డులు, బ్రిటన్ రెండు, నెదర్లాండు, జర్మనీలు ఒక్కొక్కటి చొప్పున ప్రదానం చేశాయి. కైలాస్ యిటువంటి ఉన్నత స్థితికి రావడానికి  గల కారణం ఏమిటి? ఇతరులు తమ జీవితాలలో యిటువంటి స్థితికి చేరడానికి ఏమి చేయాలి?

ప్రతి ఒక్కరికీ అటువంటి అవకాశాలు ఉన్నాయి. జీవితంలో ప్రతి వ్యక్తికీ అత్యంత సామర్థ్యం ఉంది. వారికి ముందుకు సాగాలనే ఆసక్తి ఉండాలి. ఇతరులకు సహాయం చేస్తూ ముందుకు సాగాలి. నువ్వు కూడా నీ లక్ష్యాన్ని సాధించగలవు. సామాన్యుడు కైలాస్ నుండి విజయం సాధించడానికి ఏమి నేర్చుకోవాలి? అది తెలుసుకోవాలంటే కైలాస్ పనిని సాధించడానికి ఎటువంటి చిట్కాలు ఉపయోగించాడో, ఏ నియమాలు ప్రకారం ముందుకు సాగాడో జాగ్రత్తగా గమనించి, ఆకళింపు చేసుకోవాలి.

స్వామి అగ్నివేశ్‌తో కలిసి 1981లో కైలాస్ బంధ్వముక్తి మోర్చాతో మొదలుపెట్టాడు. అగ్నివేశ్ 1939లో జన్మించాడు. అతడు రాజకీయ నాయకుడు. శాసనసభ్యుడు కూడా. ఆయన ఆర్యసమాజ పద్ధతుల్ని అనుసరించే సంఘ సంస్కర్త. అతడు కూడా బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపాడు. ప్రపంచ ఆర్యసమాజ్‌కు అతడు అధ్యక్షుడిగా ఉన్నాడు. దాని స్థాపకుడు కూడా అతడే. అది ఆర్యసమాజ్‌కి అనుబంధ సంస్థ. 1994 నుండి 2004వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాల బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఏర్పడిన నిధికి చైర్మన్‌గా వ్యవహరించాడు. శ్యామ్‌వేపారావ్‌గా చత్తీస్‌ఘర్‌లో ఉన్న శక్తిలో జన్మించి, న్యాయపట్టాని ఆర్థిక శాస్త్రంలో పట్టాని తీసుకుని బిజినెస్ మేనేజ్‌మెంటు లెక్చరరుగా కలకత్తాలోని సెయింట్‌జేవియర్ కాలేజీలో పనిచేశాడు.

వయస్సులో కైలాస్ కంటె చాలా పెద్దవాడైనా పనిలో, దీక్షలో అతనికంటె చిన్నవాడనే చెప్పవచ్చును. 130 దేశాలలో కైలాస్ తన ప్రతిభని నిరూపించుకున్నాడు. కాని అగ్నివేశ్ అటువంటి పనిచేయలేదు. మరి అగ్నివేశ్‌లో లోపం ఎక్కడుంది?

చౌదరి మునవర్ సలీమ్ సమాజ్‌వాది పార్టీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఉన్నాడు. మునవర్‌కి గుండెపోటు వచ్చింది. చికిత్సకు డబ్బు లేదు. కుటుంబం డబ్బు ఏర్పాటు చేయలేకపోయింది. అప్పుడు కైలాస్ కుమారుడు (సుప్రీంకోర్టు లాయర్) అతనికి అన్ని ఏర్పాట్లు చేశాడు. అతడు హాస్పిటల్ యాజమాన్యంతో మునవర్‌ని తన ఆస్తి అంతా అమ్మైనా రక్షించుకుంటానని చెప్పాడు.

సుమేధకు కైలాస్‌తో వివాహానికి సన్నాహాలు చేస్తున్నప్పుడు సుమేధ తల్లికి కైలాస్ ఒక తిరుగుబాటు దారుడని, బాల కార్మికుల్ని రెచ్చగొడుతూ ఉంటాడనీ, ప్రభుత్వానికి ఎదురు తిరుగుతాడనీ, అతనికి యిచ్చి పెళ్లి చేస్తే సుమేధ కష్టాల్లో పడుతుందనీ సమాచారం అందింది. కైలాస్ ఎవరితోను యీ విషయం గురించి చర్చించలేదు. తన స్నేహితులకు యీ రోజు వరకూ యీ విషయం గురించి చెప్పలేదు.

ఎవరికి, ఏ పరిస్థితుల్లో, ఎక్కడ వారు ఉన్నా వెంటనే సహాయం చేసే గొప్ప గుణం కైలాస్‌లో ఉంది. ఎవరు తనను విమర్శించినా, తిట్టినా వారికి కూడా ఎటువంటి హాని తలపెట్టడు. అతడు బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికే తన శక్తినంతటినీ ఉపయోగించాడు. కాబట్టి మనం కూడా మన లక్ష్యాన్ని సాధించడానికి మన శక్తినంతా ధారపోయాలి.



స్వామి అగ్నివేశ్‌తో కలిసి కైలాస్ పనిచేశాడు. పంజాబ్‌లో ఇటుక పరిశ్రమలో బాలకార్మికుల్ని (హిందువుల్ని, ముస్లింలను కూడా) రక్షించాడు. ఆ పరిశ్రమని, బాల కార్మికుల్ని ఫొటోలు తీసి, హైకోర్టుకి సమర్పించాడు. దానివల్ల ఆ పిల్లల్ని దాస్య విముక్తి చేశాడు. ఆ సంఘటనే అతని జీవితాన్ని మలుపు తిప్పింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాల కార్మికులందర్నీ విడిపించాలని ఆనాడే తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతడు ఎవరి సహాయాన్ని కోరలేదు". స్వేచ్ఛ దైవాంశ కలది. కాని బానిసత్వం మానవుని అణగద్రొక్కు

తుంది. కాబట్టి బాల కార్మిక శాశ్వతమైనది కాదు. కాబట్టి అందరూ పిల్లలతో స్నేహ సంబంధాలు పెంచుకోవాలి. వారి స్వేచ్ఛను గౌరవించాలి. అదే మన జీవన విధానం కావాలి. మన స్వీయ జీవితంలో, రాజకీయంగాను, సాంఘికంగాను బాలుర సంక్షేమాన్ని పునరుత్తేజింపచేయాలి” అంటాడు సత్యార్థి.

కైలాస్ విశ్లేషణాత్మకంగా ఆలోచించే వ్యక్తి. బాలకార్మిక వ్యవస్థ గురించి ఉద్యమాలు నిర్వహించి, దానిని మానవహక్కుల సాధన వరకు తీసుకుని రాగలిగాడు. బాల కార్మిక వ్యవస్థ పేదరికానికి, నిరుద్యోగానికి దారి తీస్తుంది. అందువల్ల “అందరికీ విద్య” అనే నినాదాన్ని మొదలుపెట్టాడు. దీని వల్ల మనకి తెలిసిందేమంటే, లక్ష్యాన్ని మనసులో ఉంచుకుని ఆ దిశగా కృషి చేస్తే తప్పకుండా విజయాన్ని సాధించవచ్చు. ఆటంకాలు అవకాశాలుగా మారతాయి.

బచ్‌పన్ బచావో ఆందోళన్‌తో పాటు కైలాస్ చాలా ఉద్యమాలు నడిపాడు. దాదాపు 40 ఉద్యమాలు చేశాడు. ఇవన్నీ ఒక రోజులో సాధించగలిగేవి కావు. “విజయాలు నీకొక్కడికే కాదు, ఎవరి కోసం ఉద్యమాలు చేస్తున్నావో వారికి కూడా విజయాలు కావాలి” అంటాడు కైలాస్. “నేను 11 సంవత్సరాల బాలుడిగా ఉన్నప్పుడు పేద పిల్లలకి చదువు లేదే అని బాధపడ్డాను. అది ఒక సవాలుగా తీసుకున్నాను. నేను, నా స్నేహితుడు ఆ పేదపిల్లల చదువు గురించి ఏదో ఒకటి చేయాలనుకున్నాం. 6వ తరగతి ఫలితాలు వచ్చిన తరువాత మేము ఒక తోపుడు బండిని తెచ్చాం. దానిమీద నేను నిలబడ్డాను. నా స్నేహితుడు రమేష్ వ్యాస్ దానిని తోసుకుంటే ఊరంతా తిరిగాం. తిరుగుతూ ప్రజలతో “మీ బిడ్డలు చదువుకున్నారు. పరీక్షలలో కృతార్థులయ్యారు కాని పేద పిల్లలను గురించి మీరు ఎందుకు ఆలోచించరు? గత క్లాసు పుస్తకాలు మీ పిల్లలకి పనికిరావు కదా? వాటిని అమ్మివేస్తారు కదా? కాబట్టి మీ పాతపుస్తకాలు పేద విద్యార్థులకు యివ్వండి. వారు మీకు కృతజ్ఞులై ఉంటారు. పైగా వారు చదువుకోవడానికి అవకాశం కలుగుతుంది.” అరుస్తూ చెప్పాం. వారు చాలా విశేషంగా స్పందించారు. వారంతా తోపుడు బండి మీద పాత పుస్తకాలు పెట్టారు. వాటిని మేము రమేష్ యింటి వద్ద ఉంచి, పుస్తకాల కోసం మళ్లీ బయలుదేరాం. ఆ విధంగా 2000 పుస్తకాలు సేకరించగలిగాం. నా తల్లిదండ్రులకి యీ విషయం తెలియదు. అందువల్ల ఆ పుస్తకాల్ని రమేష్ యింటి వద్ద పెట్టాం. తరువాత ఆ పుస్తకాల్ని పరిశీలిస్తే వాటిలో 1వ తరగతి నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ వరకు ఉన్నాయి. అయితే ఎవరికి వాటిని యివ్వాలి? పేదవారిని ఎలా గుర్తించాలి అనే స్థితి వచ్చింది. మేము చాలా చిన్నవాళ్లం. అప్పుడు మేము హెడ్మాస్టరుగారి వద్దకు వెళ్లాం. ఆయన పుస్తకాల్ని

అర్హులకు యిచ్చే బాధ్యతను తీసుకున్నారు. పుస్తకాలన్నీ పంచి పెట్టడం జరిగిన తరువాత, మరుచటి సంవత్సరం కూడా వారు పుస్తకాలు సేకరించారు. హెడ్‌మాస్టర్ పంచే బాధ్యత తీసుకున్నాడు. అంతేకాక, యితర స్కూళ్ల హెడ్మాస్టర్లను కూడా ప్రోత్సహించాడు. ఆ విధంగా "బుక్‌బ్యాంక్" ఏర్పడింది. మళ్లీ చదువు పూర్తి అయిన తరువాత ఆ పిల్లలు తీసుకున్న పుస్తకాలు తిరిగి బ్యాంక్‌కి యివ్వాలి. పుస్తకాల్ని స్కూలు తెరవగానే యిచ్చేవారు. బుక్‌బ్యాంకులు తరువాత కాలంలో పబ్లిక్ లైబ్రరీలలో లీనమై పోయాయి" అంటూ కైలాస్ తన బాల్యంలో జరిగిన సంఘటనను వివరించాడు.



ఈ రోజు కైలాస్‌ని ప్రపంచం అంతా గౌరవిస్తుంది. మొదటగా అతడు ఒక బాలికను విముక్తి చేయించాడు. దానికి అతడు ఎంతో కష్టపడవలసి వచ్చింది. అగ్నివేశ్ నుండి విడిపోయి అతడు "బచ్‌పన్ బచావో"ని ప్రారంభించాడు. పిల్లల గురించి మాత్రమే ఆలోచించి వారి విముక్తికి పాటుపడడమే అతని లక్ష్యం. తన పనికే తాను అంకితమవుతాడు కాని యితరుల తప్పులు ఎంచడు. విమర్శలకు కుంగిపోడు "ఇతరులకు సహాయం చేస్తే తిరిగి వారు నీకు సహాయం చేస్తారు" అంటాడు కైలాస్.

భోపాల్‌లోని ఒక కాలేజీలో అతడు ప్రొఫెసరుగా పని చేస్తూన్నప్పుడు సంఘాన్ని సంస్కరించాలనే ఆలోచన వచ్చింది. అప్పుడే కొంతమంది స్నేహితులతో కలసి "బచ్‌పన్


బచావో”ని ప్రారంభించాడు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని “దక్షిణాసియా ప్రజా ఉద్యమం”, మొదలైన సంస్థలు ఏర్పడ్డాయి. అవి కూడా బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపాయి. 1998లో ప్రపంచవ్యాప్తంగా ర్యాలీని నిర్వహించాడు కైలాస్. తరువాత గ్లోబల్ టాస్క్‌ఫోర్సు ఏర్పడింది. దీని వల్ల ఒక్క పిల్లల విషయాలే కాక, వారికి పునరావాసం కల్పించడం, విద్య నేర్పడం, పేదరికం నిర్మూలించడం మొదలైనవి కూడా చేపట్టబడ్డాయి. “అందరికీ విద్య” అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా అనేక పౌరసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు మొదలైన ఉద్యమాలు సంయుక్తంగాను, విడిగాను ఉద్యమాలు చేశాయి. త్రిముఖంగా అవి పని చేశాయి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలను, విద్య, పేదరికం నిర్మూలన అనేవి త్రిముఖాలు. అంతేకాక బాల కార్మికులు తయారు చేసే వస్తువులు కొనకుండా ఉండడం కూడా ఒకటి. అందువల్ల 1994లో “రగ్‌మార్క్” ప్రారంభించ బడింది. కైలాస్ “బాలమిత్ర గ్రామం” అనే ఒక ఆదర్శమైన భావాన్ని ప్రతిపాదించాడు. ఒక బాలల గ్రామసభ ఏర్పాటయింది. అది అనూహ్యమైన విజయాన్ని సాధించింది.

కైలాస్ ఎప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటాడు. ఒకసారి సత్యార్థి వద్దకు పదకొండుమంది తల్లిదండ్రులు వచ్చారు. వారి పిల్లలు గ్రేట్ రోమన్ సర్కస్‌లో పని చేస్తున్నారనీ, వారికి విముక్తి కలిగించమని కోరారు. అతడు నలుగురు తల్లిదండ్రుల్ని వెంటబెట్టుకుని జిల్లా పరిపాలనాధికారి వద్దకు వెళ్లాడు. ఆయనను ఆ పిల్లలకు విముక్తి కలిగించమని కోరాడు. ఇష్టం లేకపోయినా ఆ అధికారి సబ్‌డివిజనల్ మేజిస్ట్రాటును ఆ సర్కస్ మీద దాడి చేయమని ఆదేశించాడు. ఆ సమయంలో ఆ సర్కస్ గోండా జిల్లాలో ఉన్న కల్నల్ గంజ్‌లో ఉంది. కైలాస్ వెంట మేజిస్ట్రేటు గోండా వెళ్ళి అక్కడ ఉన్న మేజిస్ట్రేట్‌ని కలిశాడు. అతడు కూడా యిష్టం లేకుండానే దాడి జరిపించాడు. ఆ సర్కస్‌లో కొన్ని వందల మంది పిల్లలు పని చేస్తున్నారు. యాజమాన్యం వారిని క్రూరంగా హింసిస్తోంది. సత్యార్థి మీద ఆ సర్కస్ యజమాని అతిక్రూరంగా దాడి చేయించాడు. వారు సత్యార్థిని, అతని బృందాన్ని చితకబాదారు. వాళ్లందరూ విపరీతంగా గాయపడ్డారు. సర్కస్‌వారు సత్యార్థిని చంపాలనుకున్నారు. అతని బృందం కైలాస్‌ను ఆ ప్రదేశం నుండి తప్పించారు. ఒక విదేశీయ జర్నలిస్టు వనిత కూడా గాయపడింది. ఆమె యొక్క కెమేరాను విరగగొట్టారు. వెంటనే సత్యార్థిని లక్నోలో హాస్పిటల్‌లో చేర్పించారు. అతని తలకు కుట్లుపడ్డాయి. తరువాత కైలాస్ నిరాహారదీక్ష చేశాడు. అప్పుడు సర్కస్‌వారు వారి కంపెనీలో పని చేస్తూన్న బాలికల్ని విడిచిపెట్టారు. ఆ సందర్భంగా కైలాస్‌కి జాతీయంగాను, అంతర్జాతీయంగాను గుర్తింపు వచ్చింది.

"మీరు బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించదలచుకుంటే భారతదేశం, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలు మీద ఎందుకు దృష్టి పెట్టరు?" అని ఒకరు కైలాస్‌ని అడిగారు. అప్పుడు కైలాస్, "అవకాశం లభిస్తే నేను మొదటగా ఐరోపా, అమెరికాలతో మొదలు పెడతాను. పిల్లలు తయారు చేసిన భారతదేశం నుండి వచ్చిన వస్తువుల్ని అక్కడ ఉన్న వినియోగదారుల్ని కొనవద్దనీ, వారికి సరియైన అవగాహన కల్పించాలని అనుకుంటు న్నాను. దాని వల్ల బానిసత్వం నశిస్తుందనుకుంటున్నాను" అని బదులు చెప్పాడు. అతడు "రగ్‌మార్క్"ని ప్రవేశపెట్టినప్పుడు దాని వల్ల బానిసత్వం నిర్మూలించ బడుతుందా అని చాలామంది ప్రశ్నించారు. దానికి అతడు, "ఎవరైనా వెళ్లి బాలురు ఎటువంటి హేయమైన పరిస్థితుల్లో పని చేస్తున్నారో చూస్తే తప్పకుండా అది నిర్మూలించ బడుతుంది" అన్నాడు. కాబట్టి "రగ్‌మార్క్" వల్ల బానిసత్వం నిర్మూలించబడాలనేదే కైలాస్ ధ్యేయం అంతేకాని ఆ ఫ్యాక్టరీలు మూతపడాలని అతని ఉద్దేశం కాదు.

కైలాస్ ప్రారంభించిన ప్రతి ఉద్యమం చక్కని తీరులో జరిగింది. ఎటువంటి విమర్శలకు తావు లేకుండా జరిగింది. తన బృందంలో వారు గాని, యితరులుగాని పౌరులకు ఆ ఉద్యమాల వల్ల ఎటువంటి యిబ్బంది కలగలేదు. అన్నీ శాంతియుతంగానే నిర్వహించబడ్డాయి. తమ ఉద్యమాలు అందరికీ సహాయం చేసేవి గానే ఉన్నాయి కాబట్టి ఎవరూ వాటిని విమర్శించడానికి అవకాశం కలగలేదంటాడు సత్యార్థి. అతని వ్యాఖ్యలు అతనికి యింకా గొప్పతనాన్ని చేకూర్చాయి. ఆ గొప్పతనాన్ని సత్యార్థి తనకు ఆపాదించు కోడు. అతని కుమారుడు కూడ తన తండ్రిబాటలోనే నడిచాడు.

బాలకార్మిక వ్యవస్థకు కారణం పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, జనాభా పెరుగుదల మొదలైనవి. కాబట్టి ఆ వ్యవస్థ గురించి, దాని నిర్మూలన గురించి ఒక కఠినమైన చట్టాన్ని రూపొందించవలసిందిగా ప్రభుత్వాల్ని కోరాడు. అంతేకాక మానవహక్కులను గురించి కూడా చట్టాన్ని రూపొందించవలసిందిగా కోరాడు. యునెస్కో అంతర్జాతీయ సమావేశంలో కూడా అతడు బాలల హక్కుల్ని గురించి గట్టిగా ప్రసంగించాడు. బానిసత్వాన్ని సమూలంగా పెకలించి వేయాలన్నాడు. ప్రజలలో కూడా దీనిని గురించి అవగాహన కలిగించాడు. దీనివల్ల సంఘం గురించీ, సంస్కృతి గురించీ, లింగ వివక్ష గురించీ యిది వరకు అందరికీ ఉన్న భావాలు మారి దేశ పురోగతికి తోడ్పడ్డాయి. స్థానిక సంస్థలు సహాయంతోను, పిల్లలతోను బాలమిత్ర గ్రామసభ (పంచాయితీ) ఏర్పాటయింది. మూడువంతుల్లో రెండు వంతులు బాలికలతో గ్రామ సభ ఏర్పాటు కావడం వల్ల లింగ వివక్షకు తావు లేకుండా పోయింది. ఈ సభలో నాణ్యత గల



విద్య, విద్యా విధానంలోని లోపాలు మొదలైనవి చర్చించబడి మెరుగైన పద్ధతులు అమలు జరుపబడతాయి.

కైలాస్ తన కృషిని ఒక దేశానికే పరిమితం చేయలేదు. ప్రపంచవ్యాప్తంగా చేశాడు. ఒక్క నేపాల్‌లోనే మైనర్ బాలికల్ని అనేక రకాల పనులు చేయించడం, వారి చేత వ్యభిచారం చేయించడం మొదలైనవిగా జరిగాయి. వారిని అధిక ధరలకు కొనేవారు. ఏటా 3,400 కోట్ల డాలర్లు ఖర్చు అయ్యేవి. ఇటువంటి వ్యాపారాలలో అధికారులకు, పోలీసులకు కూడా ప్రమేయం ఉండేది. అవినీతి, అభివృద్ధి రెండూ వ్యతిరేక ధృవాలు. కాబట్టి త్వరగా మేలుకోవాలి. జనాభా పెరుగుతూంది. మధ్యతరగతివారు, ఉన్నత స్థితిలో ఉన్నవారు తమ యింటి పనుల కోసం బాలబాలికల్ని ఉపయోగించుకుంటున్నారు. గణాంకాల ప్రకారం వారు 7-17 మిలియన్ల బాలబాలికలు యిళ్లలో పని చేస్తున్నారని తేలింది.

"బచ్‌పన్‌బచావో ఆందోళన్" అన్ని సంస్థల వంటిది కాదు. అనేకమంది హృదయాలకు ఆశాకిరణం. చీకటిని పారదోలే దీపం వంటిది. దీక్షతో, పట్టుదలతో చాలామంది యిటువంటి నేరాల మీద దృష్టి సారించారు. పాతభావాలకు స్వస్తి చెప్పడానికి ప్రయత్నించారు. 1980 నుండి యీ దిశగా, కైలాస్ ఆధ్వర్యంలో యిటువంటి ఉద్యమాలు

జరుగుతూ ఉన్నాయి. చాలామంది బాల కార్మికులకు స్వేచ్ఛ నివ్వడం జరిగింది. వ్యక్తిగతంగాను, సమిష్టిగాను కూడా ఉద్యమాలు జరిగాయి. సంయుక్త కార్యాచరణ మొదలైంది. బాలబాలికలకు ఊరట కలిగింది.

అందరికీ విద్య "శిక్షాయాత్ర ఆరు నెలలపాటు జరిగింది 15,000 కి.మీ. యాత్ర జరిగింది. బాలల గురించి పోరాడే సంఘంతోను కైలాస్‌కి అనుబంధం ఉంది. అతడు ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్‌కి మద్దతు యిచ్చాడు. అది పేదరికం గురించి, చట్ట విరుద్ధంగా నేరాలకు పాల్పడే వారికి వ్యతిరేకంగాను పోరాటాలు సాగిస్తుంది. అటువంటి ఉద్యమాలకు మద్దతు యివ్వడానికి, సహాయపడడానికి సత్యార్థి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ర్యాలీలో చాలామందికి సత్యార్థి ఎవరో తెలియదు. కాని వారి నాయకుల సహాయంతో ఆ ర్యాలీలో నడిచారు. అందరూ సత్యార్థిని ఒక సోదరునిగానో, స్నేహితునిగానో చూసేవారు.


విచిత్రం ఏమంటే, "బచ్‌పన్ బచావో ఆందోళన్" లో కైలాస్ పేరుగాని, అతని కుటుంబ సభ్యుల పేర్లుగాని లేవు. రమేష్‌గుప్తా దానికి చైర్మన్. తరుణ్ సక్సేనా ఉపచైర్మన్, చౌరాసియా కార్యదర్శి, పంకజ్‌బాత్రా కోశాధికారి. అలాగే "రగ్‌మార్క్"లో కూడా కైలాస్ పేరు లేదు. అతడు ఒక సభ్యుడు మాత్రమే. తనతో పని చేసేవారికి ఆయా పనులలో నియమించాడు. అధికారం మొత్తం లాటిన్ అమెరికాకు చెందిన కామిల్లా క్రోసన్‌కి యిచ్చాడు. మోనికా ఫోలిహక్స్ చైర్మన్‌గాను, మరియా ఖాన్ ఉపచైర్మన్‌గాను, వ్యవహరించారు. ఇతర దేశాల సభ్యులతో కైలాస్ కూడా ఒక సాధారణ సభ్యుడు మాత్రమే.

# 9. పారదర్శకత

**భా**రతదేశంలో చాలా రకాల మనుష్యులు ఉన్నారు. నిజాయితీపరులున్నారు. నేరచరిత్రులున్నారు. తవ్విన కొద్దీ రకరకాలు స్వభావాలు కనిపిస్తారు. కొంతమంది మంచి పనులు చేసి, యితరులకు ఉపకారం చేసి మహాత్ములవుతారు. మరికొంతమంది నేరాలు చేసి, హంతకులై, చోరులై చివరకు జైలు పాలవుతారు. ఎవరైనా మన వద్దకు వచ్చి తనకేదైనా కష్టం వచ్చిందని చెప్పి, తనకు ఎవరూ సహాయం చేయడం లేదని, చెబితే మనం ఏం చేస్తాం? పోలీసులతోగాని, అధికారులతో గాని చెప్పుకోమంటాం. వారు కూడా పట్టించుకోలేదంటే మనమే సహాయం చేయడానికి పూనుకుంటాం. కాని సహాయం అడిగిన వెంటనే మారుమాట చెప్పకుండా సహాయం చేసేవారు కొందరుంటారు.

అటువంటివాడే కైలాస్ సత్యార్థి. తన స్వంత పనుల్ని కూడా త్యాగం చేసి, వారికి సహాయం చేస్తాడు.

ఎవరైనా మన వద్దకు వచ్చి, తాను బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేస్తాననీ, వారి హక్కుల్ని కాపాడడానికి పోరాడుతాననీ, తనకు ఆర్థికంగాగాని, ఎవరి యొక్క సహాయంగాని అవసరం లేదని అంటే మనం ఏమనుకుంటాం? అతడు పిచ్చివాడనీ, తెలివితక్కువవాడనీ అనుకుంటాం. బాలకార్మిక వ్యవస్థ చాలా పెద్దది. విశ్వవ్యాప్తంగా ఉంది. ఆ విషయం మనం తెలుసుకోవాలి. బానిసత్వం నుండి విముక్తి చెందిన వారిని చూసినప్పుడు కైలాస్‌కి ఉత్సాహం, ఆత్మ విశ్వాసం కలుగుతుంది. కాబట్టి మనం కైలాస్ యొక్క కృషి ఏ విధంగా చేశాడు, అతని పద్ధతి ఏమిటి అతడు ఏయే సంస్థలతో అనుసంధానింపబడి ఉన్నాడు అనే విషయాల్ని తెలుసుకోవాలి.



**కైలాస్ యొక్క లక్ష్యం :**

"బచ్‌పన్ బచావో ఆందోళన్" ప్రపంచ ర్యాలీ మొదలైన ఉద్యమాల ద్వారా ఎక్కు కృషి చేసి బాలలను విముక్తి చేసి, వారి హక్కులను కాపాడి, వారికి పునరావాసాలు కల్పించి, విద్య నేర్చుకునే హక్కు కల్పించిన ఘనతను పొందాడు కైలాస్ సత్యార్థి. అతని

లక్ష్యం బాలల గురించే. దానికి అంకితమై పోయాడు. అంతేకాని, గుప్తంగా ధనాన్ని సంపాదించి నడిపే సంస్థల వంటిది కాదు సత్యార్థిది.

**పరిధులు :**

ప్రపంచవ్యాప్త ర్యాలీయే బాలల హక్కులను గురించి చేసిన ఉద్యమాలలో చాలా గొప్పది. అదే మూలస్తంభం అని చెప్పవచ్చును. ఎన్ని ఆటంకాలు కలిగినా వాటిని ఛేదించి చాలా వరకు లక్ష్యాన్ని సాధించగలిగింది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించబడాలంటే సంఘంలో మార్పు రావాలి. సంఘంలో మంచి అవగాహన కలగాలి. సంఘటితంగా ఉద్యమాలు చేయాలి. అది ప్రపంచవ్యాప్తంగా జరగాలి. ఇటువంటి అవసరాన్ని ప్రపంచర్యాలీ తీర్చింది.

**విధానాలు :**

"బచ్‌పన్ బచావో ఆందోళన్" ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం బాలలతో అతి సన్నిహితంగా, స్నేహపూర్వకంగా మెలగడం. అప్పుడే వారి యొక్క సాధకబాధకాలు పూర్తిగా తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది. పరిష్కారమార్గాలు అన్వేషించడానికి వీలవుతుంది. ఆ పని బచ్‌పన్ బచావో ఉద్యమం చేసింది. మొదట్లో యీ ఉద్యమం వ్యతిరేకత తెలియజేసింది. తరువాత కార్యాచరణకు దిగింది. ఈ వ్యవస్థ నిర్మూలనకు కఠినమైన చట్టాన్ని రూపొందించాలని కోరింది. 14 సంవత్సరాలలోపు బాలలను పనిలో పెట్టుకోరాదని ఉద్యమం చేసింది. భారత పార్లమెంటు ముందు 1986లో చేసిన చట్టంలో మార్పు చేయాలంది. అదే సమయంలో నేపాల్‌లోను, పాకిస్తాన్‌లోను ఉద్యమాలు చేపట్టింది. ఈ ఉద్యమం చాలా పర్యాయాలు ప్రధానమంత్రితోను, రాష్ట్రపతితోను భేటీ అయింది. జ్ఞాని జైల్‌సింగ్, వెంకట్రామన్, శంకర్‌దయాళ్ శర్మ, నారాయణన్, అబ్దుల్‌కలాం, పి.వి. నరసింహారావు, వాజపేయి, గుజ్రాల్ మన్మోహన్‌సింగ్ మొదలైనవారందరితోను సమావేశమయింది. జాతీయ స్థాయిలో చర్చలు జరిపింది.

చాలా సంస్థల కలయికతో 1989లో దక్షిణాసియా సంయుక్త సంఘం ఏర్పాటు చేసింది. దీనిలో చాలామంది ప్రముఖులు సభ్యులుగా ఉన్నారు. 1992లో పార్లమెంటు సంఘం, 1993లో మత సంఘం, 1994లో ట్రేడ్ యూనియన్ సంఘం యీ సమస్య మీద గళమెత్తాయి. బాలమిత్ర గ్రామాన్ని యీ ఉద్యమం ఏర్పాటు చేసింది. దీనిని విశ్వవ్యాప్తంగా అందరూ కొనియాడారు. విముక్తి పొందిన బాలకార్మికులకు పునరావాసం కల్పించారు. తరువాత బాణసంచాల కర్మాగారాలలో బాలలను ఉపయోగించరాదని ఉద్యమం చేసింది. అలాగే క్రీడా పరికరాలు తయారీలోను, యితర కర్మాగారాలలోను

బాలలను పనిలో పెట్టరాదని చెప్పింది. 1995లో కన్యాకుమారి నుండి ఢిల్లీ వరకు 5000 కి.మీ. ర్యాలీని 1996లో కలకత్తా నుండి ఖాట్మండు వరకు ర్యాలీని, 1998లో ప్రపంచ వ్యాప్త ర్యాలీని  నిర్వహించింది.

"రగ్‌మార్క్" (అంతర్జాతీయ గుడ్‌వీవ్)ను ఒక ఉద్యమంగా మొదలుపెట్టింది. 2012లో "బాల కార్మిక వ్యవస్థ లేని భారతదేశం" అంటూ ఉద్యమం చేసింది. ఆ వ్యవస్థని నిషేధించాలని కోరింది. "ఇండియా ఏక్షన్ వీక్" అనే పేరుతో జాతీయ స్థాయిలో అనేక ఉద్యమాలు చేసింది. బాలల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేస్తూనే ఉంది. ప్రజాహిత వ్యాజ్యాల్ని చాలాసార్లు వేసింది. అలాగే తప్పిపోయిన బాలల గురించి అనేక ప్రయత్నాలు చేసింది. "బాల్యాన్ని రక్షించండి" అనే సంస్థకి, ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో ఢిల్లీ హైకోర్టు బాల కార్మిక వ్యవస్థని నిషేధిస్తూ 2009లో ఉత్తరువులు జారీ చేసింది.




బచ్‌పన్‌బచావో ఉద్యమానికి, ప్రపంచ ర్యాలీకి పెద్ద భేదం ఏమీ లేదు. బాల కార్మిక వ్యవస్థ బాలల అభివృద్ధికి, ఆటకం అని ప్రపంచ ర్యాలీ పేర్కొంది. బాల్యం అంతటినీ అది హరిస్తుంది. బాలల సర్వతోముఖాభివృద్ధికి అడ్డుపడుతుంది. బాలలకు సక్రమమైన విద్యని సకాలంలో అందిస్తే వారికి చక్కని అవకాశాలు లభించడమే కాక, తరువాత తరాలు కూడా వారిని అనుసరిస్తాయి. విద్య వల్లనే ఒక వ్యక్తి తన జీవిత విధానాన్ని మెరుగుపరచుకోగలడు. అంతర్జాతీయంగా కూడా అందరికీ విద్య అనేది లేకపోవడం చాలా దురదృష్టకరం. దాని వల్ల బాలలు అనేక విధాలుగా హింసింపబడుతున్నారు.

కాబట్టి యీ దురవస్థ పోవాలంటే బాలలందరికీ నాణ్యమైన నిర్బంధ ఉచిత విద్యని అందించాలి. విద్య వల్లనే పటిష్ఠమైన సంఘం తయారవుతుంది. పౌరులకు ఉన్నత స్థితి లభిస్తుంది. భవిష్యత్తులో సరియైన ప్రణాళికలు వేసుకోగలుగుతారు. అప్పుడే వారికి అభివృద్ధి కలుగుతుంది. కాబట్టి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, అందరికీ విద్య యీ రెండూ ఒక నాణానికి రెండు ప్రక్కలు. ఒకటి లేకపోతే రెండవది కూడా ఉండదు. దీనిని ఆచరణలో పెట్టడానికి ప్రభుత్వం నిధులు లేవంటుంది. ఇదే సాధ్యం అయితే బాలలు పనిముట్లతో కాక పుస్తకాలతో ఆనందిస్తారు.

**ఆచరణ :**

బచ్‌పన్ బచావో, ప్రపంచ ర్యాలీ నియమబద్ధంగా నడుస్తున్నాయి. వాటికి సంస్థలు న్నాయి. నడిపే ఉద్యోగులు ఉన్నారు. ఒక చైర్మన్, ఉప చైర్మన్, సెక్రటరీ, కోశాధికారి, నలుగురు సభ్యులతో ఆ కమిటీలు ఏర్పాటయ్యాయి. ప్రతి రాష్ట్రంలోనూ బాధ్యత గల అధికారి ఉన్నాడు. ప్రపంచ ర్యాలీ అంతర్జాతీయ స్థాయిలో నడపబడుతుంది. దానికి కైలాస్ చైర్‌పర్సన్. ఫ్రాన్స్ రోజలెయిర్ వ్యవస్థాపక సభ్యుడు. ఇంకొక వ్యవస్థాపక సభ్యుడు ఎవీ జోవెన్. మూడవ సభ్యుడు ఆద్యంతయ.

**భాగస్వామ్యం :**

బచ్‌పన్ బచావోనుండి సహాయం కోరడానికి ఒక సమయం అంటూలేదు. ఏ సమయంలోనైనా కోరవచ్చు. ఏ సమాచారం కావలసినా ఏ సమయంలోనైనా అడగ వచ్చును. మనం సూచనలు యివ్వవచ్చు, ఫిర్యాదులు చేయవచ్చు. ఐచ్ఛికంగా పని చేయవచ్చు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో కైలాస్ సత్యార్థి మీద అపరిమితమైన నమ్మకం ఉంది. అతడు మూడు పర్యాయాలు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయబడ్డాడు.

**పారదర్శకత :**

బచ్‌పన్‌బచావోకి, ప్రపంచ ర్యాలీకి వెబ్‌సైట్లు ఉన్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్లు కూడా ఉన్నాయి. గత, సంవత్సరాలలో వారు ఏమి చేసినదీ దానిలో చూడవచ్చు. అది ఉచితంగానే. అన్ని భాషల్లోను ఆ నివేదికలున్నాయి.

మనం నేరుగా కూడా వారిని కలవవచ్చు. టెలిఫోను, తపాలా, ఇ–మెయిల్ అన్నీ ఉచితంగా మనకి అందుబాటులో ఉంటాయి.

# 10. కైలాస్ యొక్క ఆదర్శం, స్ఫూర్తి

కైలాస్ సత్యార్థికి మహాత్మాగాంధీ ఆదర్శం. గాంధీజీలాగే అతడు సత్యాన్నే చెబుతాడు. అది ఏ సమయంలోనైనా, ఏ ప్రదేశంలోనైనా, ఏ సందర్భంలోనైనా సరే. కులమత విచక్షణ వల్లనే మానవులందరూ అసంఘటితంగా ఉన్నారు. కైలాస్ అటువంటి విచక్షణకు వ్యతిరేకి. ప్రపంచవ్యాప్తంగా బాల కార్మికుల అవస్థల్ని చూసి ఎంతగానో చలించిపోయాడు. కైలాస్ చేసిన ప్రసంగాలు సాధారణమైనవి కావు. మనకు తెలియనివి చాలా ఉంటాయి. అవి మన కంటికి నీరు తెప్పిస్తాయి.

అభివృద్ధి చెందిన దేశాలలో కంటె అభివృద్ధి చెందుతూన్న దేశాలలోనే బాల కార్మిక వ్యవస్థని నిర్మూలన చేయడం అతి ముఖ్యం. లేకపోతే నేరాలు, అంతర్జాతీయ టెర్రరిజానికి అవి దారి తీస్తాయి. టెర్రరిస్టులు బాలలను కిడ్నాప్ చేసి, వారిని భయపెట్టి నేరాలకు పాల్పడేటట్లు చేయడమే కాక టెర్రరిజానికి కూడా పాల్పడేటట్లు చేస్తున్నారు. కాబట్టి యీ సమస్య ఒక్క దేశానికే పరిమితమయినది కాదు. మానవజాతి కంతటికీ ఒక గడ్డు సమస్య.

కైలాస్ చేసిన కొన్ని ప్రసంగాలు యీ క్రింద యివ్వబడ్డాయి.

ఇటలీలో 2000వ సంవత్సరం మార్చి నెలలో – ప్రస్తుతం మనం అంకెలు, వేగం ఉన్న శకంలో ఉన్నాం. ఇది మన కొత్త సాంఘిక ఆర్థిక సంస్కృతిని, ఆర్థిక విధానాల్ని, రాజకీయ ప్రాధాన్యతని ప్రతిబింబిస్తూంది. మానవుల అదృష్టం, భవితవ్యం డాట్‌కామ్ మీద ఆధారపడి ఉంది. దయా దాక్షిణ్యాలు అంతరించాయి. ప్రపంచం ప్రగతి పథంలోకి పోవాలంటే కొత్త జీవిత విధానం, సరికొత్త అభిప్రాయాలు ప్రస్తుతం అవసరం. విచిత్రం ఏమంటే ప్రస్తుత ప్రపంచం డబ్బు, అధికార కాంక్షతో ఉంది. మానవకల్పితమైన బాధల నుండి వేలాదిమంది బయట పడడానికి సూచనలు కనిపించడంలేదు. మానవ కల్పిత బాధలంటే పర్యావరణ కాలుష్యం, హింస, లింగ వివక్ష, దోపిడీ, బాలల హక్కుల్ని కాలరాయడం మొదలైనవి.



చాలామంది బాలలు పశువుల్లాగ విక్రయింప బడుతున్నారు. వారి చేత అతిహేయమైన పనులు చేయిస్తున్నారు. వారికి తగిన వేతనాలు

యివ్వడం లేదు. పైగా వారిని క్రూరంగా హింసిస్తున్నారు. వారి స్వేచ్ఛను హరిస్తున్నారు. ఈ విధంగా 1997లో ప్రపంచ ర్యాలీ జరిగే వరకు జరుగుతూనే ఉంది. ఈ ర్యాలీ ఒక సాధారణ సంఘటన కాదు. దక్షిణాసియా సంయుక్త కార్యాచరణ సంస్థ. అది 50వేల బాలలకు విముక్తి కలిగించింది. బాల కార్మిక వ్యవస్థ యొక్క మూలాల్ని పెరికివేయాలని సంకల్పించిన సంస్థ.అనేక ఉద్యమాలు చేసిన ఫలితంగా ఏర్పడిన సంఘటిత వ్యవస్థ. అంతర్జాతీయ కార్మిక సంఘం 1999లో ఏర్పడడం, యీ సంస్థ యొక్క ఘన విజయం అని చెప్పవచ్చును. అంతర్జాతీయంగా యీ సమస్యని ఎదుర్కోడానికి యిది నాంది పలికింది. ఇది ఒక నైతిక విజయం.

ప్రపంచర్యాలీ వల్ల అందరికీ యీ సమస్య మీద అవగాహన కలిగింది. అన్ని ఖండాల నుండి ప్రజల్ని యీ ర్యాలీ కూడగట్టగలిగింది. రాజులు, రాణులు, రాష్ట్రపతులు, ప్రధానమంత్రులు, మంత్రులు మొదలైన వారందరూ పాల్గొన్నారు. ట్రేడ్ యూనియన్లు, ఉపాధ్యాయులు, మతాధికారులు కూడా మద్దతు ప్రకటించారు. ఇటువంటి ఉద్యమాల వల్లా, ర్యాలీల వల్ల ప్రభుత్వాల మీద ఒత్తిడి పెరిగింది. చాలా దేశాలలో యిటువంటి సంఘాలు ఏర్పడాయి. మొదట్లో ఏ దేశమూ దీనిని ఒక సమస్యగా పరిగణించలేదు.

అంతర్జాతీయంగా యీ సమస్యని తొలగించడానికి చట్టాలు చేయడం ముఖ్యం. కాని అది అంతిమ లక్ష్యం కాదు. మనం బాల కార్మిక వ్యవస్థ గురించి సమాచారం యివ్వడం, యితర సంఘాలతో మన అభిప్రాయాల్ని పంచుకోవడం కూడా చేస్తున్నాం. ప్రపంచ ర్యాలీ బాలల హక్కుల్ని పరిరక్షించడానికి ఏర్పాటు చేయబడింది. వారికి ఉచిత విద్య నేర్పించడం ఒక లక్ష్యం. బాల కార్మిక వ్యవస్థ నాణానికి ఒక వైపు అయితే, నిరక్షరాస్యత రెండవవైపు. కాబట్టి బాలలకు ఉచిత విద్య కోసం సంయుక్తంగా పోరాటం చేశాం. దీని వల్ల ప్రభుత్వం మీద ప్రజల ఒత్తిడి పెరిగింది. ప్రభుత్వం అంగీకరించింది. కాని సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రజలు ఒత్తిడి పెంచారు. అయితే ప్రభుత్వాలు "2000 సంవత్సరానికల్లా అందరికీ విద్య" అని ప్రకటించాయి. కాని అది నెరవేరలేదు. 2000 సంవత్సరం నాటికి విద్య మీద ప్రపంచ ఫోరంను డాకర్‌లో జరపాలని అనుకున్నాం దానిలో ప్రభుత్వాలు అమలు జరపడానికి గడువు నిర్ణయిస్తుంది. మళ్లీ ప్రభుత్వాల్ని 2005లోను, 2010లోను, యిప్పుడు 2015లోను హెచ్చరించవలసి వచ్చింది. ప్రభుత్వాల నిర్లక్ష్యమే యీ హెచ్చరికలకు కారణం. ఇంకా బాలకార్మికులు పెరిగే అవకాశం ఉంది. విద్యకు నిధులు యిచ్చే విషయంలోనూ ప్రభుత్వ నిర్లక్ష్యం కనపడుతూంది.

ఇంకొక సమస్య నిరక్షరాస్యత. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉంది. విద్య అనేది అగ్రకులాల వారికీ, ధనవంతులకీ మాత్రమే ఉందనే భావం ఉంది. దీనిని అధిగమించాలంటే దానిని ఎదుర్కోవడానికి పటిష్ఠమైన సంఘం కావాలి. లేకపోతే మానవహక్కుల ఉల్లంఘనగా పరిగణింపబడుతుంది, అభివృద్ధికి ఆటంకంగా మారుతుంది. ధనవంతులు యింకా సంపాదన కావాలని కోరుకోవడం వల్ల పేదల బాధల్ని గురించి పట్టించుకోవడం లేదు. కాబట్టి కఠినమైన చట్టాలు ఉండాలి. రాజ్యాంగపరంగా సవరణలు రావాలి. తగినంత నిధులు విద్య కోసం ఖర్చు చేయాలి. బాగా అభివృద్ధి చెందిన దేశాలలో కూడా రెండు శాతం కూడా విద్యకు కేటాయించకపోవడం విచారకరం.

అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా తమ ప్రాథమిక విద్య కోసం కేటాయించిన నిధుల కంటే నాలుగైదు రెట్లు విదేశాల నుండి తెచ్చిన అప్పుకి అయిన వడ్డీ చెల్లించడానికే సరిపోతుంది. ఉదాహరణకి మన దేశాన్నే తీసుకుందాం. ప్రాథమిక విద్య మీద మూడు బిలియన్ల అమెరికా డాలర్లు ఖర్చు చేస్తే, అప్పుల కోసం పదిహేను అమెరికా డాలర్లు చెల్లిస్తోంది. అందువల్ల మా ప్రపంచ ర్యాలీ కోరేదేమంటే ప్రపంచ బ్యాంకు యొక్క సహకారం, అంతేకాక అంతర్జాతీయ ద్రవ్యనిధి, భారత – అమెరికా అభివృద్ధి నిధి, ధనిక దేశాలు, ప్రాంతీయ సంస్థల సహకారాన్ని కూడా కోరుతున్నాము. బహుళజాతి కార్పొరేషన్స్ మీద విద్యాపన్నుని విధిస్తే వనరులు పెంచుకోవచ్చు. ప్రపంచ విద్యానిధిని ఏర్పాటు చేయాలి. అప్పుడే నిరక్షరాస్యతను నిర్మూలించడానికి అవకాశం కలుగుతుంది. మా ర్యాలీ బాలలతో సన్నిహితతత్వాన్ని కోరుతుంది. బాలలందరికీ నాణ్యమైన విద్యనందించాలి. నాకున్న అనుభవంతో చెబుతున్నాను. అందరిలోను బాలల హక్కుల గురించి పూర్తి అవగాహన కలిగింది. బాలలకు స్వేచ్ఛ కలిగించ సమయం దగ్గర పడింది.

## హానోవర్ యూనియన్ ఎక్స్‌పో - 2000 :

2000ల సంవత్సరంలో జరిగిన హానోవర్ ఎక్స్‌పోలో ప్రతివారి నోట ప్రపంచీకరణ అనే మాట వినపడుతూంది. ఇది ఎవరికోసం? ఒక డాలరు కూడా సంపాదించలేని వారికోసం, ఎప్పుడూ పుస్తకాలు ముట్టుకోని వారి కోసం, వివిధ రకాల బానిసత్వంలో మగ్గుతున్న వారి కోసం, మానవహక్కులు కోల్పోయి వ్యక్తిత్వాన్ని కూడా కోల్పోయిన వారి కోసం, ముఖ్యంగా బాలల కోసం ఎందుకంటే తక్కువ జీతాలిచ్చి బాలల చేత పనులు చేయించుకోవచ్చును కనుక.

ఒకసారి నేను దాడి చేసి తివాచీ పరిశ్రమ నుండి తొమ్మిదిమంది బాలలకు విముక్తి కలిగించాను. వారిలో 14 సంవత్సరాల బాలుడు తన తల్లిదండ్రుల్ని చూసి అయిదు

సంవత్సరాలు గడిచాయని చెప్పాడు. అటువంటి పరిస్థితులలో బాలల జీవితం గడుస్తూంది. ఈ సంఘటన మన దేశంలో జరిగినదే. కుమారుని చూడగానే అతని తల్లి, "ఇన్ని సంవత్సరాలు నీ కోసం ఏడుస్తూనే ఉన్నాను. నువ్వు అక్కడ నుండి పారిపోయి తప్పించుకుని ఎందుకు రాలేదు?" అని అడిగింది. అది చాలా హృదయవిదారకమైన దృశ్యం. అతడు ఆ విధంగా తప్పించుకుని రాలేకపోవడానికి కారణం అతని యజమాని అతని మడమల మీద తరచుకొట్టడం వల్ల కదలలేకపోయాడు. తివాచీలు బాలల చేత తయారు చేయబడ్డాయి. బహుశా మీరు కూడా వాటిని ఉపయోగించి ఉండవచ్చును. "సోదరులారా! మీరు బాధ్యత గల వినియోగదారులైతే యీ పరిశ్రమని ప్రోత్సహిస్తారా? వీరికి రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉన్నాయి.

నేను ప్రతిపాదించిన యీ తీర్మానానికి జర్మనీ వెంటనే స్పందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రస్తుతం "రగ్‌మార్క్"ని చాలా దేశాలలో పాటిస్తున్నారు. తివాచీలే కాక, యింకా యితర వస్తువుల కూడా బాలల చేత ఉత్పత్తి కాబడి వినియోగించబడుతూనే ఉన్నాయి. అన్ని దేశాల పాటించడానికి మేము 1998లో ప్రపంచ ర్యాలీ చేశాము. మేము కోరిన వాటిని పాటిస్తే జాతీయంగాను, ప్రపంచ వ్యాప్తంగాను బాలలు బానిసత్వం నుండి బయటపడతారు. మీరు కేంద్రీకరించవలసిన యింకొకటి ముఖ్యమైనది ఉంది. అదే "అందరికీ విద్య". ఇది 2015కల్లా రూపుదిద్దు కోవాలని కోరుతున్నాను. దాదాపు 125 మిలియన్ల బాలలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. 2000ల సంవత్సరంలో ప్రభుత్వాలు అంగీకరించాయి. కాని అది కలగానే మిగిలిపోయింది. చాలా ప్రభుత్వాలు విద్య కోసం ఎక్కువ నిధులు యివ్వడం లేదు. స్నేహితులారా! విద్య ఒక అభివృద్ధి కోసమే కాదు. అది మానవహక్కు కూడా. 2015కల్లా "అందరికీ విద్య"ని ప్రవేశపెడతామని అన్ని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కాని అది యిన్నాళ్లూ వాయిదాపడు తూనే ఉంది. కాని ఒక ఆశాకిరణం ఉంది. విద్య గురించి ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ ఉద్యమంలో నేను కూడా ఒక భాగస్వామి అవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజల వత్తిడి వల్ల తప్పకుండా అమలులోకి వస్తుందనే విశ్వాసం నాకుంది. కాబట్టి స్నేహితులారా! ఈ అంశం గురించి మనమంతా కలిసికట్టుగా పని చేయాలి.

ఇంకొక విషయం ఏమంటే,బానిసత్వ నిర్మూలనకి, అక్షరాస్యతకి పేదరికం అడ్డుకాదు. బాలల బానిసత్వం వల్లనే పెద్దలకు నిరుద్యోగ సమస్య ఎదురయింది. ప్రపంచంలో నిరక్షరాస్యత పోవాలంటే 8 బిలియన్ డాలర్లు కావాలి. ప్రపంచంలో మిలిటరీ ఖర్చు నాలుగు రోజులకు ఎంత అవుతుందో అంత. ఇది ఐరోపా దేశస్తులు ఐస్‌క్రీమ్ కోసం

ఖర్చు పెట్టిన దానిలో అయిదవ వంతు. అమెరికా దేశస్తులు పొగాకు మీద ఖర్చు పెట్టే దానిలో నాలుగవ వంతు. ఈ డబ్బుని ఉపయోగిస్తే బానిసత్వం, నిరక్షరాస్యత కూడా తొలగిపోతాయి. మానవులలోని దయ, సౌభ్రాతృత్వం, నిశ్చయత్వం దేవాంశ కలవి. ఇవి ప్రపంచం యొక్క భవిష్యత్తుని నిర్ణయించగలవని నా ప్రగాఢ విశ్వాసం.

**సత్యార్థి ఎప్పుడూ సత్యానే పలుకుతాడు :**

కెర్రీ కెనడీ రాసిన, "నిజం అధికారానికి దారి తీస్తుంది" అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ కైలాస్, నేను గత దశాబ్దంగా పురుషుల, స్త్రీల, బాలల పరిస్థితులను గురించి పని చేస్తున్నాను. ఈ సమస్య ఒక్క భారతదేశానికే కాదు. ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్ల బాలలు బానిసత్వంలో మగ్గుతున్నారు. వారు కర్మాగారాలలోను, యిళ్లలోను, వ్యవసాయ పనులలోను, దుకాణాలలోను అతి నీచమైన పరిస్థితులలో పని చేస్తున్నారు. నేను చేస్తూన్న పనికి నేను గర్విస్తున్నాను. అయితే బాలలను విడిపించడం అనేది ఒక ప్రత్యేక గుర్తింపు గల పని. కాని యిది బాలల సంరక్షణ చేసే కార్యక్రమాలలో ఒక భాగం మాత్రమే. ఇంకొక ముఖ్యమైన అంశం విద్య.

ప్రస్తుతం ప్రపంచంలో విద్య ప్రతి ఒక్కరికీ చాలా అవసరం. ఎందుకంటే ప్రపంచ దేశాలన్నీ ఒక దానితో ఒకటి సంబంధాలు కలిగి ఉన్నాయి. కాబట్టి ప్రాథమిక విద్య చాలదు. విద్యా ప్రమాణాల స్థాయి పెరగాలి. అభివృద్ధి చెందిన దేశాలలో కూడా విద్యా విధానాలు మానవ అవసరాల్ని తీర్చేవిగా లేవు. సంఘాన్ని అభివృద్ధి పరిచేవిగా లేవు. పైగా అందరూ స్వార్థపూరితులుగానే ఉన్నారు. తప్ప యితరులను గురించి ఆలోచించడం లేదు. అందువల్ల బాలలు ప్రపంచ పరిస్థితుల్ని గుర్తించలేక పోతున్నారు. కాబట్టి వారు కూడా సంకుచితతత్వాన్ని అలవాటు చేసుకుంటున్నారు. అందువల్ల మన బాలలు నిత్యం ఎదురుకునే సమస్యల్ని ఎలా పరిష్కరించుకోగలిగేటట్లు చేయగలం? ఈ రోజుల్లో మానవహక్కుల్ని గురించి తెలియజేసే విద్యని పాఠశాలల్లో బోధించాలి. దాని వల్ల ఒకరి యెడల ఎలా ప్రవర్తించాలో వారికి తెలుస్తుంది. ఈ పరికరాన్ని మనం బాలలకి ఎలా యివ్వగలుగుతాం? వారు దానిని తెలివితేటలతో ఎలాఉపయోగించగలిగేటట్లు చేయగలం?

మానవహక్కుల్ని తెలిపే పాఠ్యాంశాల్ని హైస్కూలులోను, విశ్వ విద్యాలయాలలోను బోధిస్తే వారు తమ జీవితంలో దానిని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి యీ పుస్తకంలో మానవహక్కులను గురించి, నైతిక విలువలు గురించి వివరించబడి ఉన్నాయి. మానవ హక్కుల కోసం పోరాడే వారిలో నేను కూడా ఒకడిని. మానవహక్కులు

ఉల్లంఘించేవారి విషయంలో వారి మనస్తత్వాలు ఎటువంటివో, వారిని ఎలా మార్చగలమో పరిశోధించే మార్గదర్శకాలు ఉన్నాయి. ఈ పుస్తకాన్ని ఉచితంగా హైస్కూళ్లకి, విశ్వ విద్యాలయాలకి యిస్తారు. ఇది ఆన్–లైన్‌లో కూడా లభిస్తుంది. దీనిని యింకా అయిదు భాషలలోకి తర్జుమా చేయదలిచారు. భావితరాల వారిలో భావ విప్లవం జరిగి వారు సరియైన మార్గంలో పయనించగలుగుతారు. కాబట్టి నేను మీ అందరినీ యీ పుస్తకం చదవమని ప్రోత్సహిస్తున్నాను" అన్నాడు.

## రగ్‌మార్క్ :

కైలాస్ రాసిన "రగ్‌మార్క్" పుస్తకం ఆవిష్కరించబడింది. కైలాస్ మాట్లాడుతూ, "కెనడాకు చెందిన రాబర్ట్స్ డేవిస్ నేను రాసిన రగ్‌మార్క్ పుస్తకాన్ని ప్రచురించినట్లు తెలిసి ఉద్రేకానికి లోనయ్యాను. ఇక్కడ నాకొక సంఘటన గుర్తుకి వస్తుంది. నేను తివాచీ పరిశ్రమ నుండి కొంతమంది బాలల్ని విడిపించి, వారిని వారి గ్రామాలకు తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించాలని రైల్వేస్టేషన్‌లో ఉండగా, మేము ఎక్కబోయే రైలు నుండి బాలలు దిగారు. వారిని తివాచీ పరిశ్రమకు తీసుకుని వెళ్లడానికి సిద్ధమవుతూ ఉండగా నేను అడ్డుకున్నాను. అంతలో యిద్దరు పోలీసులు నేను శాంతిభద్రతల్ని పాడుచేస్తున్నానని నన్ను ఆ రాత్రి నిర్బంధంలో ఉంచారు. నేను ఆ బాలల్ని రక్షించలేక పోయాను. నేను విడిపించిన వారికంటే ఆ బాలలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

అప్పుడు నేను అనుకున్నాను.తెలిసో, తెలియకో ఆ తివాచీలను వినియోగించేవారికి ఆ పరిశ్రమకు మూలమైన బాలల పరిస్థితిని గురించి వారికి అవగాహన కల్పించాలను కున్నాను. బాలల చేత తయారు చేయబడని వాటినే కొనమని చెప్పాలనుకున్నాను. తివాచీలే కాక, వారు రగ్గులు కూడా తయారు చేస్తున్నారు. వాటిని కొనకుండా చేయాలని నా సంకల్పం. ఇది నిజంగా చాలా కష్టమైన పనే. జర్మనీ దేశంలో వినియోగదారులు జంతువుల్ని రక్షించడానికి బొచ్చుతో తయారు చేసిన వస్తువుల ఉపయోగించడాన్ని నిషేధించారు. మరి బాలల కష్టాన్ని వారెందుకు ఉపయోగించు కుంటున్నారు? నేను తిరిగి ఢిల్లీలో నా ఆఫీసుకి తిరిగి రాగానే జర్మనీలో ఉన్న నా స్నేహితులకు యీ విషయాన్ని తెలియజేశాను. వెంటనే రెయినర్ క్రూజ్ జర్మనీ నుండి నా వద్దకు వచ్చాడు. మేమందరం కలిసి ఉద్యమాన్ని ప్రారంభించాం. "రగ్‌మార్క్" ఆ విధంగా 1990లో ప్రారంభమయింది. ఇది కార్చిచ్చులా ప్రాకింది. వెంటనే చాలామంది వ్యక్తులు, చాలా సంస్థలు రగ్‌మార్క్‌ని గుర్తించాయి. నేపాల్, పాకిస్తాన్‌లు దానిని ఆచరణలో పెట్టాయి.

"రగ్‌మార్క్" అంటే బాలల చేత తయారు చేయబడినవి కావు అనే ముద్ర. ఇది చాలా అద్వితీయమైన ప్రయత్నం. వేళ్లూనుకుని ఉన్న బాలల బానిసత్వ నిర్మూలనకు రగ్‌మార్క్ ఒక్కటే పరిష్కారం కాదు. కాని పరిష్కార మార్గాలలో యిది కూడా ఒకటి. దీని వల్ల కొంత వరకు బాల కార్మికుల్ని తీసుకోవడం తగ్గింది. మిగిలిన పరిశ్రమలు కూడా రగ్‌మార్క్‌ను అనుసరిస్తున్నాయి.

## విద్య మీద ప్రపంచ సమావేశం :

విద్య మీద ప్రపంచ సమావేశం యొక్క ప్రారంభోత్సవ సందర్భంగా సత్యార్థి యిలా అన్నాడు.

"మనం యీ రోజు సమావేశం అవడానికి ఒక అభివృద్ధి పథకం గురించి చర్చించడానికి కాదు. రానున్న విపత్తుని గురించి చర్చించడానికి కాదు. మన ప్రాథమిక హక్కైన నిర్బంధ ఉచిత విద్య గురించి ప్రశ్నించడానికి వచ్చాం. ప్రశ్నించినపుడల్లా వాయిదాలు వేయడంతోనే సరిపోయింది. నాయకుల నిర్లక్ష్యధోరణిని పరిశీలించి, ప్రశ్నించడానికి వచ్చాం. నాగరికతకు దూరంగా ఉన్నవారిని గురించి ప్రశ్నించడానికి వచ్చాం. మనం యిక్కడ సమావేశం కావడానికి గల ఉద్దేశం మరి మనం వేచియుండలేమని చెప్పడమే. ఇప్పుడే మనకి విద్యాహక్కు కావాలి.




శతాబ్దాల కాలం నుండి విద్య మత సంస్థల యొక్క ఆధీనంలో ఉండేది. లేదా ధనికుల చేతుల్లో ఉండేది. రహదారుల నిర్మాణం, పరిశుభ్రత, నీటి సరఫరా మొదలైన అంశాల్ని చూసినట్లుగానే ప్రభుత్వాలు విద్యని కూడా అదేవిధంగా పరిగణించాయి. విద్య

నేర్చుకోవడం మన జన్మహక్కు. దానికి విరుద్ధంగా నడిచే వారెవరైనా నేరస్తులే. సుబేసింగ్‌కి, అతని కుమార్తె 14 ఏళ్ళ గులాబోకి విద్యే సర్వస్వం స్వేచ్ఛే ప్రాణం. ఇటుకలు తయారు చేసే పరిశ్రమలో సుబే ఒక కార్మికుడు. అతనిని పశువు మాదిరిగా చాలా సంవత్సరాలు అమ్మడం, కొనడం జరిగింది. అతని కుటుంబంతో సహా కొనేవారు. గులాబో కూడా బానిసగానే పని చేసింది. ఆమెకు సరియైన పోషణ లేకపోవడం వల్ల క్షయవ్యాధి వచ్చింది. వారికి యజమాని సరియైన ఆహారం యిచ్చేవాడు కాదు. జీతం కూడా యివ్వలేదు. సుప్రీంకోర్టు సహాయంతో నేను అతనిని, అతని కుటుంబాన్నీ విడుదల చేయించాను. వారితో పాటు యింకా 27మందికి విముక్తి కలిగించాను. వారిని నా ఆఫీసుకి తీసుకుని వచ్చాను. గులాబో నా చేతిలో మరణించింది. తనకు జీవించాలని ఉందని చెబుతూ ఆ బాలిక ప్రాణం వదలింది. మార్చురీ నుండి బాలిక మృతదేహాన్ని తెచ్చుకోవడానికి సుబేని సంతకం చేయమంటే అతడు తాను అక్షరాస్యుడైతే యీ గతి తన కుటుంబానికి పట్టేది కాదన్నాడు. ఇటువంటి కుటుంబాలు ఎన్నో. ఈ 21వ శతాబ్దంలో కూడా యింకా నిరక్షరాస్యులున్నారంటే దానికి కారణం నిరక్షరాస్యతే.

1990లో యీ సమస్య మీద చర్య తీసుకోవడం జరిగింది. అయితే ఆ సమావేశానికి వచ్చిన అధికారులు ఒకరి వీపు ఒకరు తట్టుకుని, కరచాలనం చేసి, ఒక చిరునవ్వు నవ్వి “అందరికీ విద్య” అనే నినాదాన్ని 2000 సంవత్సరంలో ప్రకటించారు. వారు చాలా వాగ్దానాలు చేశారు. అప్పటికి 750 మిలియన్ల నిరక్షరాస్యులున్నారు. ప్రస్తుతం అది 880 మిలియన్ల మందికి విద్య అందడం లేదు. ప్రపంచంలో మూడింట రెండువంతుల మహిళలు నిరక్షరాస్యులే. వీళ్ల శక్తి అంతా వృథా అయినట్లే కదా? పేద, ధనిక దేశాలన్నీ కూడా తాము చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదు. ప్రస్తుతం విద్య మీద ఖర్చు నామమాత్రమే. విద్య మీద చాలా తక్కువ ఖర్చు చేస్తే, నిపుణులైన ఉపాధ్యాయులు రారు. నాణ్యత గల విద్య లభించదు. విద్యాధికులలో 70 శాతం దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తూన్నవారే. వారి నుండి మనం ఏమి ఊహించగలుగుతాం?

అధిక వనరులు చేకూరుస్తామనే వాగ్దానాలు చేశారు. కాని నిధులు లేకపోవడంతో ఆ వాగ్దానాలు నెరవేరలేదు. స్నేహితులారా! యుద్ధం ముగిసిన తరువాత వాణిజ్య ప్రపంచీకరణ చేయాలనుకున్నారు. దీనివల్ల ధనిక దేశాలు గీచిన గీటు ప్రకారమే పేద దేశాలు ఆచరించవలసి వస్తుంది. రెండవది మానవ సంబంధం లేకుండా సాంకేతిక సమాచార పరిజ్ఞానం రావడం. దీనివల్ల మానవ విలువలు పోయాయి. మూడవది పౌరసంఘాలు ఏర్పడడం, సంయుక్త కార్యాచరణ, ప్రపంచర్యాలీలు జరిగాయి. ఇప్పుడు విద్య కోసం ప్రపంచ వ్యాప్త ఉద్యమం జరుగుతుంది.

అయితే యీ ప్రపంచవ్యాప్త ఉద్యమం ఒక సాంఘిక అద్భుతం. ఆరు నెలల కాలంలో యిటువంటి కూటములు వెలిశాయి. ఏప్రిల్ 2000లలో "ప్రపంచ ఆచరణవారం" ఏర్పడింది. దీనివల్ల ప్రజలలో అవగాహన కలిగింది. ప్రభుత్వాలపై ఒత్తిడి పెరిగింది. ఈ సంఘాలు తాము ప్రభుత్వం చేసే శుష్క వాగ్దానాలకి, మోసాలకీ ప్రేక్షకపాత్ర వహించబోమని తెలియజేశాయి. ఒక గడువు నిర్ణయించి, వాగ్దానాలు నెరవేర్చాలి. తగినవనరులు, వసతులు సమకూర్చాలి. ప్రజాస్వామ్యంగా, పారదర్శకంగా ఏర్పాటు చేయాలి. ఇది జరిగేవరకు మేము నిద్రపోము, ప్రభుత్వాన్ని నిద్రపోనీయం.

విద్య ప్రాథమిక హక్కు అనే విషయాన్ని గుర్తించాలి. ఆ విద్య నాణ్యత గలదిగా ఉండాలి. అది ఉచిత నిర్బంధ విద్య కావాలి. లింగ వివక్ష ఉండకూడదు. సమావేశ ఫలితం ఏమంటే, పటిష్ఠమైన జాతీయ ప్రణాళిక రూపుదిద్దుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఏ ప్రభుత్వమూ కూడా ధనాభావం అని చెప్పి తప్పించుకోకూడదు. ఆ సమావేశం యొక్క తీర్మానాన్ని ఖచ్చితంగా ఆచరణలో పెట్టాలి. ఇంతవరకు యునెస్కో యొక్క పాత్ర సంతృప్తికరంగా లేదు. నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల్ని వేరే ఉంచడం జరిగింది. వారు కూడా దీనిలో భాగస్వాములు కావాలి. యునెస్కో యొక్క ఆర్థిక తీర్మానాలు కూడా స్పష్టంగా లేవని చెప్పడానికి నేను సందేహించను. తీర్మానం మాత్రం చాలా ఆదర్శవంతంగా ఉంది. కాని ఆచరణలో పారదర్శకత లేదు. ఎన్.జీ.ఓ.ల భాగస్వామ్యం, ప్రజల భాగస్వామ్యం ఎంతవరకూ ఉండాలో స్పష్టత లేదు.

ఒకటి గుర్తుంచుకోవాలి. పేదరికం వల్ల నిరక్షరాస్యత రాదు. నిరక్షరాస్యత వల్లే పేదరికం వస్తుంది. ఇటువంటి భావం ప్రభుత్వాలకి కలగాలి. జ్ఞానం వల్ల కలిగే శక్తి కొంతమందికే పరిమితమయినది కాదు. ఈ విషయం అందరూ మరచిపోతున్నారు. ఆ ఆ కొంతమందికే విద్య మీద గుత్తాధికారం ఉందని భావించడం హాస్యాస్పదం కాదా? ఏ దేశం అయితే జ్ఞాన సంపన్నం అవుతుందో, పారదర్శకంగా అమలు జరుపుతుందో ఆ దేశం సుభిక్షంగా ఉంటుంది. దీనంతటికీ కీలకం విద్య. దానివల్లనే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలమవుతుంది. బాలల హక్కుల పరిరక్షించబడతాయి. విద్య వల్ల నైపుణ్యం కలుగుతుంది. దాని వల్ల నిరుద్యోగ సమస్య కూడా తలెత్తదు. రైతులకు అధిక ఉత్పత్తి చేయాలో తెలుస్తుంది. ఉద్యోగులకి తమ ఉద్యోగంలో నైపుణ్యం చేకూరుతుంది.

బాలల అంశం మీద జరిగిన అంతర్జాతీయ సమావేశంలో రాజకీయ నాయకులు బాలల్ని సమర్థిస్తూ ఆవేశపూరిత ఉపన్యాసాలు, వాగ్దానాలు చేశారు. ఎప్పుడైతే బాలలు బానిసత్వంలోకి పంపబడ్డారో, అప్పుడే మానవాళికి మచ్చ ఏర్పడింది. బాలలను

హింసించడం, వారి హక్కుల్ని కాలరాయడం మొదలైనవి అతి హీనమైన నేరాలు. ఆ నేరం బయటకు కనిపించకపోవచ్చు కాని అది మానవుని సామర్థ్యాన్ని నశింపజేస్తుంది. యాజమాన్యంలోఉన్న దురాశే బాల కార్మికవ్యవస్థకు మూలకారణం.సంబంధిత అధికారులు స్త్రీ సంక్షేమం, శిశు సంక్షేమం గురించి శ్రద్ధ తీసుకుని వారిని రక్షించాలి. కాని వారే యిటువంటి చర్యలకు పాల్పడుతున్నారు. బానిస వ్యాపారానికి ముఖ్య కారణం దురాశ.

విడిపించబడిన కొంతమంది బాలలతో నేను వెళ్తున్నాను. మేము ప్రతి పార్లమెంటు సభ్యుని వద్దకు నాణ్యత గల విద్య బిల్లును ప్రవేశపెట్టమని కోరాం. 18 సంవత్సరాల వరకు విద్య బాలల ప్రాథమిక హక్కు. మేము మా సంస్థ ద్వారా పది సంవత్సరాలు వయసున్న అష్రాఫ్ అనే బాలునికి విముక్తి కలిగించాం. అతనికి ఆరు సంవత్సరాలు ఉన్నప్పుడు ఒక ధనికుడైన గృహయజమాని తన పిల్లల సంరక్షణ కోసం అతనిని కొన్నాడు. పైగా అతనిని తన యింట్లో పనుల కోసం కూడా ఉపయోగించుకున్నాడు. కాని అష్రాఫ్ తల్లిదండ్రులకు ఆ యజమాని అష్రాఫ్‌ని చదివిస్తానని కూడా చెప్పాడు. దానివల్ల అతడు మంచి ప్రభుత్వ ఉద్యోగి అవుతాడని నమ్మబలికాడు. కాని అష్రాఫ్ చేత అన్ని యింటి పనుల్ని చేయించుకున్నాడు. కొన్ని నెలల పాటు అతనిని యింటి నుండి బయటికి రానీయలేదు. తలుపులు తాళం వేసేవాడు. ఒకరోజున అతడు ఒంట్లో బాగులేక యిచ్చిన పనిని పూర్తి చేయలేకపోయాడు. అతనికి ఆ రోజల్లా యజమాని భోజనం పెట్టలేదు. సాయంకాలం యజమాని యొక్క చిన్న కుమారునికి పాలు పట్టమని గ్లాసుతో పాలు యిచ్చాడు. అష్రాఫ్ ఆ శిశువుకి పాలు పట్టాడు. శిశువు తాగగా కొంత పాలు మిగిలింది. ఆకలితో ఉన్న అష్రాఫ్ వాటిని తాగాడు. అతడు తాగడం యజమాని, అతని భార్య చూశారు. అష్రాఫ్‌ని యీడ్చుకుంటూ వంటగది వద్దకు తీసుకుని వెళ్లారు. మండుతూన్న మంటల్లో అతని చేతుల్ని కాల్చి వేశారు. అంతేకాక అతని ముఖం మీద వాతలు పెట్టారు. ఆ సంగతి మాకు తెలిసి పోలీసులకు తెలియజేశాం. కాని వారు పట్టించుకోలేదు. ఎందుకంటే ఆ యజమాని చాలా పలుకుబడి ఉన్నవాడు.వెంటనే మేము జాతీయ మానవ హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేశాం. వారు ఆ యజమాని మీద వెంటనే చర్య తీసుకున్నారు.

అదేవిధంగా షైలా అనే 14 సంవత్సరాల బాలికని ఆమె తల్లిదండ్రులతో సహా రక్షించాము. ఆ బాలిక తల్లిదండ్రుల్ని మధ్యప్రదేశ్ నుండి ఒక మాఫియా ఏజెంటు ఉత్తరభారతానికి షైలా పుట్టకముందే తీసుకుని పోయాడు. కొన్ని సంవత్సరాల పాటు వారు బానిసలుగా పనిచేశారు. వారిని బయటకు ఎప్పుడూ పంపలేదు. షైలా పుట్టిన దగ్గర నుండీ 7-8 సంవత్సరాలు మొదలుకొని రాళ్లని గొడ్డలితో పగలగొట్టే పని చేసింది.

ఆ బాలికకు స్వతంత్రంగా జీవించడం అంటే ఏమిటో కూడా తెలియదు. ఆ వయస్సులోనే ఆమె అత్యాచారానికి గురి అయింది. అందువల్ల ఆమె మగవాళ్ళని ద్వేషించేది. నేను ఆమెను విడిపించినప్పుడు కూడా మగవాడినైన నన్ను నమ్మలేదు. తరువాత ఆమె నమ్మి స్వతంత్రం లభించినందుకు చాలా ఆనందించింది.

బాల కార్మిక వ్యవస్థ యీనాటికీ కొనసాగుతూనే ఉంది; ముఖ్యంగా దక్షిణార్థ గోళంలో బానిసత్వానికి కారణాలు రెండు. మొదటిది అప్పు తీర్చడానికి, భూస్వాముల నుండి అప్పు తీసుకున్నందువల్ల అది తీర్చలేక వారు బానిసలు అవుతున్నారు. వారి సంతానం కూడా బానిసలవుతున్నారు. అప్పు తీరదు, వారి బానిసత్వం పోదు. రెండవది వారు పుట్టిన కులం లేక జాతి. ఒక జాతివారు ఎప్పుడూ అగ్రజాతులనుకునేవారికి బానిసలుగానే ఉంటున్నారు. ఇటువంటిది వ్యవసాయరంగంలో కనిపిస్తుంది. భూస్వాములు వారికి నామమాత్రపు ఆహారాన్నిస్తారు. కూలి యివ్వరు. కార్మికులు తమ యిళ్ళలో జరిగే పండుగలన్నింటికీ భూస్వాముల నుండి ఋణాలు తీసుకుంటారు. వాటిని తీర్చలేరు. తీరవు కూడా. వారు జీవితకాలం బానిసలుగానే బ్రతకవలసి వస్తుంది. ఇక వారి కుటుంబాల సంగతి వేరే చెప్పనక్కర్లేదు.

బాలల్ని వ్యభిచారంలోకి దింపడం కూడా ఒక రకమైన బానిసత్వమే అవుతుంది. ఇది చాలా దేశాలలో జరుగుతున్నదే. దళారుల ద్వారా వీరు తరలించబడుతూ ఉంటారు. బాలలు ఆ ఉచ్చు నుండి తప్పించుకునే అవకాశమే లేదు. పైగా వారిని చిత్రహింసలకు గురి చేస్తారు. వీరు ఒకరి నుండి ఒకరు కొనుగోలు చేస్తూనే ఉంటారు. కొన్ని సందర్భాలలో వారి చేత బిచ్చమెత్తిస్తారు. వారి కాళ్లు చేతులు విరిచి, అంగవికలుల్ని చేసి వీధులలోను, దేవాలయాల వద్ద, మసీదుల వద్ద, చర్చిల వద్ద కూర్చోపెడతారు. వారు సంపాదించినదంతా ఆ ముఠాల జేబుల్లోకి పోతుంది. అనుకున్నంత డబ్బు వారు సంపాదించలేకపోతే ఆ రోజు వారు పస్తులు పడి ఉండవలసిందే. అంతేకాక ఆ బాలల చేత దొంగతనాలు మొదలైన నేరాలు కూడా చేయిస్తారు. మధ్య ప్రాచ్యంలో ఒంటెల పరుగుపందేలుంటాయి. వాటికి బాలలే జాకీలుగా ఉంటారు. అలా ఉండడం వల్ల వారికి ప్రాణహాని కూడా కలుగుతుంది. ఒకవేళ ఏ బాలుడైనా చనిపోతే ఆ యజమానులు అటువంటి బలహీనుడికి జన్మనిచ్చినందుకు అతని తల్లిదండ్రుల్ని తిట్టిపోస్తారు.

తాలిబన్ల విషయమే చూడండి. వారు బాలల్ని కిడ్నాపు చేసి వారిని బాల సిపాయిలుగా శిక్షణ యిస్తారు. ఇటువంటి టెర్రరిస్టు ముఠాలు వీరికి తుపాకులు కూడా యిస్తారు. ఆ విధంగా బాలల్ని టెర్రరిస్టులుగా మారుస్తారు. కొన్ని ప్రాంతాలలో బాలికల్ని దేవదాసీలుగా

దేవునికి అర్పిస్తారు. అంటే వారిని వ్యభిచారిణులుగా మార్చడం అన్నమాట. ధనికులు కాకపోయినా సామాన్య గృహాలలో కూడా బాలల్ని సేవకులుగా నియమించుకుంటున్నారు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఆగస్టు 23వ తేదీని “బాలకార్మిక నిర్మూలన దినం”గా పాటించమని ప్రకటన చేశాయి. కాని దీనివల్ల బాలలకు ఒరిగింది ఏమీ లేదు. బాలకార్మిక సమస్య రాను రాను జటిలమవుతూంది. బాలలు సులభంగా వీరికి దొరుకుతారు. నేను ఛైర్మన్‌గా ఉన్న ప్రపంచర్యాలీలో మేము బాలకార్మిక వ్యవస్థకు అడ్డుకట్టవేయడానికి ఒక “ఎమర్జన్సీ టాస్క్‌ఫోర్సు”ఏర్పాటు చేయమని కోరాం.మేము విమర్శిస్తూనే ఉన్నాం. తీర్మానాలు చేస్తూనే ఉన్నాం. మీడియాకు చెబుతూనే ఉన్నాం. దీనిని అత్యవసరంగా మార్చవలసిన పరిస్థితి ఉందని ఎందుకు గ్రహించరు? నాకు అర్థమయినదేమంటే, పేదరికం బాల కార్మిక వ్యవస్థకు దారి తీయదని. ప్రపంచవ్యాప్తంగా దీనిని నిర్మూలించడానికి అనేక సంఘాలు ఉద్యమిస్తున్నాయి. రాజ్యాంగంలో కొన్ని పొందుపరచబడి ఉన్నాయి. కాని లేనిదల్లా రాజకీయంగా, సాంఘికంగా ఆచరణ చట్టాలు సక్రమంగా అమలు జరగడం లేదు. పైగా చట్టాలు కూడా స్పష్టంగా లేవు. ఎక్కువ సమయం తీసుకుంటున్నాయి. చాలా ఖర్చుతో అమలు చేయవలసి వస్తూంది. పలుకుబడి ఉన్నవారి వద్ద నుండి బాలల్ని విడిపించాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని.

అయితే దీనిని మార్చలేమని కాదు. మార్చడానికి అన్ని విధాల చర్యలు జరుగు తున్నాయి. వాటిని నేను చాలా అభినందిస్తున్నాను. అవన్నీ రంగంలోకి దిగి ఎంతో ఉత్సాహంగా, చురుకుగా పని చేస్తున్నాయి. మా సంస్థ ద్వారా మేము 55,000 మంది బాలలకు విముక్తి కలిగించాం. మేము గతంలో విడిపించిన వారిలో కొంతమంది నాయకులై తమ వారిని బంధవిముక్తుల్ని చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

పదకొండు సంవత్సరాల వయస్సు గల ప్రదీప్ గురించి చెప్పి నా ప్రసంగాన్ని ముగిస్తాను. ప్రదీప్ బంధవిముక్తి చేయబడి యిప్పుడు పునరావాస కేంద్రంలో ఉంటున్నాడు. అతనిని ఒక దేవాలయంలో దేవతకు బలి యిద్దామనుకున్నారు. అతని తలను నైవేద్యం పెడదామనుకున్నారు. అతని కుటుంబం ప్రదీప్ పుట్టిన తరువాత పస్తులు పడి ఉండడం, అనారోగ్యాల పాలవడం జరిగింది. కాబట్టి అతడు బ్రతికి ఉంటే అరిష్టం అనుకున్నారు. అతనిని దేవతకు బలి యిస్తే కుటుంబమే కాక, సంఘం కూడా క్షేమంగా ఉంటుందను కున్నారు. అతనిని అర్థరాత్రి బలిపీఠం వద్దకు తీసుకుని వెళ్లారు. అప్పుడే అతనికి మెలకువ వచ్చి తల పైకెత్తి చూస్తే కత్తి మెడ మీదకి వస్తూంది.కాని అది గురి తప్పి తలకి తగిలింది. అతడు చనిపోయాడనుకుని రోడ్డు ప్రక్కన పడవేశారు. మృత్యు ముఖంలో అతనిని మా


పునరావాస కేంద్రానికి తీసుకుని వచ్చారు. రెప్పపాటులో అతనికి మరణం తప్పింది. అతనిని మామూలు స్థితిలోకి తేవడానికి కొన్ని నెలలు పట్టింది. గత వారం ప్రదీప్ ఒక పాటను రాసి నాకు పాడి వినిపించాడు. దాని సారాంశం యిది :

"మాలాంటి పిల్లల్ని నువ్వు పుట్టించి ఉండవలసింది కాదు. నువ్వే మా తండ్రివి. నీ మీద మాకు నమ్మకం ఉంది. మేము నీ బిడ్డలం. ఎందుకంటే భూమాత మీద నివసిస్తున్నాం. అలాగే సూర్యుడు, చంద్రుడు ఎవరైనా కాని మా వద్ద నుండి నీ వద్దకు వీస్తున్న గాలిని ఆపలేరు. ఆ గాలి అంతా మా కన్నీళ్లతోనూ, చిరునవ్వులతోను నిండి ఉంది. అలాగే మా కోపం, మా ప్రేమలతో నిండి ఉంది. ఈ గాలి తగలని వారు ఎవరుంటారు?"

ఇంతటి ప్రపంచీకరణలోను, సాంకేతిక సమాచారం గ్రహించడంలోను ఉన్నా, ఆ అమాయిక బాలుని పవిత్రవాక్యాల్ని మరచిపోలేము. మానవజాతిని రక్షించమనే సందేశం దానిలో ఉంది. కాబట్టి మనం అందరం సంఘటితంగా బాలకార్మిక వ్యవస్థని ఎదుర్కొని దానిని సమాధి చేద్దాం.

## పిల్లల గురించి అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రత్యేక సదస్సు :

కైలాస్‌ని పిల్లల గురించి అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఏర్పరిచిన ప్రత్యేక సదస్సులో ప్రసంగించమని ఆహ్వానించారు. మొదటి అయిదు నిముషాలలోనే తన ప్రసంగంతో శ్రోతల చేత కన్నీరు పెట్టించాడు. రాజులు, రాణులు, ధనికులు, అధికారంలో ఉన్నవారు మొదలైన వారి పిల్లలు యీ ప్రపంచంలో జీవించడానికి అర్హులు. పవిత్ర బోధనలలో కూడా పిల్లల ప్రస్తావన ఉంది. ఏసుక్రీస్తు మొదట తన వద్దకు పిల్లల్ని రమ్మని ఆహ్వానించాడు. పిల్లల్లో పవిత్రమైన ఆత్మ ఉందని వేదాలు చెప్పాయి. పిల్లల్లో భగవంతుని జ్యోతిని చూడమని



ఇస్లాం చెప్పింది. ఇక్కడున్న వారందరి పిల్లలు కూడా ప్రపంచంలో జీవించడానికి అర్హులు కానంతగా యీ ప్రపంచం ఉందని నేను అనుకోవడం లేదు. ఈ రోజు నేను చెప్పేదేమంటే యీ ప్రపంచం పశువులలాగ అమ్మకం, కొనుగోలు చేయబడి బానిసత్వంలో మగ్గుతూన్న వారు జీవించడానికి అర్హత కలదిగా లేదు. పేదరికంతో బాధపడుతూన్నవారు, ప్రాథమిక హక్కు అయిన విద్య లభించని వారు జీవించడానికి అర్హులు కారు. ఎదురుగా మరణించిన గులాబో వంటివారు జీవించడానికి అర్హులు కారు. ఆమె కుటుంబం అంతా ఒక ఇటుకల పరిశ్రమలో చాలా సంవత్సరాలు బానిసలుగా ఉన్నారు. గులాబో బానిసత్వం లోనే పుట్టి బానిస అయింది. అనేక చిత్రహింసలకు లోనయింది. సుప్రీంకోర్టు సహాయంతో ఆ కుటుంబానికి నేను విముక్తి కలిగించాను. ఆ సమయానికి గులాబో పరిస్థితి చాలా విషమంగా ఉంది. ఆమె నా చేతుల్లోనే చనిపోయింది. “అమ్మా! నాకు బ్రతకాలని ఉంది” అన్నవి ఆమె చివరి మాటలు. మార్చురీ నుండి ఆమె మృతదేహాన్ని తీసుకోవడానికి కాగితాల మీద సంతకం చేయవలసి వచ్చినప్పుడు ఆమె తండ్రి, “నేనే గనక చదువుకుని ఉంటే, నేను బానిసగా ఉండేవాడిని కాను. నా కుమార్తె మరణించి ఉండేది కాదు” అన్నాడు. ఎందుకంటే అతడు వ్రేలిముద్రను మాత్రమే వేయగలడు. ఇది ఒక కుటుంబం యొక్క చరిత్ర కాదు. 21వ శతాబ్దంలో కూడా యిటువంటి కుటుంబాలు యింకా ఉన్నాయి. వీరంతా యీ ప్రపంచంలో నివసించడానికి అర్హులు కారు. వారు పాపులయినందుకు కాదు. స్వార్థపరులైన అధికారులు యిటువంటి వారు జీవించే అర్హత కలిగించలేదు. విద్య, స్వాతంత్ర్యం యీ రెండూ ప్రతి ఒక్కరి జన్మహక్కు.

ఈ రెండూ హక్కుల్ని హరిస్తే నేరం అవుతుంది. కారణం ఏదైనా కానీయండి. విద్య, స్వేచ్ఛ లేకుండా పని చేయిస్తే అది మనకి సిగ్గుచేటు. అధికారులు శుష్క వాగ్దానాలు చేస్తారు. “వరుసగా శుష్క వాగ్దానాలు చేయడం బహుశా మన వారసత్వమేమో?” అంటాడు నెల్సన్ మండేలా. అనుకున్న చట్టాలు చేయబడి, ఆచరణలోకి వస్తే ఆరోజు చరిత్రాత్మకం అవుతుంది. ప్రభుత్వాలు ఆచరణ మొదలుపెట్టడానికి ఒక నిర్ణీత గడువును నిర్ణయించాలి. ముఖ్యంగా మొదటగా “అందరికీ నాణ్యమైన విద్య” అనేది ఆచరణలోకి రావాలి.

ఈ క్రింది అయిదు చర్యల్ని ఆచరణలో పెడితే, బాలలు జీవించడానికి అర్హత లభిస్తుంది. 1. అందరికీ ఉచిత నాణ్యమైన విద్య 2. పేదరిక నిర్మూలన 3. సమన్యాయం 4. సాంఘిక న్యాయం 5. ప్రపంచ రాబడి నుండి పేదలకు ఎక్కువ భాగం కేటాయించడం. పేద విద్యార్థులు, పేద ప్రజలు ఆధారపడి ఉన్న వనరుల్ని జాగ్రత్తగా కాపాడాలి. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచవ్యాపారం వల్ల పేదవారు తమ భూముల్ని మాత్రమే కాక,

జీవనోపాధిని కూడా కోల్పోతున్నారు. ముఖ్యంగా బాలలు నష్టపోతున్నారు. అంతర్జాతీయ మార్కెట్టు కోసం బాలలు కష్టపడుతున్నారు. విద్య గురించి చూస్తే జాతీయ ప్రణాళిక సిద్ధం కావాలి. ప్రపంచ విద్యా సదస్సులో చేసిన వాగ్దానాలు 2002కల్లా అమలు కావాలని మేము కోరాం. విద్య మీద ఎటువంటి పన్ను విధించకూడదు. జీతాలు, పుస్తకాలు మొదలైన వాటి ఖర్చు ప్రాథమిక విద్యలో ఉండకూడదు. సరియైన, నాణ్యమైన విద్య అందించాలి. పేద విద్యార్థులకు కూడా తగిన వసతులు, వనరులు, కల్పించి విద్య నందించాలి.

**సాంఘిక బాధ్యత :**

ప్రపంచంలో మూడు పద్ధతులు కనపడుతున్నాయి. మొదటిది మార్కెట్టు యొక్క ఆర్థిక పరిస్థితి, దాని ప్రభావం ఎక్కువగా ఉంది. చాలా దేశాలలో అదే ప్రభుత్వాన్ని నడిపిస్తూంది. రెండవది రాష్ట్రం ఎక్కువ అధికారాలు కలిగి ఉండడం. మూడవది పౌరసంఘాల పాత్ర. అయితే అంతర్జాతీయ కార్మిక వ్యవస్థ బాలకార్మిక వ్యవస్థకి, లింగ వివక్షతకి వ్యతిరేకంగానే ఉంది. అసంఘటిత వ్యవస్థలో చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదు. ముఖ్యంగా కాంట్రాక్టు (ఒప్పంద) కార్మికులకు, వారి క్రింద పని చేసే కార్మికులకు చట్టాలు సక్రమంగా అమలు చేయబడడం లేదు. అంతేకాక, బహుళ జాతీయ, కార్పొరేటు సంస్థలు చిన్న పరిశ్రమలకు తమ ఉత్పత్తుల్ని యివ్వడంలో బాధ్యతారహితంగా ఉండి కార్మిక చట్టాల్ని ఉల్లంఘిస్తున్నారు. ట్రేడ్ యూనియన్లు లేకపోవడం వల్ల కూడా వ్యాపారం యధేచ్ఛగా సాగిపోతూంది. దీనికి తోడు శిక్షణలేని వారు, సమర్థత లేనివారు పనిచేస్తున్నారు. తగినంతమంది సిబ్బంది కూడా సమకూరడం లేదు. ఇన్స్‌పెక్టర్లు అవినీతిపరులు కావడం యింకొక కారణం. దానివల్ల బాల కార్మికుల్ని పనిలోకి తీసుకుంటున్నారు. అంటే చట్టాన్ని ఉల్లంఘించడమే కదా? ఈ మధ్యనే ఐవరీ కోస్ట్‌లో కోకో ఉత్పత్తిలో బాల కార్మికుల్ని ఉపయోగించడం సంచలనాన్ని సృష్టించింది. ఇంకొక ఉదాహరణ ఏమంటే అమెరికాలో ఉన్న చమురు కంపెనీలు మయన్మార్‌లో పైపులైన్లు వేయడానికి బాల కార్మికుల్ని ఉపయోగించారు.

వినియోగదారులకు అపారమైన శక్తి ఉందని నేను గ్రహించాను. తయారీదారు లందరూ బాధ్యతగా చట్టాల్ని అతిక్రమించకుండా ఉండేటట్లు చేయగల సమర్థత వినియోగ దారులకు ఉంది. వినియోగదారులు తమ శక్తిని యిప్పుడిప్పుడే తెలుసుకుంటు న్నారు. అందువల్ల బాల కార్మికుల చేత తయారు చేయబడిన ఉత్పత్తులనే కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయం నా అనుభవం వల్ల తెలుసుకున్నాను. అటువంటి వస్తువుల్ని ధర ఎక్కువ పెట్టి కూడా కొనుగోలు చేస్తున్నారు. అంటే కార్మికుల భద్రత, ఆరోగ్యాలను గురించి

కూడా వారు పట్టించుకుంటున్నారన్నమాట. మానవహక్కుల్ని కాపాడుతున్నారని అర్థం. అనేక ఉద్యమాలు యీ దిశగా కూడా జరిగాయి. అందువల్ల వినియోగదారులకు పూర్తి అవగాహన కలిగింది. వీటిలో చాలా ఉద్యమాలలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. "రగ్‌మార్క్"ని ప్రవేశపెట్టినప్పుడు దక్షిణాసియాలోని పారిశ్రామికవేత్తలు వ్యతిరేకించారు. ఎందుకంటే వారి పరిశ్రమలలో మిలియన్‌కు పైగా బాల కార్మికులు పని చేస్తున్నారు.

తివాచీలన్నింటినీ మేము గుడ్డిగా బహిష్కరించలేదు. పెద్ద పరిశ్రమలలో బాలల్ని తీసివేసి పెద్దల్ని పనులలోకి తీసుకోడానికి అవకాశాలున్నాయి. పెద్దవారు చేసిన వాటిని మేము బహిష్కరించలేదు. పెద్దవారికి తగిన సౌకర్యాలు, జీతబత్తాలు కల్పించి వారిని పనిలోకి తీసుకోవచ్చు. తివాచీల తయారీలో చిన్న మార్పు మాత్రమే. బాలకార్మికుల్ని విడుదల చేసి, మేము వారికి పునరావాసాన్ని కూడా కల్పిస్తున్నాం. అక్కడ సాధారణ విద్యతో పాటు వృత్తివిద్యను కూడా నేర్పుతున్నాం. వారికి శిక్షణ యిస్తున్నాం. తరువాత జీవనపోరాటంలోకి పంపుతున్నాం.

రగ్‌మార్క్ వల్ల వ్యాపారం కూడా అభివృద్ధి చెందింది. ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా అనుసరింపబడుతుంది. ప్రపంచీకరణ వల్ల పూర్తి సమాచారం లభ్యమవుతుంది. వినియోగదారులు ఆ ఉత్పత్తి యొక్క బ్రాండుని బట్టి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారం సమృద్ధిగా సాగడానికి యిదే కీలకం. సియోల్‌కాట్‌లో ఆటవస్తువుల పరిశ్రమ ఉంది. ఇది దేశంలోనే చాలా పెద్దది. ఈ పరిశ్రమలో బాల కార్మికుల్ని ఉపయోగిస్తున్నారనే విషయం మీడియాకి తెలిసింది. దిగుమతులు చాలా తగ్గిపోయాయి. పరిశ్రమకు పెద్ద దెబ్బ తగిలింది. అప్పుడు ఆ పరిశ్రమ తన పద్ధతుల్ని మార్చుకుంది. బాలల్ని పరిశ్రమలో ఉపయోగించడం మానివేసింది. అంతర్జాతీయ కార్మిక వ్యవస్థ ఆ బాలలకు పునరావాసం కూడా కల్పించింది.

ఈ మధ్యనే జరిగిన సంఘటన ఒకటి గుర్తుకి వస్తుంది. చాకొలెట్ పరిశ్రమలో సాంఘిక బాధ్యతని గుర్తు చేయడం జరిగింది. కోకో పరిశ్రమలో ఐవరీకోస్ట్‌లో అతి పెద్ద పరిశ్రమ ఉంది. ఆ పరిశ్రమలో మిలియన్‌కి పైగా బాలకార్మికుల్ని ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆ చాకొలెట్ పరిశ్రమ బాలకార్మికుల్ని ఉపయోగించబోమని ప్రోటోకాల్ సంతకం చేసింది. పైగా వారి పునరావాసానికి కూడా ఏర్పాట్లు చేసింది.

దోపిడీ వ్యవస్థని అరికట్టడానికి "ట్రేడ్ వాచ్" అనే దానిని ప్రవేశపెట్టడం జరిగింది. ఇటువంటి ఉద్యమాల సంఘటిత శక్తి దోపిడీ విధానాన్ని నిర్మూలించగలుగుతుంది. దీని అంతిమ లక్ష్యం సాంఘిక న్యాయం.

## యునెస్కోలో కీలక ఉపన్యాసం :

2006వ సంవత్సరం జులై 19వ తేదీన కైలాస్ సత్యార్థి యునెస్కోలో కీలక ఉపన్యాసం చేశాడు.

మేము స్కూలులో చదవని 103 మిలియన్ల బాలలను గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్నాం. వారిలో 18 శాతం బాలలు ప్రాథమిక స్కూలుకి వెళ్ళేవారే. వారు సోమరులలా సరదాగా యింటి వద్దనే కాలం గడిపేవారు కాదు. ప్రపంచం మొత్తంలో చూస్తే 218 మిలియన్లమంది బాలలు కార్మికులుగా వివిధ పరిశ్రమలలో పని చేస్తున్నారు. వీరందరికీ విద్య లేదు. అందరికీ నాణ్యమైన విద్య ప్రపంచం యొక్క భవిష్యత్తుని తీర్చిదిద్దుతుంది. విద్య అనేది కొంతమందికి మాత్రమే పరిమితమయినది కాదు. అది విశ్వవ్యాప్తంగా భవిష్యత్తును తీర్చిదిద్దే పరికరం. గత 25 సంవత్సరాలుగా యీ ఉద్యమంలో పనిచేస్తూ నా స్వల్ప అనుభవంతో చెబుతున్నాను. విద్యను అందివ్వడం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అనేవి ఒకే నాణానికి రెండు వైపులు. రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది.




బాలకార్మిక వ్యవస్థ విద్యకు ఆటంకం. అంతమంది బాలలు కార్మికులుగా ఉంటే వారికి చదువుకునే అవకాశం ఎలా వస్తుంది? ఒకవేళ వారిని స్కూలులో చేర్పించినా ఎంతమంది ప్రాథమిక విద్యని పూర్తి చేయగలుగుతారు? ఒక బాల కార్మికుడు ఒక ప్రశ్న

వేశాడు. "నేను స్కూలులోను, కార్మికునిగానూ ఒకేసారి ఎలా ఉండగలను?"అని అడిగాడు. వెంటనే దీనిపై స్పందించకపోతే బాలకార్మికులు ఎప్పుడూ విద్యనభ్యసించడానికి అవకాశం కలగదు.

విద్య రెండు పాత్రల్ని పోషిస్తుంది. ఒకటి బాలలు కార్మికులుగా మారడాన్ని ఆపుతుంది. రెండు వారికి పునరావాసం కల్పిస్తుంది.

ఇటువంటి ఉద్యమాలు కొంత ఫలితాన్ని యివ్వకపోలేదు. బాల కార్మిక వ్యవస్థ రాను రాను తగ్గుముఖం పడుతూంది. ఇటీవల విద్యాశాఖమంత్రిగారు విద్యకి, బాలకార్మిక వ్యవస్థకి గల సంబంధాన్ని తమ ప్రసంగంలో తెలియజేశారు. ఒక ప్రపంచ వ్యాప్త టాస్క్‌ఫోర్సు ఏర్పాటు కావడం దీనికి నిదర్శన. ఇది నిరక్షరాస్యత, బాలకార్మికుల పరిస్థితి గురించి కృషి చేస్తుంది. జాతీయ, అంతర్జాతీయ ప్రభుత్వాలు యీ దిశగా చేస్తూన్న కృషికి సహాయం చేస్తుంది. దీని విధానాలు స్థానిక అవసరాలకు కూడా ఉపయోగపడు తుంది.

**ప్రపంచబ్యాంకు :**

2009లో జరిగిన ప్రపంచ బ్యాంకు సమావేశంలో మాట్లాడుతూ –

"ఆఫ్రికా దేశపు మంత్రుల్ని నేను అభినందిస్తున్నాను. వారు పేద దేశాల గురించి, పేద ప్రజల్ని గురించి వారి విద్యను గురించి అంశాన్ని ధైర్యంగా లేవనెత్తారు. ఇటువంటి



పరిస్థితి ఏర్పడడానికి పేదలు కారణం కారు. రాజకీయ నాయకులు నిబద్ధతతో, మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యం అవుతుంది. ఎపుడైతే విద్యకు సంబంధించిన నిధులు కోతకు గురి అవుతాయో, అప్పుడు అభివృద్ధి కూడా మందగిస్తుంది. విద్యకు నష్టం కలుగుతుంది. ఇది చాలా సిగ్గుపడవలసిన విషయం. ఎందుకంటే విద్య అనేది హక్కు మాత్రమే కాదు, ఒక చికిత్స కూడా. నాణ్యత గల విద్య వల్ల పేదరిక నిర్మూలన జరుగుతుంది. బాలబాలికలకు అన్ని విషయాలపైనా మంచి అవగాహన కలుగుతుంది. జీవితాల్నే మార్చగల సత్తా విద్యకు ఉంది. అంతర్జాతీయంగా కూడా యీ సమస్య నుండి ప్రక్కకు తప్పుకోవడానికి వీలు లేదు. వారు కూడా వారు చేసిన వాగ్దానాలను నెరవేర్చాలి. దీనివల్ల బాలబాలికలు తమలో ఉన్న అంతర్గత శక్తిని బహిర్గతం చేయగలుగుతారు. వాగ్దానాలు నెరవేర్చడమంటే తగిన నిధులు సమకూర్చడం అన్నమాట. తగిన చట్టాల్ని రూపొందించడం అన్నమాట. అంతర్జాతీయ ద్రవ్యనిధి తన షరతుల్ని సడలించింది. వారిని అదే విధంగా చివరవరకు ఆదర్శంగా నిలవమని మేము కోరుతున్నాం. కొంతమంది దాతలు కూడా యీ విషయంలో సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ప్రతి సంవత్సరం దీనికి 16 బిలియన్ల డాలర్లు ఖర్చు అవుతాయి. కాబట్టి మరికొంతమంది దాతల్ని ముందుకు రావలసిందిగా కోరుతున్నాం. అన్ని పేద దేశాలకు సరిపోయినంతగా కావాలనేదే మా లక్ష్యం. 2010 సంవత్సరానికల్లా విద్యకి ప్రథమ స్థానం రావాలి.

**ప్రజా ఉద్యమం రావాలి :**

2007లో తన అభిప్రాయాలను వివరిస్తూ కైలాస్ యిలా అన్నాడు.

కృష్ణ అనే వ్యక్తి ముర్షిదాబాద్‌లో బస్సు స్టాండు వద్ద దుకాణం నడుపుకుంటున్నాడు. అతడు నా వద్దకు వచ్చి ఒక చీటీని యిచ్చాడు. దానిలో, “బాలల్ని వెంట తీసుకుని వచ్చిన చాలా వినియోగదారులకు నేను సేవ చేశాను. కాని వారు ఆ బాలల్ని అమ్ముతారనిగాని, కార్మికులుగా చేస్తారని గాని నాకు తెలియదు. కాని యీ రోజు నుండి అటువంటి వారు కనబడితే పోలీసుల్ని పిలుస్తాను” అని ఉంది. కాబట్టి నా పాతిక సంవత్సరాల అనుభవంలో పెద్ద ప్రజా ఉద్యమం జరిగితేనే కాని దీనిని ఆపడం కష్టమని గ్రహించాను. కాబట్టి గొప్ప ప్రజా ఉద్యమం రావాలి. దానివల్ల చట్టాలు తయారవుతాయి. రాజకీయ నాయకులకు కనువిప్పు కలుగుతుంది. చట్టాలు ఆచరణలోకి వస్తాయి. ప్రజలందరు కలిసి బాలల్ని సేవకులుగా మార్చవద్దని ప్రతిఘటించాలి. లేకపోతే మన లక్ష్యం ఒక కలగానే మిగిలిపోతుంది.

మేము చేసిన అనేక ఉద్యమాల వల్ల, ర్యాలీలు వల్ల పాత విధానాలలో మార్పు రావడం గమనించాం. ఆచరణలో మార్పు వచ్చింది. అందరికీ యీ సమస్యల్ని గురించి అవగాహన కలిగింది. బాధితుల ఆర్తనాదాలు వమ్ము కాలేదు. విడుదల అయిన బాలకార్మికులలో కొందరు నాయకత్వం వహించి యీ సమస్యపై పోరాటం సాగించారు. నేను వాళ్లని అభినందిస్తున్నాను. అలాగే యిది వరకు చెప్పిన కృష్ణ అనే దుకాణదారుని కూడా అభినందిస్తున్నాను. ఒకసారి ఎక్కువ చలిగా ఉండడం వల్ల కార్యక్రమం రద్దు చేస్తున్నానని చెప్పగా మురికివాడనుండి అక్కడకు వచ్చిన బాలిక యిలా అంది "నా సోదర సోదరీమణులు చాలా మంది బానిసత్వంలో మగ్గుతూన్న వేడికంటే యీ చలిని భరించడం కష్టమా?"


మా బచ్‌పన్ బచావో ఆందోళన్‌లో ఒక కంప్యూటర్ ఔత్సాహికుడున్నాడు. మేము ప్రయాణం చేసిన దూరాన్ని కంప్యూటర్‌లోకి ఎక్కించాడు. అది 2,500 కి.మీ. చూపించింది. కాని మేము పర్యటించిన గ్రామీణ ప్రాంతాలలోని దూరాలు లెక్కకు రాలేదు. లెక్కించి చూడగా అది 5,200 కి.మీ. అయింది. కంప్యూటర్‌లో ఉన్న దూరంకంటె రెట్టింపు దూరం ప్రయాణం చేశాము. ఈ ఉద్యమానికి మద్దతుగా దాదాపు అన్ని సంఘాలు పాల్గొన్నాయి. దీర్ఘకాల సమరానికి యిది నాంది అని భావించాము. ఈ ర్యాలీలో ఐక్యకంఠంతో "వద్దు" అని నినాదాలు చేశారు. కొంతసేపు విశ్రాంతి తీసుకోమని నేను వారిని కోరాను. కాని వారు 'ససేమిరా' అన్నారు. అటువంటి దృఢ సంకల్పం నేనెప్పుడూ చూడలేదు.

## ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించినందుకు అవార్డు :

2009వ సంవత్సరం అక్టోబరు 20వ తేదీన యిచ్చిన అవార్డు సందర్భంగా కైలాస్ యిలా అన్నాడు.

"ప్రపంచ ర్యాలీని జరిపిన సందర్భంగా పార్లమెంటేరియన్లు నాకు ప్రజాస్వామ్య పరిరక్షక అవార్డు యిచ్చారని సమాచారం అందింది. నా పేరు ప్రజాస్వామ్య రక్షకుల జాబితాలో చేర్చడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ సమాచారం నాకు రాళ్లు కొట్టే పనిలో ఉన్న బాల కార్మికుడు 11 సంవత్సరాల అమర్‌లాల్ అందించాడు. ప్రస్తుతం అతడు మా పునరావాస కేంద్రంలో విద్య నభ్యసిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం బాలలు జాతీయ వార్షిక పార్లమెంటు నిర్వహించబడింది. ప్రతి గ్రామం నుండి ఎన్నుకోబడిన ప్రతినిధి హాజరయ్యాడు. అమర్‌లాల్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డాడు. ఇప్పుడు నాకు మీరిచ్చిన అవార్డు అందరి బాలలకు యిచ్చినదిగా భావిస్తాను. ప్రజాస్వామ్యం,

శాంతి, స్థిరత్వం మొదలైనవి నాణ్యమైన ఉచిత విద్యని అందించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అది బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అయితేనే సిద్ధిస్తుంది. ఇప్పుడు నాకు మీరు యిచ్చిన పురస్కారం 9 సంవత్సరాలు వయస్సున్న మహమ్మద్‌కి చెందుతుంది. నేను మహమ్మద్‌ని 95 బాలలతో పాటు విడిపించాను. అతనికి స్వేచ్ఛ లభించింది కాబట్టి వారు స్కూలుకి వెళ్ళవచ్చునని చెప్పాను. అప్పుడు మహమ్మద్, "నేను ఎంబ్రాయిడరీ పనిలో ఆరితేరాను. నేను పెద్దవాడినయ్యాను కదా? స్కూలుకి ఎలా వెళ్తాను" అన్నాడు. తరువాత నేను అతనిని తల్లి వద్దకు చేర్చాను. తల్లి మహమ్మద్‌ని కౌగిలించుకుని ఏడ్చింది. తన కుమారుడు యింటికి రానందుకు ఏడ్చానని, అల్లా మీద నమ్మకం పోయిందనీ, తన కుమారుడు తిరిగి తనను చేరినందువల్ల జీవితం మీద, అల్లా మీద నమ్మకం పెరిగిందనీ చెప్పింది. అప్పుడు మహమ్మద్ చిరునవ్వుతో తాను స్కూలుకి వెళ్తానని చెప్పాడు. ఒక్క మహమ్మద్‌కే కాక, నేను విడిపించిన వేలాది బాలలకు కూడా చెందుతుంది.



ఇంతటి కార్యక్రమాన్ని చేపట్టడానికి వెనుక నా సోదరుడు సెనేటర్ టామ్ హార్కిన్ ఉన్నాడు. నా కష్టసుఖాలలో, ప్రమాదాలలో, అన్ని ఉద్యమాలలో అతడు నాకు వెన్నుదన్నుగా నిలిచాడు. ఆయనతో పాటు తెర వెనుక రోజ్‌మేరీ ఉంది. వారిద్దర్నీ మీ కరతాళధ్వనుల ద్వారా అభినందనలు తెలియజేయండి. అంతేకాక, యీ హాలులో కూర్చుని ఉన్న యిద్దరు ధైర్యవంతులైన మహిళల్ని అభినందించాలి. వారు ఒకరు నా భార్య సుమేధ, నా కుమార్తె అస్మిత. ఈ రోజు నేను బాలల దోపిడీకి విరుద్ధంగా పనిచేస్తానని, అది సాధించే వరకు ఉద్యమిస్తూ ఉంటాననీ యింకొకసారి ప్రమాణం చేస్తున్నాను. బాలల గురించి మాత్రమే

కాకుండా హింస కూడా అనేక రూపాలలో విజృంభిస్తుంది. బాలలు హింసకు, దోపిడికీ గురి అవుతున్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితి చూస్తే యీ సమస్య యింకా తీవ్రస్థాయికి వెళ్తుందనిపిస్తూంది. ఈ సమస్యలు ఎంతటి తీవ్రతరమైన పరిష్కారమార్గాలు లేకపోలేదు. వాటిని మనం అధిగమించవచ్చు, సాధించవచ్చు.

ఉద్యమాల వల్ల ఫలితాలు కనపడుతూనే ఉన్నాయి. 246 మిలియన్ల బాల కార్మికుల సంఖ్య 218 మిలియన్లకు తగ్గింది. 40 మిలియన్ల బాలలకు విద్య లభించింది. విద్య వల్ల న్యాయం, సమానత్వం లభిస్తాయి. ప్రజాస్వామ్యానికి, పారదర్శకతకి విద్యయే మూలం, కీలకం. కావలసిందల్లా రాజకీయ నాయకులు నిజాయితీగా వ్యవహరించడం. ప్రపంచ వ్యాప్తంగా క్రియాశీలత కావాలి. ఏ వ్యవస్థ అయినా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించ బడకుండా ఎక్కువ కాలం నిలవలేదు.

ప్రస్తుతం అత్యవసరంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలు జరగాలని నేను భావిస్తున్నాను. పాటించే విధానాలు, ఆచరణలు సమతౌల్యంగా ఉండాలి. ఆర్థికంగా ప్రపంచీకరణ జరగడానికి నేను మూడు విషయాలు గమనించాలని కోరుతున్నాను. మొదటిది నాణ్యత గల ఉచిత, నిర్బంధ విద్య ప్రపంచవ్యాప్తంగా బాలలందరికీ అందాలి. రెండవది సాంఘిక, పర్యావరణ బాధ్యత ప్రపంచవ్యాప్తంగా జరగాలి. మూడవది అందరికీ ప్రపంచవ్యాప్తంగా సమస్యల మీద పూర్తి అవగాహన ఉండాలి. బాలల అభివృద్ధి జరగకపోతే మనకి మంచి భవిష్యత్తు ఉండదు. వారికి మనం అన్యాయం చేస్తే చరిత్ర మనల్ని క్షమించదు. మనకి ప్రభుత్వాలు కావాలి, అంతర్గత ప్రభుత్వాలు కూడా ఉండాలి. బాలల హక్కుల్ని కాపాడాలి.

**కలలు నిజమైన శుభదినం :**

2010వ సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీన చేసినప్రసంగంలో కైలాస్‌యిలాఅన్నాడు.

బాలలందరూ స్కూళ్ళకి వెళ్ళి, విద్య నేర్చుకుని, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దబడాల నేదే నా కల. ఆ కల కొంచెంగా తీరితే నాకు సంతృప్తి కలగదు. అయినా ఈ రోజు నాకు చాలా ముఖ్యమైన రోజు. ఈ రోజు నా దేశంలో వేలాదిబాలలు ఉచిత విద్య నేర్చుకునే హక్కుని సంపాదించుకున్నారు. ఏదో ధర్మార్థం విద్య యిస్తున్నామని కాదు. ఈ రోజు అది చట్టబద్ధమై, రాజ్యాంగ హక్కుగా మారింది.

నేను పాఠశాలలో చదువుకునే రోజుల్లో ఒక చెప్పులు కుట్టుకునే వ్యక్తి కుమారుడే నా జీవితాన్ని మలుపు తిప్పాడనే విషయం నాకు ఎప్పుడూ గుర్తుంటుంది. నేను 1980లో బాలకార్మిక వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాటం మొదలు పెట్టినపుడు నా ఆశయం బాలలను

బానిసత్వం నుండి విముక్తి చేయడం, వారికి ఉచిత విద్యనందించడం. అప్పుడు నా పోరాటాలలో చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారు. ఇప్పుడు ప్రపంచబ్యాంకుతో సహా అన్ని సంఘాలు సంఘటితమయ్యాయి. నాకు చాలా సంతోషంగా ఉంది. వారందరికీ నా కృతజ్ఞతలు. ఈ రోజు నాతో చేతులు కలిపి పని చేసినవారందరికీ నా కృతజ్ఞతలు.

2001లో శిక్షాయాత్ర ప్రారంభించాను. ఆ సంఘటన నా జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేనిది. నేను భారతదేశం అంతటా పర్యటించాను. చాలామంది బాలల్ని, వారి తల్లిదండ్రుల్ని కలిశాను. వారు ఏ దేశానికి చెందినవారో కూడా వారికి తెలియదు. ఒకసారి నేను ప్రసంగిస్తూ ఉండగా ఒక తల్లి చాలా శ్రద్ధగా వింటూ ఉండడం గమనించాను. ప్రసంగం పూర్తి అయిన తరువాత ఆమె నా వద్దకు వచ్చి,"మా అమ్మాయి కూడా స్కూలులో చదవడానికి అవకాశం ఉందా? ఆమె ఉపాధ్యాయిని కాగలదా?" అని ప్రశ్నించింది. ఆమె ఎక్కడుందో తెలిస్తే వెళ్లి అది సాధ్యమే అని యిప్పుడు చెప్పగలను. ఇంకొక 10 సంవత్సరాల బాలుడు నా వద్దకు వచ్చి, తాను రెండు రోజులు సంపాదించిన దానిని నాకు యిచ్చి, "నాకున్నదంతా యిదే. దీనిని నాలాంటి బాల కార్మికులు స్కూలుకి వెళ్ళడానికి చేసే ప్రయత్నంలో ఉపయోగించండి" అన్నాడు. ఇటువంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. మేము యీ యాత్రలో చాలా కష్టాలు ఎదుర్కున్నాము. ఎండనక, వాననక, చలి అనక యాత్ర చేశాము. స్కూళ్లలో బస చేశాము, దేవాలయాలలో తలదాచు కున్నాం. రాత్రిళ్లు పూరి గుడిసెలలో కూడా ఉన్నాం. మా ప్రతి కదలిక మాలో ఉత్సాహాన్ని నింపింది. అందరూ విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించారు. అది వారి హక్కుగా భావించారు.

90లలో పార్లమెంటరీ ఫోరంను ఏర్పాటు చేశాం. దానిలో ఉభయసభల పార్లమెంటు సభ్యులున్నారు. మా అందరికీ నాయకుడు శ్రీ రవిప్రకాష్, పార్లమెంటు సమావేశాలలో వారు యీ సమస్యల్ని లేవనెత్తేవారు. దీనివల్ల మా ఉద్యమం యింకా బలపడింది. విద్య ఒక హక్కుగా భావించబడింది. మేము బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు నిరక్షరాస్యత, పేదరికాన్ని కూడా చేర్చాము. వీటిని యిప్పుడు అంగీకరించారు. దీనివల్ల మిగిలిన మానవహక్కుల్ని సాధించుకోడానికి బాట పడింది. 2000వ సంవత్సరం మరపురానిది. పార్లమెంటు సభ్యులు యీ సమస్యని పార్లమెంటులో లేవనెత్తారు. విద్య గురించి చర్చ జరగాలని పట్టుపట్టారు. భారతదేశ చరిత్రలో ప్రథమంగా జరిగింది యీ సంఘటనే. అప్పటి ప్రధానమంత్రులు వి.పి.సింగ్, గుజ్రాల్, వాజపేయి, మన్మోహన్‌సింగ్, రాష్ట్రపతులు ఆర్.కె.నారాయణన్, అబ్దుల్ కలాం మొదలైన వారితో సమావేశాలు జరిపాము. హామీలు అమలు చేయవలసిందిగా కోరాము. గత దశాబ్దకాలంలో విద్య గురించి ఎవరూ

పట్టించుకోలేదు. కొన్ని రోజులపాటు, కొన్ని గంటలపాటు అధికారుల్ని అంగీకరింప జేయడానికి ప్రయత్నించేవాళ్లం. విద్య యొక్క ప్రాధాన్యతని తెలియజేస్తూ వచ్చాం. శాసనసభలకి నిలబడే అభ్యర్థుల్ని కూడా మేము కలిసి వారు గెలిస్తే యీ సమస్యల్ని పరిష్కరిస్తామనే ప్రతిజ్ఞలు చేయించాం. మొదట్లో వారు కూడా పట్టించుకోలేదు. కాని విద్య లేకపోతే వారికి వోట్లు సంపాదించలేమని అర్థమయింది. అప్పుడు మా ఉద్యమాల లక్ష్యం వారు అర్థం చేసుకున్నారు. ఆ విధంగా చాలా నియోజకవర్గాల వారిని ఆకర్షించ గలిగాం. చివరకు రాజ్యాంగాన్ని సవరించి విద్యని ప్రాథమిక హక్కుగా చేశారు. అయినా ప్రస్తుతం ఉన్న చట్టాలు చాలవు. కాబట్టి యీ ఉద్యమాలు యింకా కొనసాగుతూనే ఉంటాయి. విజయాలు సాధించాం కాని యుద్ధం ముగియలేదు.

విశేషమేమంటే యీ సమస్యని అవగాహన చేసుకుని చాలా సంస్థలు మాతో చేతులు కలిపాయి. వారు యిచ్చిన సహకారాన్ని మరిచిపోలేము. అఖిల భారతస్థాయిలో సంఘాలు ఏర్పడి సంఘటితంగా సంవత్సరాల తరబడి మాతో కలిసి పని చేస్తున్నాయి. ఇదే విధంగా మేము భవిష్యత్తులో కూడా పని చేస్తామనే నమ్మకం నాకుంది. మొదటగా స్కూలులో చేరని బాలల గణాంకాల్ని సరి చేయాలి. అవి సక్రమంగా లేవు. ప్రభుత్వం నిజాయితీగా గణాంకాలు తయారు చేసి ఎంతమంది స్కూలుకు వెళ్తున్నారో నిర్ధారణ చేయాలి. రెండవది ప్రస్తుత విద్యా విధానంలో వ్యాపార ధోరణిని అరికట్టాలి. 11వ పంచవర్ష ప్రణాళిక సక్రమంగా లేదు. అది ప్రైవేటీకరణని ప్రోత్సహించేటట్లు కనపడుతూంది. దీనిని చట్టపరంగా సవరించవలసిన అవసరం ఉంది. రాజ్యాంగ హక్కుని నిర్ణయించేది న్యాయ వ్యవస్థ. కాని దీనిని స్త్రీ, శిశు సంక్షేమం మంత్రికి యివ్వబడింది. స్థానిక పరిపాలనా సంస్థలు (పంచాయితీ రాజ్) యిటువంటి చట్టాలు అమలు జరిగేటట్లు చూసే బాధ్యత తీసుకోవాలి. బాలకార్మికుల్ని, వికలాంగ బాలల్ని, దళితుల్ని కూడా దానిలో చేర్చడానికి ప్రత్యేకంగా కృషి చేయాలి. తగినంత నిధులు సమకూర్చాలి. విద్యా ప్రణాళికల అమలులో పౌర సంస్థలు కూడా భాగస్వామ్యులు కావాలి. వారంతా అంకితభావంతో పని చేయాలి. కాబట్టి అందరి సహకారం చాలా తప్పనిసరం. పైగా అత్యంత విలువైనది. ఇన్ని హెచ్చరికలు కావలసి ఉన్నా మన కలలు సాకారమయ్యే రోజు యిదే కాబట్టి దీనిని ఘనంగా జరుపుకుందాం.

**ప్రపంచ కార్మిక వ్యతిరేకదినం :**

ప్రపంచ కార్మిక వ్యతిరేక దినం జూన్ 12వ తేదీ 2011వ సంవత్సరం. ఆ రోజు కైలాస్ యిలా ప్రసంగించాడు.

ఈ రోజు మనం ప్రపంచ కార్మిక వ్యతిరేక దినాన్ని జరుపుకుంటున్నా, యింకా 20 కోట్ల బాలలు బానిసత్వంలోనే గడుపుతున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతూ ఉంది. ఈ వ్యవస్థ లేని దేశం లేదనే చెప్పాలి. చాలామంది వ్యవసాయరంగంలో పని చేస్తున్నారు. కొందరు యితర రంగాలలో పని చేస్తున్నారు. కొంతమంది బిచ్చగాళ్ళుగా మారారు. మరికొంతమంది బాల సైనికులయ్యారు. ఇది మానవహక్కుల్ని ఉల్లంఘించడం కాదా? ఇంతవరకు చేసిన చట్టాలకు యిది అవమానం కాదా? విద్యకి, అభివృద్ధికి యిది చాలా పెద్ద ఆటంకం. ఇంకా యిటువంటివి జరుగుతున్నాయంటే రాజకీయ నాయకులకు నిబద్ధత లేకపోవడంగానే పరిగణించాలి. సంఘపరంగా కూడా యింకా అవగాహన పెరగాలి. బాల కార్మిక వ్యవస్థ కొనసాగితే మన నాగరికతకీ, సంస్కృతికీ, మతానికీ మాయని మచ్చగా మిగిలిపోతుంది.

కాబట్టి మనం నిర్మూలించవలసినవి పేదరికం, నిరక్షరాస్యత, అవగాహనారాహిత్యం అమాయకత్వం, పిల్లల యెడల స్నేహతత్వం లేకపోవడం మొదలైనవి. ఇవేకాక, లింగవివక్ష, సాంఘిక, సాంస్కృతిక విచక్షణ, చట్టం యొక్క రక్షణ లేకపోవడం, అభివృద్ధిపనుల యెడల నిర్లక్ష్యం మొదలైనవి కూడా ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే విద్యకు తగిన వనరులు కల్పించకపోవడం, వరదలు, భూకంపాలు, కరవు కాటకాలు మొదలైన వాటికి సరియైన పరిష్కార మార్గాలు కనుక్కోకపోవడం, చెట్లను నరకడాన్ని అరికట్టకలేక పోవడం మొదలైనవి కూడా యీ జాబితాలో చేరుతాయి. పేరాశ గల ఉద్యోగుల వల్లా, తక్కువ జీతాలతో పిల్లల్ని కూడా పనిలోకి ప్రవేశపెట్టడం వల్లా, అధికార దుర్వినియోగం వల్లా, యిటువంటి దురాగతాలు పెరుగుతున్నాయి.

ప్రభుత్వం తప్పనిసరిగా వీటిని అరికట్టవలసిన బాధ్యతను తీసుకోవాలి. అది వారి నైతిక కార్యాచరణ. పైగా అంతర్జాతీయంగా తీసుకున్న నిర్ణయాల్ని అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి. 14 సంవత్సరాలకు తక్కువ వయస్సున్న బాలల్ని పనులలో ఉపయోగించకూడదనే నియమం ఉంది. కాబట్టి రాష్ట్రప్రభుత్వాలు ఆ దిశగా వాటిని అమలు జరపాలి. అంతర్జాతీయంగా 2015వ సంవత్సరానికల్లా అందరికీ నాణ్యమైన విద్య, అభివృద్ధి జరగడం పూర్తి కావాలి. అంటే 2015వ సంవత్సరానికి బాలలందరూ స్కూళ్లకు వెళ్లి తీరాలన్నమాట. ఇంతకంటె అత్యవసరమైన విషయం ఏముంటుంది? స్కూళ్లకు వెళ్లనివారు, మధ్యలో ఆగిపోయినవారు చాలామంది ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించబడకపోతే అభివృద్ధి ఉండదు. దేశానికి భవిష్యత్తు ఉండదు అని అన్ని సంస్థలు గుర్తించాయి. విద్య అందిస్తే యీ వ్యవస్థ నిర్మూలించబడు

తుంది. కాబట్టి ప్రభుత్వాలు బాలల్ని బానిసత్వం అనే ఊబిలో నుండి బయట పడవేయాలి. నాణ్యత గల ఉచిత నిర్బంధ విద్య గురించిన చట్టాన్ని నిబద్ధతతో అమలు చేయాలి. దానికి తగిన ఆర్థిక వనరులు కూడా కల్పించాలి. అంతేకాక బాలలు తయారు చేసిన ఉత్పత్తుల్ని కొనుగోలు చేసే వినియోగదారులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలి. బాలల ఉత్పత్తుల్ని వారు కొనుగోలు చేయకూడదు. అది వారి నైతిక బాధ్యతగా గుర్తించాలి.

ఈ ఉద్యమాలు కొన్ని విజయాలు సాధించబడ్డాయి. మధ్యాహ్న భోజన సదుపాయం, సర్వశిక్షాఅభియాన్ మొదలైన కార్యక్రమాలు బాలల్ని స్కూళ్ళ వైపు ఆకర్షించాయి. వారు చదువును కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా బాలికల విద్య మెరుగుపడింది. వృత్తివిద్యా విధానం కూడా అమలులోకి వచ్చింది. పేద పిల్లలు నెలలో రెండు క్లాసులకు హాజరు కాకపోయినా ఫరవాలేదు. నగదు బదిలీ కార్యక్రమం కూడా కొంతవరకు సహాయపడింది. మధ్యలో స్కూలు మానివేసిన పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గింది. స్కూలు జీతాలు లేకుండా చేయడం వల్లా, నాణ్యమైన విద్య అందించడం ద్వారా స్కూలుకి వెళ్ళే బాలల సంఖ్య పెరిగింది. ప్రపంచ ర్యాలీ ఫలితంగా చాలా పరిశ్రమలలో బాలలను పనిలో ప్రవేశపెట్టడం చాలా వరకు తగ్గింది. కాబట్టి బాల కార్మిక వ్యవస్థ సమూలంగా నిర్మూలించ డానికి చాలా అవకాశాలున్నాయి. కావలసిందల్లా ప్రయత్నం, చక్కని సృజనాత్మక కార్యక్రమాలు.

# 11. పోరాటం కొనసాగుతూనే ఉంటుంది

అయితే కైలాస్ సత్యార్థి చేస్తూన్న పోరాటం పూర్తి అయినట్లేనా? లేదా యింకా జనం అతని కొత్త ఉద్యమాల కోసం ఎదురు చూస్తారా?

కైలాస్‌కి భగవంతుని మీద నమ్మకం ఉంది. కాని మతపిచ్చి లేదు. అతడు యీ విధంగా చెబుతాడు.

నేను బాలల్ని విడిపించడంలో చాలా కష్టాల్ని, అవమానాల్ని ఎదురుకున్నాను. నన్ను జనం బాధించినప్పుడేడు మా అమ్మ చాలా బాధపడేది. ఈ కారణం కోసం నేను ఇంజనీరింగుని వదులుకున్నప్పుడు బాధపడింది. తరువాత నేను చేసే పోరాటాన్ని గుర్తించి నన్ను ప్రోత్సహించింది. నాతో కలిసి పనిచేస్తూన్న వారందరూ నాకు ఎప్పుడూ గుర్తుంటారు. ఈ పోరాటంలో నా సహచరులిద్దరు చనిపోయారు కూడా. ఇంకొకర్ని చితకబాదారు. నా శరీరం నిండా గాయాలు అయ్యాయి. మేము సంఘంలో ఉన్న చెడు మీద పోరాటం

చేస్తున్నాం. ఈ పోరాటం వల్ల సంఘంలో స్పందన లేకపోతే యింకా పోరాటం చేయాలి. బాలలకు విముక్తి కలిగించి, వారిని  తల్లిదండ్రులు వద్దకు చేర్చినప్పుడు తల్లిదండ్రులు కార్చిన కన్నీరే నాకు దీవెనలుగా భావిస్తున్నాను. బాలల కళ్ళల్లో మెరుపులు చూస్తే అది నాకు భగవంతుడిచ్చిన శక్తిగా ఉంటుంది. వారికి నేను స్వేచ్ఛ యిచ్చినట్లు అనిపించదు. నాకే స్వేచ్ఛ వచ్చినట్లుంటుంది. జనం కూడా బాల కార్మికులను గురించి పోరాటం చేయవచ్చు. పరిశ్రమ యజమానుల్ని వారు బాలల్ని పనులకు ఉపయోగించడం లేదు కదా అని ప్రశ్నించవచ్చును. నేను బాలల స్నేహితుడిని. నాకు గుర్తింపు అదే. పిల్లల్ని ప్రేమతో చూడాలి. వారు చాలా అమాయకులనుకుంటే పొరపాటే. వారు కూడా మనతో సమానులే. వారి నుండి కూడా మనం నేర్చుకోవలసి ఉంటుంది.

బాలల స్నేహితులే నాకు కూడా స్నేహితులు. నాకు యిచ్చిన యీ నోబెల్ బహుమతి బాలలందరికీ, బాల కార్మిక వ్యవస్థని వ్యతిరేకించిన వారందరికీ ఒక గుర్తింపుని తెచ్చింది. అంటే యిక్కడితో యీ ఉద్యమాలు ఆగినట్లు కాదు. నేను మలాలాతో కూడా మాట్లాడాను. ఆమె కూడా నాతో కలసి పని చేయడానికి అంగీకరించింది. బాలల్ని కూడా ఉద్యమాలు చేసేటట్లు చూడాలి. "బాలలకు శాంతి, శాంతి కోసమే బాలలు" అనే ఉద్యమాన్ని ప్రపంచ వ్యాప్తంగా చేపట్టాలి. నాకు వచ్చిన బహుమతి మొత్తం ప్రతిపైసా యీ ఉద్యమాలకే చెందుతుంది.

అయితే జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గణించిన సత్యార్థి ఎక్కడ నుండి పోరాటం జరపడం మొదలుపెడతాడు. బాలలకు శాంతి కల్పించగలడా? మాఫియాలు, టెర్రరిస్టులు, ప్రభుత్వాలు అతనిని విజయం సాధించనిస్తారా?


సత్యార్థి యొక్క రాబోయే కథల్ని వినడానికి సిద్ధంగా ఉండండి.

**చివరిమాట :**

కైలాస్ సత్యార్థికి, మలాలాకి నోబెల్ శాంతి బహుమతి ఇచ్చారు. ఆ వేడుకలో ఆహూతులందరూ చాలా గొప్పవారు. నోబెల్ పతకాన్ని రూపకల్పన చేసిన వ్యక్తి గస్టవ్ విగిల్యాండ్. ఇది 23వ క్యారట్ బంగారంతో చేయబడింది. దీని బరువు 192 గ్రాములు. 1980 నుండి ఇది 18 క్యారట్లు అయింది. బరువు 196 గ్రాములు. వ్యాసార్థం 6.6 సెం.మీ.గానే ఉండిపోయింది. ముందు భాగంలో ఆల్ఫ్రెడ్ నోబెల్ చిత్రం ఉంటుంది. వెనుక భాగంలో ముగ్గురు దిగంబరులు కౌగలించుకుని ఉండే చిత్రం ఉంది. దాని మీద లాటిన్ భాషలో ఏ బహుమతో రాసి ఉంది. ఈ నోబెల్ శాంతి బహుమతికి చాలామంది పేర్లు సూచింపబడ్డాయి. కాని వారెవరికీ దక్కలేదు. ఈ బహుమతి నార్వే రాజు చేతుల

మీదుగా యివ్వబడుతుంది. ఈ బహుమతి 1901 నుండి యివ్వబడుతుంది. 19 పర్యాయాలు యుద్ధాల వల్లగాని, ఎవరూ సూచించబడక పోవడం వల్ల గాని బహుమతి యివ్వలేదు. 64 శాంతి బహుమతులు ఒక్కొక్కరికీ యివ్వబడ్డాయి. 29 యిద్దరికి చొప్పున యివ్వబడ్డాయి. రెండు బహుమతుల్ని ముగ్గురు పంచుకున్నారు.

నోబెల్ బహుమతి యిచ్చిన తరువాత కైలాస్ ప్రసంగం చేశాడు. హిందీలో వేదాలలోని శ్లోకాన్ని పఠించి, తరువాత ఇంగ్లీషులో ప్రసంగించాడు. మలాలాను తన కుమార్తెగా చిత్రీకరించాడు.



మొదట నేను మానవులకు స్వేచ్ఛ కలగాలనే శ్లోకాన్ని వేదాల నుండి తీసుకుని పఠించాను. విశ్వశాంతికి, అభివృద్ధికి అందరూ పాటు పడాలి. ఒక్కరు కూడా తప్పించుకోకూడదు. అందరూ సంఘటితంగా పని చేయాలి. మన ప్రాచీనుల అనుభవాల నుండి నేర్చుకోవాలి. ఎప్పుడైతే నేను ఒక బాలునికి స్వేచ్ఛనిచ్చానో నాకు స్వేచ్ఛ లభించినట్లు భావించాను. నాకు ముందు బాలల స్వేచ్ఛ కోసం పోరాటం చేసిన వారికి మనం ఋణపడి ఉన్నాం. బుద్ధుని దేశం నుండి నార్వే వరకు నేను చేసిన ప్రయాణం విశ్వశాంతికి, అభివృద్ధికీ దోహదం చేస్తాయని భావిస్తున్నాను. ఇక్కడికి నేను వచ్చిన కారణం బానిసత్వంలో మగ్గుతూన్న బాలల ఆర్తనాదాలు వినడానికీ, వారికి విముక్తి కలిగించడానికీ, ఒక బాలుడు నన్నడిగాడు, “మన దేశం నా చేతిలో పనిముట్లు, తుపాకీలకు బదులు ఆట వస్తువులు, పుస్తకాలు పెట్టలేనంత బీద దేశమా?” అని. ఒక బాలుడు సైనికుడిగా మారి తన స్నేహితుని, అతని కుటుంబాన్ని చంపాడు. “ఇది నా తప్పా?” అని అతడు నన్నడిగాడు. ఒక అత్యాచారం బాధితురాలు, “నాకు ఏ కలా రాలేదు. కనీసం నా కుమారుడైనా కల

కనగలడా?" అని అడిగింది. బాలలు కలలు కనడానికి ఆటంకం కలిగించడం కంటె ఘోరమైన హింస ఏముంటుంది?

మతాలన్నీ బాలల్ని సంరక్షించాలంటున్నాయి. ఏసుక్రీస్తు బాలల్నిముందుగా తన వద్దకు రమ్మన్నాడు. ఖురాన్‌లో, "పేదరికం వల్ల పిల్లల్ని చంపవద్దు" అని రాసి ఉంది. దేవాలయాలు, చర్చిలు, మసీదులు, బాలల సంరక్షణా కేంద్రాలు కావంటే నేను నమ్మను. ప్రపంచవ్యాప్తంగా వారం రోజుల మిలిటరీ ఖర్చు విద్యకు సరిపోదంటే నేను అంగీకరించను. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించబడదంటే నేను అంగీకరించను. నేను చాలామందితో, సమాన భావాలు కలవారితో కలిసి పనిచేశాను. రెండు దశాబ్దాలలో మార్పుని తేగలిగాం. శిశుమరణాలు, పౌష్టికాహారలోపం తగ్గాయి. మూడవవంతు బాలకార్మికులు విముక్తుల య్యారు. అయినా, యింకా ఎదురుకోవలసిన సవాళ్లు చాలా ఉన్నాయి. మనం బాలలకి జీవిత లక్ష్యం అంటే ఏమిటో తెలియజేసే విద్య యివ్వలేకపోయాం. మనం యిప్పుడైనా మేలుకోకపోతే హింస పెరుగుతుంది. మానవజాతికి ఆత్మహత్యా సదృశం అవుతుంది.

తన ప్రసంగంలో – "మలాలాని నేను అభినందిస్తున్నాను. ఆమెకు భయమన్నదే లేదు. సమస్యలకు పరిష్కారాలు ప్రసంగాలతో చేకూరవు, సమావేశాలతో లభించవు. 18 సంవత్సరాల క్రితం 80 వేల కిలోమీటర్ల ర్యాలీ వలన బాల కార్మిక వ్యవస్థపై వ్యతిరేకత కలిగింది. ఆ పని మేము చేయగలిగాం, కాబట్టి ప్రపంచాన్ని మార్చడానికి ఏం చేయాలి? నాకు కలిగిన భావాన్ని తెలియజేయడానికి ఒక చిన్న కథ చెబుతాను. ఒక అడవిలో కార్చిచ్చు చెలరేగింది. జంతువులూ, చివరకు మృగరాజైన సింహం కూడా పారిపోయాయి. ఇంతలో ఒక చిన్న పక్షి మంటల్లోకి దూసుకుని వెళ్లడం సింహం చూసింది. "ఏం చేస్తున్నావు?" అని ఆ పక్షి అడిగింది. "నేను మంటని ఆర్పడానికి ప్రయత్నిస్తున్నాను" అంది. సింహం నవ్వి, "నీ ముక్కుతో నీటిబొట్టుని పట్టుకుని అంత పెద్ద మంటపి ఆర్పుతానంటే ఎవరైనా నవ్వుతారు" అంది. "నాకు తోచిన సహాయం నేను చేస్తున్నాను" అంది పక్షి. కాబట్టి ప్రతి ఒక్కరూ తన వంతుసాయం చేస్తే తప్పక మార్పుని తేగలుగుతాం. మనం యిప్పుడు ప్రపంచీకరణ స్థాయిలో ఉన్నాం. ఇంటర్నెట్ సౌకర్యం ఉంది. ప్రపంచ విపణిలో వస్తు మార్పిడి చేసుకుంటున్నాం. విమానాలలో అతివేగంగా ప్రయాణాలు చేస్తున్నాం. కాబట్టి ఎక్కడివారినైనా మార్చడానికి అవకాశాలున్నాయి. గాంధీగారు, "నిజమైన శాంతిని బోధించాలంటే బాలలతో మొదలుపెట్టాలి" అన్నారు. పిల్లల మీద దయ చూపించడం ద్వారా ప్రజలనందర్నీ ఒకే తాటి మీద నడిపించగలం. ఫుట్‌బాల్‌ని కుట్టే పిల్లలు ఎవరి పిల్లలు? గనులలో పని చేసే పిల్లలు ఎవరి పిల్లలు? అందరూ మన పిల్లలే.

దేవ్లీ అనే ఎనిమిదేళ్ల బాలిక, "మీరు యింతకుముందే ఎందుకు రాలేదు?" అని ప్రశ్నించింది. ఆ ప్రశ్న నాకు వణుకు పుట్టించింది. దేవ్లీలాంటి వారు అటువంటి ప్రశ్నలు వేయకముందే మనం కళ్లు తెరవాలి. మనం సమిష్టిగా యీ సమస్యల్ని ఎదురుకోవాలి. ఇది చాలా అవసరం. ఒక్క నిముషం కూడా కాలయాపన చేయడానికి వీలులేదు. ఈ నిర్లక్ష్యాన్నీ, యీ మౌన సంస్కృతినీ నేను సహించలేను. కాబట్టి నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను. బాలల్ని వాళ్ల బాల్యత్వాన్నుండి విడదీయవద్దు. వాళ్లకి తగిన వసతుల్ని వనరుల్ని కల్పించండి. ఇది ప్రభుత్వ బాధ్యత. ఈ విషయ గురించి అవిరళంగా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అక్షరాస్యులైన ప్రతి వ్యక్తీ బాలల పక్షాన నిలబడండి. చేసిన వాగ్దానాలు మరిచిపోవద్దు. నాకు ఈనాటికీ నేను బడిలో చూసిన చెప్పులు కుట్టేవాని కుమారుడే గుర్తుకి వస్తూ ఉంటాడు. అతడు ఎందుకు స్కూలులో చదవడం లేదని నా ఉపాధ్యాయుల్ని అడిగాను. వారి వద్ద నా ప్రశ్నకి జవాబు లేదు. అతడి తండ్రిని అడిగాను, "మా తాత ముత్తాతలు చదువుకోలేదు. నేను చదువుకోలేదు. అందుకే వాడు కూడా చదువుకోలేదు. మేము నిరుపేదలం. మాకు చదువు ఎలా సాగుతుంది? మేము పని చేయడానికే పుట్టాము" అన్నాడు. ఈ సమాధానం నాకు కోపం తెప్పించింది. ఈ రోజుకి కూడా ఆ సంఘటన గుర్తుకి వస్తే కోపం వస్తూనే ఉంటుంది. అప్పుడే నేను దానిని వ్యతిరేకించాను. నేను కన్న కల యీనాటికీ నెమ్మదిగా అమలులోకి వస్తూంది. బాలల ముఖాల్లో సంతోషంతో వికసిస్తూంది. కాబట్టి సోదర సోదరీమణులారా! ఒక్కసారి కళ్లు మూసుకోండి. మీ చేతిని గుండె దగ్గర ఉంచండి. మీ బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకోండి.

ఈ రోజు నేను చాలామంది మహాత్మాగాంధీలను, మార్టిన్‌లూథర్‌కింగ్‌లను, నెల్సన్‌మండేలాలను చూస్తున్నాను. బాలలందరు వారితో కలిశారు. నేను కూడా కలిశాను. మీరు కూడా కలవండి. జ్ఞానాన్ని ప్రజాస్వామ్యం చేయండి. న్యాయాన్ని విశ్వజనీనం చేయండి. ప్రపంచవ్యాప్తంగా బాలల కోసం పాటుపడాలి. దోపిడీ నుండి విద్య దిశగా మనం ర్యాలీగా వెళ్దాం. మర్త్యత్వం నుండి దివ్యత్వం వైపు పయనిద్దాం.

కైలాస్ సత్యార్థి ప్రసంగానికి ముందు నోబెల్ కమిటీ చైర్మన్ ప్రసంగిస్తూ –

"ఈనాడు ప్రపంచం అంతా బాలల అంశాన్ని గురించి ఆలోచిస్తూంది. బాలలకి తమ బాల్యాన్ని అనుభవించడానికీ, విద్య నేర్చుకోడానికీ హక్కు ఉందని అందరూ గుర్తించారు. అంతేకాని వారిని బలవంతంగా పనులు చేయించుకోవడానికి ఉపయోగించ కూడదనే భావన ఉంది. ఈ భావన కైలాస్ సత్యార్థి వల్లా, మలాలా వల్లా కలిగింది. వారు బాలల అభివృద్ధి కోసం నడుం కట్టారు. వారిని యీ రోజు నోబెల్ శాంతి

బహుమతితో సత్కరిస్తున్నాం. వారిద్దరూ మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుస్తున్నారు. ఇటువంటి వారినే ఆల్‌ఫ్రెడ్ నోబెల్ "శాంతి వీరులు అంటాడు" అన్నాడు.

నోబెల్ బహుమతిని ప్రదానంచేసిన తరువాత బహుమతి గృహీతలకు విందు యిచ్చారు.

## ప్రశ్నలు - జవాబులు



**1. బాలల్ని పనులలోకి చేర్చుకోకుండా ఉంటే ఎలా బ్రతుకుతారు? అటువంటి పిల్లల్ని ఎవరు సాకుతారు?వారి తల్లిదండ్రులు బాగా వృద్ధులై, పేదవారైతే వారి గతి ఏమిటి?**

**జ :** మీరు చాలా మంచి ప్రశ్న అడిగారు. పేద కుటుంబాలలో ఉన్న బాలలను కార్మికులుగా మారిస్తే వారు ఎప్పుడూ బీదవారిగాను, నిరక్షరాస్యులుగాను, ఏ అవకాశాలు లేనివారుగాను మిగిలిపోతారు? వారు పెద్దవారైన తరువాత కూడా బలహీనంగా ఉండి కార్మికులుగానే ఉంటారు. భవిష్యత్తు తరాల వారు కూడా అలాగే ఉండిపోతారు. రెండవ విషయం ఏమంటే, బాలకార్మికుల తల్లిదండ్రులు ఏ ఉద్యోగం లేనివారై ఉంటారు. అందువల్ల కూలి తక్కువ యిచ్చి, ఎక్కువ పని చేయడానికి బాలల్ని ఉపయోగించుకుంటున్నారు. అంటే పెద్దవారు చేయవలసిన పనిని బాలలు చేస్తున్నారన్నమాట. మరి పెద్దవారు ఉద్యోగాన్వేషణలోనే ఉండిపోతున్నారు. ఆ విధంగా పని చేస్తున్న బాలలు తల్లిదండ్రులకు తగినంత ఆర్థిక సహాయం చేయలేకపోగా, తాము కూడా ఆర్థికంగా

యిబ్బందులు పడుతున్నారు. బాలల్లో అనాథలు కూడా ఉన్నారు. మరి వారిని ఎవరు సాకుతారు? ఆ బాధ్యత ప్రభుత్వం, సంస్థలు, మత సంస్థలు తీసుకోవాలి. ఆ విధంగా బాధ్యత తీసుకోకపోతే అటువంటి సంస్థలెందుకు? ప్రభుత్వాలెందుకు? బాలల ప్రాథమిక అవసరాలను వారే తీర్చాలి. వారి హక్కుల్ని కాపాడడం, అవకాశాలు కల్పించడం వారి బాధ్యతే. ప్రభుత్వం కొన్ని స్కీములు పిల్లల కోసం ప్రవేశపెట్టారు. వాటిని చిత్తశుద్ధితో అమలు చేయవలసిన అవసరం ఉంది.

ఇక మీ ప్రశ్నకు జవాబు. పదేళ్ల బాలునికి వృద్ధులైన తల్లిదండ్రులు సాధారణంగా ఉండరు. కాబట్టి యీ అంశాన్ని అందరికీ వర్తింపచేయలేము. బాలలకే గాయాలు ఎక్కువగా తగులుతాయి, పనిరీత్యా యిబ్బందులు ఎక్కువగా ఉంటాయి. వ్యాధులు కూడా రావచ్చు. వ్యాధులు వచ్చిన పిల్లల్ని పనిలో నుండి నిర్దాక్షిణ్యంగా తీసి వేస్తారు. జీవితాంతం వారు కష్టపడుతూనే ఉంటారు. ఎక్కువమంది సంతానం ఉంటే ఎక్కువమంది బాలలు పనిచేస్తే తమకు సాయం ఉంటుందనుకుంటారు పేదవారు. కాబట్టి బాలల్ని విముక్తుల్ని చేసి, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో వారికి నీడ కల్పించాలి. ప్రతి బాలుని యజమాని నుండి 20,000/- రూపాయిలు వసూలు చేయమని బాలకార్మిక చట్టం చెబుతుంది. ఈ డబ్బుని బాలల సంక్షేమ నిధిలో జమ చేయాలి. ఈ డబ్బుని బాలల విద్య కోసం, యితర పనుల కోసం వినియోగించాలి.

**2. పేదరికం నిర్మూలన అయ్యేవరకు బాలకార్మిక వ్యవస్థ ఉండవలసిందేనా?**

**జ:** ఏది ముందు జరుగుతుందో చెప్పలేము. బాల కార్మిక వ్యవస్థ వల్ల పేదరికం పెరుగుతుంది. ఎందుకంటే బాలలు నిరక్షరాస్యులుగానే ఉండిపోతారు. అందువల్ల పేదరికంలోనే మగ్గిపోతారు. అంటే పేదరిక నిర్మూలన కోసం ప్రయత్నించవద్దని నా ఉద్దేశం కాదు. బాల కార్మిక వ్యవస్థ పోయేవరకూ పేదరిక నిర్మూలన జరగదు. అలాగే పేదరికం పోయే వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జరగదు. బాలల కిచ్చే కూలి విషయం ఆలోచిస్తే బాలునికి రోజుకి 15/- రూపాయలిస్తారు. 60 మిలియన్ల బాలలు 900 మిలియన్లు రోజుకి సంపాదిస్తారు. మరి ఒక వ్యక్తి దీనికి సుమారు 8 రెట్లు సంపాదిస్తాడు. కాబట్టి అతడు యింటి ఖర్చులు పోగా తన పిల్లల్ని చదివించుకోగలడు. కాబట్టి నిరుద్యోగ సమస్య కొంతవరకు తగ్గుతుంది. పిల్లల భవిష్యత్తు మెరుగవుతుంది. సంఘంలో సమానత్వం, న్యాయం పెరుగుతుంది. అంతర్జాతీయ కార్మిక సంఘం చెప్పిందేమంటే, బాల కార్మిక వ్యవస్థకు ఖర్చు పెట్టే ప్రతి రూపాయి, వచ్చే 20 సంవత్సరాలలో ఏడు రూపాయిలు లాభాన్ని తెచ్చిపెడుతూంది.

## 3. బాల కార్మిక వ్యవస్థ ఏర్పడడానికి కారణాలేమిటి?

**జ :** బాలలపై నిర్దయ, గౌరవం, లేకపోవడమే కారణం. రెండవ కారణం రాజకీయంగా తగిన సాయం లేకపోవడం, కార్మిక చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడం. ప్రభుత్వాలు బాలలకు తగినన్ని నిధులు సమకూర్చడం లేదు. దానివల్ల వారికి సరియైన, నాణ్యమైన విద్య లభించడం లేదు. మూడవది గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన మొదలైన విషయాలపై చిత్తశుద్ధి లోపించడం. కూలి ఎంతో నిర్ణయించకపోవడం. వ్యవసాయోత్పత్తి లకు న్యాయమైన ధరను నిర్ణయించకపోవడం, నాణ్యమైన విద్యను నేర్పకపోవడం, కుల వ్యవస్థ, లింగ వివక్ష మొదలైనవి బాల కార్మిక వ్యవస్థకు, పేదరికానికి తోడ్పడుతున్నాయి. ఈ వ్యవస్థ వల్ల బాలలకు ఎంత హాని కలుగుతుందో గుర్తించకుండా వారిని పనిలోకి తీసుకుంటున్నారు. అందువల్ల తమ జీవనాధారం కోసం వారు గ్రామాలలో వ్యవసాయ రంగంలో పని చేస్తున్నారు. బాలలు చౌకగా దొరుకుతారు. వారిని హింసించినా మారు పలకరు. యజమానుల మీద ఒత్తిడి తీసుకు రాలేరు. ఎక్కువ గంటలు వారి చేత పని చేయించుకోవచ్చు.

## 4. బాల కార్మిక వ్యవస్థకు గల కారణాలను నిర్మూలించడం కష్టం. మరి ఆ వ్యవస్థని ఎలా నిర్మూలిస్తారు?

**జ :** ఈ ప్రశ్న విషయంలో నేను మీతో విభేదిస్తున్నాను. ఒక శతాబ్దం క్రితం బాల కార్మికవ్యవస్థ తీవ్రమైన సమస్యగా ఉండేది. అది ప్రపంచ వ్యాప్తంగా ఉండేది. అయితే ఆ దేశాలు యీ వ్యవస్థ కొనసాగితే సాంఘిక న్యాయం జరగదని భావించాయి. వారికి నాణ్యమైన విద్య యిప్పిస్తే ఉత్పత్తి పెరుగుతుందనీ, ఆర్థిక వ్యవస్థ బలపడుతుందనీ భావించాయి. అందువల్ల యీ వ్యవస్థని నిర్మూలించడానికి కంకణం కట్టుకున్నాయి. కేరళని చూడండి. అక్కడ అందరి బాలలకు విద్య లభిస్తూంది. దీనికి కారణం రాజకీయ నాయకుల దృఢ సంకల్పం ఉండడమే. తమిళనాడు, గుజరాత్‌లలో యీ దిశగా కృషి జరుగుతూంది. ఏ రాష్ట్రాలలో స్కీములు చక్కగా అమలు జరుగుతున్నాయో అక్కడ బాగా కృషి జరుగుతూంది. చిత్తశుద్ధితో సమిష్టిగా కృషి చేస్తే యీ వ్యవస్థ త్వరలో నిర్మూలించ బడుతుంది.

ఒక ఉదాహరణ చెబుతాను. బ్రెజిల్ దేశంలో "బోల్సా ఫెమీలియా" స్కీము ప్రవేశ పెట్టారు. దాని వల్ల పేదలకు తక్షణ సహాయం అందించడం జరుగుతూంది. బాలల హక్కుల్ని, మానవహక్కుల్ని పరిరక్షించడం జరుగుతూంది. దీనివల్ల పేదరికంలో పుట్టినందు వల్ల పేదరికంలోనే మగ్గిపోవలసిన అవసరం లేదనే ఋజువయింది. మెక్సికోలో కూడా

యీ స్కీము విజయవంతమైంది. భారత దేశంలో కూడా మధ్యాహ్న భోజన పథకం వచ్చింది. అలాగే వినియోగదారులు బాలలు ఉత్పత్తి చేసిన వస్తువుల్ని కొనడం మానివేశారు. మీడియా కూడా దీనిని గురించి విస్తృతంగా ప్రచారం చేస్తుంది. "రగ్‌మార్క్"ని ప్రవేశపెట్టడం జరిగింది. అలాగే దీపావళి పటాసుల ఫ్యాక్టరీలో కూడా బాలల్ని ఉపయోగించడం చాలా వరకు తగ్గింది.

**5. మీరు బాలలకు విద్య అవసరం అని గట్టిగా చెబుతున్నారు. నిరుద్యోగానికి సహాయ పడే విద్య వల్ల ఉపయోగం ఏమిటి? బాలలు పనిచేసి డబ్బు సంపాదిస్తున్నప్పుడు విద్యకు మొదటిస్థానం ఎందుకివ్వాలి?**

**జ :** ఈ విషయంలో సంఘం తప్పుగా అర్థం చేసుకుంది. దీనివల్ల సంఘంలో న్యాయం కొరవడింది. మనం చేసే పనులన్నీ విచక్షణ, అసమానత్వాల్ని ప్రేరేపించేవే అవుతున్నాయి. మన పిల్లల గురించి మనం ఎంత కృషి చేస్తాయో పేద పిల్లల యెడల కూడా మనం అలాగే ఆలోచించాలి. నియమాలు మారకూడదు కదా? "ఉద్యోగానికే విద్య" అనేది యిదివరకటి మాట. "శక్తిని సంపాదించడానికి విద్య" అనేది యిప్పటి నినాదం. కాబట్టి ప్రస్తుతం కాలంలో విద్య చాలా ముఖ్యం. విద్య లేదంటే మానవహక్కుల ఉల్లంఘనే. ప్రస్తుతం మన సంఘంలో సమానత్వం, మానవ విలువలు లోపించాయి. కాబట్టి ఉచిత నిర్బంధ విద్య నాణ్యత గలది ఎంతో అవసరం. అప్పుడు ఆ లోపాలు సమసిపోతాయి.

**6. మీరు యిచ్చిన వివరణ అంగీకారయోగ్యంగాఉంది. కొన్ని ఉదాహరణలు యివ్వండి.**

**జ :** ఉదాహరణలు యివ్వడానికి ప్రయత్నిస్తాను. ఆర్థికంగా భారతదేశం బలపడిందంటే దానికి కారణం ప్రభుత్వము, రాజకీయ నాయకత్వమే కాదు తెలివైన భారతయువత. వారు వైద్యరంగంలో, సాఫ్ట్‌వేర్ రంగంలో, సాంకేతిక సమాచార వ్యవస్థలో, యింకా యితర రంగాలలో తమ ప్రతిభని చూపిస్తున్నారు. వారు మన దేశానికి గర్వకారణం. ఏ దేశంలోనైనా ఆర్థికాభివృద్ధి జరిగిందంటే ఆ దేశంలో అక్షరాస్యత 40 శాతం ఉందన్నమాట. అక్షరాస్యుల యింట పుట్టిన బాలలు అయిదు సంవత్సరాల వయస్సు దాటగలరు. ప్రతి బాలునికి విద్య నేర్పితే రోగాల బారి నుండి రక్షణ లభిస్తుంది. అలాగే వ్యవసాయోత్పత్తి అధికంగా ఉండాలంటే విద్య తప్పనిసరి. ప్రజలు సమర్థత గల ప్రజాస్వామ్యాన్ని అందించ గలరు.

**7. కైలాస్‌గారూ! భారతదేశం సెక్యులర్ దేశం. అన్ని మతాలవారూ మానవత్వం గురించి ప్రచారం చేస్తూనే ఉన్నారు. అటువంటప్పుడు బాల కార్మికవ్యవస్థ చాలా కాలం క్రితమే నిర్మూలించబడేది కదా?**

**జ :** ఇటువంటి సందేహం మీకు ఎందుకు కలిగిందో నాకు అర్థం కాదు. మతాలకి, పిల్లలకి ఒక వింతయైన అనుబంధం ఉంది. మత ప్రసక్తి లేకుండా పిల్లలు జన్మిస్తున్నారు. ఫలానా మతం వాడివి అని మనం ఆ బాలునికి చెబుతున్నాం. ఆ మతానికి సంబంధించిన కర్మల్ని చేయిస్తున్నాం. మనమే వారిని ఒక మతానికి బంధిస్తున్నాం. అంటే మనం మానవత్వాన్ని మంట కలుపుతున్నాం.

ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ బాలలు పేదరికంలో మగ్గుతున్నారు. పోషకాహారం లభించకుండా పదిమంది చనిపోతున్నారు. 70 మిలియన్లు స్కూలు ముఖం చూడలేదు. 150 మిలియన్లు చదువు మధ్యలో ఆపివేస్తున్నారు. పిల్లలు అన్ని రంగాలలోను పనిచేస్తున్నారు.

ఎన్ని నీతులు వల్లించినా యీ వ్యవస్థలో ఎటువంటి మార్పు రాలేదు. ధనికుల ప్రభావం అన్ని మతాల వారి మీద ఉందనడానికి సందేహం లేదు. భారతదేశంలో బాలలు దేవుళ్లు, ఒక ఆడపిల్ల పూజించబడుతుంది. ప్రాచీన కాలంలో లింగవివక్ష లేదని తెలుస్తోంది. శ్రీరాముడు, శ్రీకృష్ణుని చరిత్రలే మన దేశ సంస్కృతికి నిదర్శనం. శ్రీకృష్ణుడు తన పేద స్నేహితుడైన కుచేలుని ఆదరించాడు. బైబిలులో కూడా పిల్లలంటే ఏసుక్రీస్తుకి చాలా యిష్టం. ఇస్లామ్‌లో మహమ్మద్ ప్రవక్త కుమార్తెను భగవంతుని వరంగా చెప్పాడు. ఖురాన్‌లో బాలలకు సమాన గౌరవం యివ్వాలని ఉంది. నేను ఒక వ్యక్తి వద్ద ఉర్దూ నేర్చుకున్నాను. అల్లా యొక్క కాంతి పిల్లల చిరునవ్వులో ఉంది.

ఒకసారి నేను ఏడేళ్ల బాలుని గాజు పరిశ్రమ నుండి విడిపించాను. అతడు కరిగిన గాజు అతని అరచేతి మీద పడి తీవ్రమైన గాయం అయింది. కనికరం లేకుండా ఆ యజమాని ఆ బాలుని కొట్టాడు. యజమాని ముస్లిమ్ ఆ బాలుని పేరు మహమ్మద్. తన ప్రవక్త పేరైనప్పటికీ ఆ ముస్లిమ్ యజమాని అతనిని తీవ్రంగా కొట్టాడు. ఇదే విధంగా సీత అనే 14 సంవత్సరాల బాలికను ఒక తివాచీ పరిశ్రమ యజమాని అత్యాచారం చేశాడు. 'సీత' అనే పేరు పవిత్రమైనది. అయినా అతనిని ఆ పేరు బాధించలేదు.

మేము చాలా కష్టాల్ని భరించి సాధ్యమైనంత వరకు బాల కార్మికుల్ని విడుదల చేయిస్తూనే ఉన్నాం. ఇటువంటి సంఘటనలన్నింటికీ మతంతో ప్రమేయం లేదు. మతం ముసుగులో పేదవారిని దోచుకుంటున్నారు. ఇంకా యీ వ్యవస్థ నిర్మూలించబడలేదు. బాల్య వివాహాలు కూడా అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయి.

**8. కైలాస్‌గారూ! మీరు ఉదహరించిన సంఘటనలు చాలా బాధ కలిగించాయి. మరి మన రాజ్యాంగం, చట్టాలు వీటిని గురించి ఏమంటున్నాయి?**

**జ :** నా ఉద్దేశంలో యిటువంటి సంఘటనలన్నీ మానవహక్కుల ఉల్లంఘనగానే పరిగణించాలి. ఈ వ్యవస్థని గురించి అంతర్జాతీయ సమావేశాలలో తీర్మానించిన నియమాల మీద భారతదేశం కూడా సంతకం చేసింది. కాని ఆ చట్టాలు సక్రమంగా అమలు జరగడం లేదు. 14 సంవత్సరాలలోపు బాలల్ని పనిలోకి పెట్టకూడదు. అంతవరకు వారి హక్కుల్ని కాపాడుతూ విద్యను వారికి అందించాలి. చాలా బలమైన చట్టాలు చేశారు. వాటికి భిన్నంగా ఎవరైనా ఆచరిస్తే జరిమానా విధించడమే కాక, జైలు శిక్ష కూడా అనుభవించవలసి వస్తుంది. అయితే చట్టాలు పూర్తిగా అవగాహన కాకపోవడం, ప్రభుత్వం యొక్క అలసత్వం, అవినీతి మొదలైన కారణాల వల్ల అవి సక్రమంగా అమలు కావడం లేదు.

**9. ఈ రోజుల్లో నల్లధనం, అవినీతి చాలా ఎక్కువగా ఉన్నాయి. వీటిని బాలకార్మిక వ్యవస్థతో మీరు ముడి పెట్టడం లేదా?**

**జ :** నిజమే. నల్లధనం, అవినీతి బాలకార్మిక వ్యవస్థకు దోహదం చేస్తున్నాయి. బాల కార్మిక వ్యవస్థ వల్లనే నల్ల ధనం పోగుపడుతూంది. లెక్కల ప్రకారం మన దేశలంలో 6 కోట్లు మంది బాలకార్మికులున్నారు. ప్రతి బాలునికి రోజుకి 15/- రూపాయిలు కూలి యిస్తున్నారు. అందరూ కలిసి 90 కోట్లు సంపాదిస్తున్నారు. వీరికి బదులు పెద్దవారిని నియమిస్తే, వారికి రోజుకి 115/- రూ॥ యిస్తే మొత్తం 600 కోట్లు వస్తాయి. కాబట్టి సరాసరిని యజమానులు ప్రతి యేట 1,20,000 కోట్లు దాచుకుంటున్నారు.

**10. నా వంటి సామాన్యుడు బాల కార్మిక వ్యవస్థని నిర్మూలించడానికి ఏ విధంగా సహాయపడగలడు?**

**జ :** సమస్యని గుర్తించినందుకు చాలా కృతజ్ఞతలు. మార్పు తప్పనిసరి. మనం అందరం సమిష్టిగా కృషి చేయవలసిన సమయం ఆసన్నమయింది. వ్యక్తిగతంగా మీరు చేయవలసింది ఏమంటే మీ యింటి పనికిగాని ఆఫీసు పనికిగాని బాలల్ని ఉపయోగించకుండా ఉండడమే. బాలకార్మికుల్ని ఉపయోగించేవారు స్నేహితులైనా సరే, వారి యిళ్లల్లో మంచి నీళ్లైనా తాగవద్దు. అలాగే ఎక్కడైతే బాల కార్మికుల్ని ఉపయోగిస్తున్నారో, అక్కడకు వెళ్లవద్దు. బాలలు ఉత్పత్తి చేసిన వస్తువుల్ని కొనవద్దు. మీ స్నేహితులను కూడా అలాగే చేయమనండి. బాల కార్మికుల తల్లిదండ్రుల్ని తమ పిల్లల్ని బడికి పంపమని ఒత్తిడి తీసుకుని రండి. బాలల్ని ఉపయోగించేవారిపై దాడి చేసి వారిని విడుదల చేయండి. ఎన్నికలలో నిలబడే వ్యక్తి బాల కార్మికవ్యవస్థకి వ్యతిరేకి అయితేనే వోటు వేయండి. మీడియాలో కూడా మంచి ప్రచారమే జరుగుతూంది. ఉద్యమాలలో పాల్గొనండి. మీరు మీవంతు కృషి చేయండి. వాయిదా వేస్తే సమస్య యింకా జటిలం అవుతుంది. భవితరాల అభ్యున్నతికి దోహదపడండి.

మీ ప్రశ్నలు అయిపోయాయి కాబట్టి ఒక కథ చెప్పి ముగిస్తాను.

ఒకనాడు పార్వతీపరమేశ్వరులు హిమాలయాలలో సంచరిస్తున్నారు. ఒక మావటివాడు ఏనుగు మీద ఎక్కి వెళ్తున్నాడు. ఏనుగు కాలి క్రింద చీమలు నలిగి చనిపోతున్నాయి. అప్పుడు పార్వతి శివునితో, "స్వామీ! చూడండి ఆ ఏనుగు చీమల్ని తొక్కి వేస్తున్నాయి. అవి చనిపోతున్నాయి. కాబట్టి ఆ ఏనుగుని ఆపండి" అంది. శివుడు పెడచెవిని పెట్టి యింకా నడుస్తూనే ఉన్నాడు. పార్వతికి కోపం వచ్చి, "నేను యింతగా చెబుతూన్నా వినిపించుకోరేమిటి? కనీసం మావటివానికైనా ఏనుగుని నడిపించవద్దని చెప్పండి" అంది. అయినా శివుడు నడక సాగిస్తూనే ఉన్నాడు. మళ్లీ పార్వతి యింకా కోపంతో, "పోనీ, చీమలన్నింటినీ చంపి వాటికి ముక్తినైనా కలిగించండి. ఏనుగుని, మావటిని శిక్షించండి" అంది. శివునికి కోపం వచ్చి "పార్వతీ! నువ్వే శిక్షకు అర్హురాలివి. చీమలు చనిపోతూ ఉండడం మొదట నువ్వే చూశావు. మావటి ఏనుగు మీద ఉండడం వల్ల అతనికి చీమలు కనపడవు. ఏనుగు తెలివిలేని జంతువు. మొదట నువ్వు చూసి, ఏదైనా చేయగలిగి ఉండీ కూడా ఏమీ చేయలేదు. కాబట్టి నువ్వే శిక్షార్హురాలివి" అన్నాడు.

కాబట్టి ఓ స్నేహితులారా! సంఘంలో చాలామంది అమాయకమైన చీమలలాంటి వారు. కొంతమంది ఏనుగు మావటి వంటివారు. పార్వతి వంటివారు చాలా మంది ఉన్నారు. వారు ఏమీ చేయరు. ఫిర్యాదులు మాత్రం చేస్తారు. ఎవరైనా ఆ పని చేస్తారని వేచి యుంటారు. కాబట్టి మనం వెంటనే స్పందించకపోతే, మనం చేయగలిగిందేమీ ఉండదు.

## 1980 నుండి 2014 వరకు కైలాస్ సత్యార్థి చేసిన కృషి

**1980** : కైలాస్ సత్యార్థి కొంతమందితో కలిసి బాలకార్మిక వ్యవస్థకి వ్యతిరేకంగా మొదట ఉద్యమం నడిపాడు.

15 సంవత్సరాలు సాబూ అనే బాలికను, మరి 34మందిని ఇటుక పరిశ్రమ నుండి విముక్తి కలిగించాడు.

**1981** : రాతి క్వారీలో పనిచేసే కార్మికుల్నీ, ఇటుక పరిశ్రమలోని కార్మికుల్నీ సంఘటితం చేశాడు.

సుప్రీం కోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశాడు.

**1982** : పది రాష్ట్రాలలో కార్మికుల్ని విడుదల చేసే కార్యక్రమాలు చేశాడు.

**1983** : సుప్రీంకోర్టు యొక్క చరిత్రాత్మక తీర్పు. దీనివల్ల వేలాది కార్మికులు విడుదల అయ్యారు.

**1984** : తివాచీ పరిశ్రమలో ఉన్న బాల కార్మికుల్ని విడుదల చేయడం మొదలుపెట్టాడు.

బచ్‌పన్ బచావో ఆందోళన్ కార్యకర్త యొక్క హత్య.

**1985** : రామ్‌గంజ్‌మండిలో కైలాస్ యింకొక ముగ్గురు ఆందోళన కారులపై దాడి జరిగింది. వారు గిరిజన బాలికల్ని, స్త్రీలను విడిపించే సమయంలో యీ సంఘటన జరిగింది.

బచ్‌పన్ బచావో ఆందోళన్ కార్యకర్త ఆదర్శకిషోర్ హత్యకు గురి అయ్యాడు.

**1986** : భారత పార్లమెంటు బాల కార్మిక చట్టాన్ని ప్రవేశపెట్టింది. నేపాల్‌లో బచ్‌పన్ బచావో ఆందోళన్ కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి.

**1987** : పాకిస్తాన్‌లో బచ్‌పన్ బచావో ఆందోళన కార్యక్రమం మొదలుపెట్టబడింది.

మందసార్‌లోని బలపాల పరిశ్రమ నుండి వందలాది కార్మికుల విడుదల 2000 మంది కార్మికుల కుటుంబాలు బలపాల పరిశ్రమ నుండి విడుదల అయ్యారు. దీనికి సుప్రీంకోర్టు సహాయపడింది.

**1988** : 400ల సంవత్సరాలుగా దేవాలయాలలోకి ప్రవేశం నిషేధం విధించబడిన దళితుల చరిత్రాత్మక ఆలయ ప్రవేశం.

కైలాస్‌ని, అయిదుగురు దళితుల్ని పురోహితులు చితకబాదారు.

**1989** : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు దక్షిణాసియా దేశాల కలయిక (SACCS). నేపాల్, పాకిస్తాన్, బంగ్లాదేశాలలోను బాలకార్మికులు కూడా దీనిలో చేరారు.

**1990** : బాల కార్మికుల కోసం ముక్తి ఆశ్రమం అనే పునరావాస కేంద్రం ఏర్పాటు. ఈ కేంద్రంలో విద్య కూడా నేర్పుతారు.

జర్మనీ మొదలైన దేశాలలో తివాచీ పరిశ్రమలో వినియోగదారుల ఉద్యమం.

**1991** : దీపావళి సామాను తయారీలో బాల కార్మికుల్ని ఉపయోగించకుండా ఉద్యమం.

**1992** : దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సమావేశం. పాకిస్తాన్, నేపాల్‌లలో తివాచీ పరిశ్రమకు వ్యతిరేక పోరాటం.

**1993** : 2000 కి.మీ. బీహార్ – ఢిల్లీ ర్యాలీ.

వినియోగదారుల ఉద్యమం – ఐరోపాలోను, అమెరికాలోను తివాచీ పరిశ్రమ

వ్యతిరేక ఉద్యమం.

"రగ్‌మార్క్" ఉద్యమం.

**1994** : భారతయాత్ర – కన్యాకుమారి నుండి ఢిల్లీకి 5000 కి.మీ. దూరం.

"రగ్‌మార్క్" ఆచరణలోకి వచ్చింది.

**1995** : దక్షిణాసియా ర్యాలీ – కోల్‌కతా నుండి ఖాట్మండు వరకు

ఇళ్లలో పనికి ఉపయోగించడాన్ని వ్యతిరేకించే ఉద్యమం. ప్రభుత్వ ఉద్యోగుల యిళ్లల్లో పనిచేసే బాలల విడుదల చేయించడం.

బాల కార్మికవ్యవస్థకు సంబంధించి పార్లమెంటరీ ఫోరమ్ ఏర్పాటు.

**1996** : క్రీడా పరికరాల పరిశ్రమలో బాలల్ని ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం.

మొదటిసారిగా భారతదేశంలో బాల్‌సంసద్ (బాలల పార్లమెంటు) ఏర్పాటు. దీనిలో 10,000 మంది బాలలు పాల్గొన్నారు.

**1997** : రాజస్థాన్‌లో బాల్ ఆశ్రమ్ (రెండవ పునరావాస కేంద్రం) ఏర్పాటు.

ఢిల్లీలో బాలికా ఆశ్రమ్. ఇది కూడా బాలికలకు పునరావాస కేంద్రం ఏర్పాటు.

**1998** : ప్రపంచ ర్యాలీ. దీనిలో 103 దేశాలు పాల్గొన్నాయి. దూరం 80,000 కి.మీ. 7.2 మిలియన్ల బాలలు, స్త్రీలు, పురుషులు పాల్గొన్నారు. అంతర్జాతీయంగా బాలకార్మిక వ్యవస్థని నిర్మూలించాలని డిమాండ్.

**1999** : అంతర్జాతీయ కార్మిక వ్యవస్థ యొక్క సదస్సు. ఈ సదస్సులో బాల కార్మిక వ్యవస్థ యొక్క నిర్మూలనకు ఒప్పందం జరిగింది.

విద్య అందరికీ కావాలని ప్రపంచ వ్యాప్త ఉద్యమం.

**2000** : మొదటి అంతర్జాతీయ రౌండ్‌టేబుల్ సమావేశం. దీనిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్య అంశాలపై చర్చ జరిగింది. అమెరికాలోని సంఘాలు పాల్గొన్నాయి. విద్య గురించి ప్రపంచవ్యాప్త కార్యాచరణ వారం ప్రారంభమయింది.

విద్య గురించి పార్లమెంటరీ ఫోరమ్ ఏర్పాటు.

**2001** : విద్య ప్రాథమిక హక్కుగా పరిగణించాలని, ఆ విధంగా రాజ్యాంగ సవరణ కోరుతూ శిక్షాయాత్ర జరిగింది.

"బాల్‌మిత్రగ్రామ్" ప్రారంభమయింది. బాలకార్మిక వ్యవస్థకి వ్యతిరేకంగాను, బాలల విద్య కోసం యిది ఆదర్శవంతంగా జరగడానికి ఏర్పాటయింది.

**2002** : సాకర్ పరిశ్రమలో బాలల్ని ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచకప్ ఉద్యమం. సర్కస్ ప్రదర్శనలలో బాలల్ని ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ పరిశోధన, ఉద్యమం ప్రారంభం విద్య కోసం వెచ్చించే నిధుల్ని ఎక్కువ చేయాలని ఉద్యమం.

**2003** : మొదటిగా జాతీయ బాలల అసెంబ్లీ (పంచాయితి) ఏర్పాటు.

అఖిల భారత సర్కస్ సమావేశం. బచ్‌పన్‌బచావో ఆందోళనకారులకు భారత సర్కస్‌వారికి మధ్య భేదాభిప్రాయాలు.

**2004** : కైలాస్ సత్యార్థి, బచ్‌పన్‌బచావో ఆందోళనకారులపై సర్కస్ మాఫియా దాడి.

బలవంతగా బాలల్ని పనులలో ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం.

**2005** : న్యూఢిల్లీలో బాల కార్మికవ్యవస్థ నిర్మూలనకు, విద్య కోసం రెండవ ప్రపంచ కాంగ్రెస్‌కు ఆతిథ్యం.

దుస్తుల విక్రయ విభాగాలలో బాలలను ఉపయోగించడాన్ని నిరసిస్తూ మొదటి పరిశోధనా విభాగం ఏర్పాటు.

**2006** : పదేళ్ల బచ్‌పన్ బచావో ఆందోళన ఫలితంగా 2006వ సంవత్సరం, అక్టోబరు 10వ తేదీన బాలకార్మిక వ్యవస్థ నిషేధించబడింది.

25 సంవత్సరాల బచ్‌పన్‌బచావో ఆందోళన్ ఫలితంగా బాల కార్మిక వ్యవస్థకు నిషేధిస్తూ రాష్ట్రపతి న్యాయాధికారుల చేత ప్రమాణం చేయించుట. (బచ్‌పన్ బచావో రజతోత్సవ సందర్భంగా)

**2007** : దక్షిణాసియా ర్యాలీ. 5000 కి.మీ. దూరం. మిలియన్‌మంది దీనిలో పాల్గొన్నారు.

ప్రపంచంలో అతి పెద్ద దుస్తుల కంపెనీ నుండి బాలల విముక్తి.

బచ్‌పన్ బచావో ఆందోళన్ ఒక ప్రమాణ విధానాన్ని ప్రభుత్వానికి అందించింది.

**2008** : భారత కార్యాచరణ వారం – ఈ వారంలో 500 మంది బాల కార్మికులు విడుదల అయ్యారు.

దక్షిణాసియా కాంగ్రెస్ సదస్సు.

**2009** : బాల కార్మికులను ఉపయోగించే పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా, పోలీసు శాఖ, ప్రభుత్వ శాఖలకు ఆదేశాలిస్తూ హైకోర్టు తీర్పు.

నేపాల్‌లో బాలల విద్యాహక్కును కోరుతూ ర్యాలీ.

బాలల హక్కుల్ని కాపాడుతూ అఖిల భారత న్యాయ సలహా సంఘాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది.

**2010** : బాలల హక్కైన విద్యాహక్కుని అంగీకరిస్తూ ప్రభుత్వం ఉచిత, నిర్బంధ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఉపాధికల్పనా కేంద్రాలను రిజిస్టర్ చేసుకోడానికి క్రమబద్ధీకరించడానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది.

**2011** : సర్కస్‌లలో బాలల్ని ఉపయోగించడాన్ని నిషేధిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు.

తప్పిపోయిన బాలల గురించి ప్రమాణ విధానాన్ని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు.

భారతదేశంలో తప్పిపోయిన బాలల గురించి పరిశోధన.

**2012** : 2009వ సంవత్సరంలో చేసిన విద్యాహక్కు చట్టంలోని రాజ్యాంగ సవరణకు సుప్రీంకోర్టు ఆమోదం. భారతదేశ ప్రధాన న్యాయమూర్తి చేత (ఆల్టమస్‌కబీర్) ర్యాలీ ప్రారంభం.

**2013** : తప్పిపోయిన బాలల గురించి ప్రాథమిక విచారణ నమోదు చేయవలసిందిగా సుప్రీంకోర్టు ఆదేశం.

బచ్‌పన్‌బచావో ఆందోళన్ సమర్పించిన సూచనల్ని జస్టిస్ వర్మ కమిటీ యధాతథంగా ఆమోదించి భారత శిక్షాస్మృతిలో సెక్షన్ 370, 370Aలుగా నమోదు చేయబడ్డాయి.

జార్ఖండ్‌లో కోడెర్మా వద్ద బాల కార్మిక వ్యవస్థ, బాలలకు విద్య గురించి సదస్సు.


గోర్డన్ బ్రౌన్ అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రపంచ విద్యా కమిటీ ప్రతినిధి. అతడు ముక్తి ఆశ్రమాన్ని సందర్శించాడు.

**2014** : బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా కైలాస్ సత్యార్థి ఒక గేయాన్ని రచించాడు. దీనిని ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంనాడు నరేంద్రసింగ్ తోమార్ ఆధ్వర్యంలో జస్బీర్ జస్సీచేత యీ గేయం ఆలాపించబడింది.

నరేంద్రసింగ్ తోమార్ తన నెల జీతాన్ని విరాళంగా బచ్‌పన్‌బచావో ఆందోళన్‌కు యిచ్చాడు.

ఈ సంవత్సరం కైలాస్ సత్యార్థికి నోబెల్ శాంతి బహుమతి లభించింది.

దీనిలో మీరు కూడా భాగస్వామ్యులు కండి అంటాడు సత్యార్థి.




కాపీల కొరకు సంప్రదించండి :

**SAI VENKATESWARA BOOK DEPOT**

# 26-27-77, Opp.Bata Show Room,Station Road,
Gandhinagar, Vijayawada - 520 003.
Ph : 0866-6663733, 2444156.

* * *

**SRI VENKATESWARA BOOK DEPOT**

Plot No.3, 103, # 2-4-1085, Sai Lakshmi Niketan,
Opp. Street of Ramakrishna Hospital,
Near Kachiguda Kumar Theatre, Nimboli Adda,
Hyderabad - 500 027 Ph : (040) 65528228, 24653879
Fax : 24745257, Cell : 9346771314

బాలల హక్కుల పోరాట యోధుడు

# కైలాస్ సత్యార్థి

నోబెల్ బహుమతి గ్రహీత




VICTORY

విక్టరీ పబ్లిషర్స్

# 30-17-3ఎ, వారణాసి వారి వీధి, సీతారాంపురం,
విజయవాడ - 520 002, ఫోన్ : 0866-2444156